Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :296 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు గురువారం 19 ఫిబ్రవరి 2026 పేజీలు :12 వేల రూ5 /-


## ధరణి దోపిడీపై
# ఉక్కుపాదం



**: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18** : ధరణి దోపిడీపై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో ధరణిపై ఉన్నత స్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణి వ్యవహారంలో తీగ లాగితే డొంక కదిలినట్లు అక్రమాలు బయటపడుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ విచారణలో స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల భారీ దోపిడీ బయటపడిందన్నారు. ధరణి పోర్టల్‌లో లోపాలు సాంకేతికం కాదని.. వ్యవస్థాగతంగా సృష్టించినవేనని తెలిపారు.అనుమానాస్పద భూముల డేటా, లాగిన్ వివరాలు డిలీట్ చేసినట్లు గుర్తించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వెంటనే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విదేశీ సంస్థ టెర్రాసిస్ నిర్వహణ వల్లే సమస్యలంటూ ఆరోపణలు వచ్చాయని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ధరణి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి పైసా వసూల్ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## రాజ్యసభ ఎన్నికల
# షెడ్యూల్ విడుదల..
### మొత్తం 37 స్థానాలకు మార్చి 16న ఎన్నికలు...

**న్యూఢిల్లీఫిబ్రవరి 18:**రాజ్యసభ ఎన్నికలకు నగారా మోగింది. త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్ బుధవారం విడుదల అయింది. తెలంగాణ నుంచి 2 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 10 రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న ఈ రాజ్యసభ ఖాళీ కానున్న స్థానాలకు నోటిఫికేషన్ - మిగతా3లో






## రెండు పార్టీలు తెలంగాణ
# వ్యతిరేకం...

**హైదరాబాద్, ఫిబ్రవరి 18:**కాంగ్రెస్, బీజేపీలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం జెండాలు, అజెండాలు పక్కనపెట్టి దిగజారుడు రాజకీయాలు చేశారని విమర్శించారు. బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ బీటీమ్ అంటూ కాంగ్రెస్... కాంగ్రెస్ కు బీఆర్ఎస్ బీటీమ్ అంటూ బీజేపీ.... గత 12 ఏళ్లుగా చేసిన ప్రచారమంతా తప్పుడు ప్రచారమేనని తేలిపోయిందని అన్నారు. ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని తేలిపోయిందని చెప్పారు. "మార్పు అంటే బీజేపీతో కలవడమా? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు?" అని సీఎం రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో కొట్టుకున్నట్టు నటిస్తూ... గల్లీలో చేతులు కలుపుకుని వాటాలు పంచుకుంటున్నారని ఆరోపించారు. సిర్పూర్ కాగజ్ నగర్, మెట్ పల్లి, అమన్ గల్, అలియాబాద్, నర్సాపూర్ ఫలితాలే దీనికి సాక్ష్యమని చెప్పారు.బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చి కుట్రలకు తెరలేపాయని, రాబోయే రోజుల్లో ప్రజలే వీళ్లకు బుద్ధి చెబుతారని హరీశ్ రావు గట్టిగా చెప్పుకొచ్చారు.

## రోడ్ల అభివృద్ధికి పారదర్శకంగా
# నిధులను వినియోగించాలి

**: మంత్రి కోమటిరెడ్డి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18** రోడ్లు, భవనాల శాఖ 2026–27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సచివాలయంలో ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, సీఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బీవీ రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు, పలువురు ఆర్ అండ్‌బీ అధికారులు హాజరయ్యారు. గత ఏడాది బడ్జెట్, పనుల పురోగతి, విడుదలైన నిధులపై కూలంకషంగా మంత్రి కోమటిరెడ్డి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

**అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖది కీలక పాత్ర..**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు, భవనాల శాఖ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. స్పష్టమైన ప్రణాళికతో వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు లాంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2047 రైజింగ్ తెలంగాణ నినాదంలో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధి.. అత్యంత కీలకమని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. 'హ్యామ్' రోడ్ల నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నామని తెలిపారు.

**కేంద్ర మంత్రులను కలుస్తా..**



ఇప్పటికే ఉన్న బాలారిష్టాలు దాటేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేశామని.. అధికారులు కూడా మనసుపెట్టి పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వాటాపై కన్ఫ్యూజన్ లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్ – విజయవాడ (చీఎ 65) 8వ లైన్ విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిసి మరోసారి కోరతామని అన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన రోడ్డు ఇదని... ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడ రెండున్నర గంటల్లో చేరుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కేంద్రప్రభుత్వం సహకారం అందించే ఆయా ప్రాజెక్టుల్లో వేగం పెంచాలన్నారు. ఈ విషయంలో తాను కేంద్ర మంత్రులను కలుస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

## కళ్లజోడు..
# ఏఐ తోడు

### ఇండియా ఏఐ సమ్మిట్‌లో ధరించిన ప్రధాని మోదీ
### అభివృద్ధి చేసింది బెంగళూరు స్టార్టప్.. 'సర్వం ఏఐ'



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** ఏఐ కళ్లజోళ్లు అనగానే అందరికీ గూగుల్, మెటా, యాపిల్ వంటి అంతర్జాతీయ టెక్ దిగ్గజ కంపెనీలు అభివృద్ధి చేస్తున్నవే గుర్తొస్తాయి! కానీ.. మన ఇండియాలోనూ 'సర్వం ఏఐ' అనే స్టార్టప్ సంస్థ కృత్రిమ మేధ పరిజ్ఞానంతో పనిచేసే కళ్లజోళ్లను రూపొందిస్తోంది! బెంగళూరుకు చెందిన ఆ స్టార్టప్ సంస్థ 'సర్వం కేజ్' పేరిట రూపొందించిన ఏఐ గ్లాసెస్.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో ప్రధాన ఆకర్షణగా మారాయి. ప్రధాని మోదీ మంగళవారం ఆ కళ్లజోడును ధరించి, ఆసక్తిగా దాని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ఫొటోను సంస్థ సహ వ్యవస్థాపకుడు ప్రతరీ?ృషకుమార్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ కళ్లజోడును మొదటిసారి పెట్టుకుని ప్రయత్నించింది ప్రధాని మోదీయేనని పేర్కొన్నారు. దాన్ని డిజైన్ చేసింది, తయారుచేసింది భారత్‌లోనే అని.. దాంట్లో ఉన్న కృత్రిమ మేధ కూడా భారత్‌దేనని స్పష్టం - మిగతా3లో

## భాగ్యనగర పరిశుభ్రతలో
# నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

**: సీఎస్ రామకృష్ణారావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 18** : భాగ్యనగర పరిశుభ్రతలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌ని పరిశుభ్రంగా ఉంచాలని దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో ఇవాళ(బుధవారం) సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.ఈ క్రమంలో



గ్రేటర్ హైదరాబాద్ పరిశుభ్రతపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. భాగ్యనగరంలో రోజుకు 7,800 టన్నుల చెత్త సేకరణ జరుగుతోందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 4,500 స్వచ్ఛ ఆటోలతో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 18,557 మంది శానిటేషన్ సిబ్బంది సేవలు అందిస్తున్నట్లు అధికారులు నివేదికలో ప్రస్తావించారు. తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించినట్లు స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులకు సీఎస్ రామకృష్ణారావు హెచ్చరించారు.

## 23 తర్వాత పరిషత్
# ఎన్నికల నోటిఫికేషన్




**హైదరాబాద్, ఫిబ్రవరి 18:**తెలంగాణలో పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు పూర్తి కావడంతో ఇప్పుడు అందరి దృష్టి పరిషత్ ఎన్నికలపై పడింది. ఈ క్రమంలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం తెలంగాణ సర్కార్ సమాయత్తం అవుతోంది. దీంతోపాటు జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి చర్చించేందుకు ఈనెల 23న తెలంగాణ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ మంత్రివర్గ సమావేశం తర్వాత.. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ఒక క్లారిటీ రానుందని తెలుస్తోంది.రాష్ట్రంలో మరో ఎన్నికలకు రంగం సిద్ధం అవుతోంది. సర్పంచ్, మున్సిపాలిటీ ఎన్నికలు పూర్తి కావడంతో రేవంత్ రెడ్డి సర్కార్.. స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. త్వరలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగానే ఈనెల 23వ తేదీన తెలంగాణ మంత్రి వర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ భేటీలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతోపాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల నిర్వహణపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు తెలంగాణ మంత్రిమండలి సమావేశం కానుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై.. సీఎం, మంత్రులు చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా తెలంగాణ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై కీలక చర్చలు జరపనున్నారు. అదే సమయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పరిషత్ ఎన్నికల గడువు పూర్తి కావడం.. ఇటీవలె సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ముగియడంతో.. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించే యోచనలో రేవంత్ సర్కార్ ఉంది.అదే సమయంలో త్వరలోనే జీహెచ్ఎంసీ పాలకవర్గం గడువు కూడ ముగియనుండటంతో ఆ ఎన్నికలపైనా కేబినెట్ భేటీలో చర్చలు జరపనున్నారు. ఇక ఇటీవలె జీహెచ్ఎంసీని 3 కార్పొరేషన్లుగా విభజించగా.. ఎన్నికలు ఎలా నిర్వహించాలి, ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి, వాటిని ఎలా అధిగమించాలి అనే దానిపై చర్చించనున్నారు.మరోవైపు.. - మిగతా3లో

## రాజ్యసభ కోసం
# పోటీ..



**హైదరాబాద్, ఫిబ్రవరి 18:**తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రస్తుత సభ్యులు అభిషేక్ మను సింఘ్వి , కె.ఆర్. సురేష్ రెడ్డి ల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. వీరిలో సింఘ్వి కాంగ్రెస్ నుంచి.. సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపికయ్యారు. మార్చి 16న జరగనున్న ఈ ఎన్నికల్లో శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. పార్టీల బలాబలాల విశ్లేషణను పరిశీలిస్తే, 119 స్థానాలున్న తెలంగాణ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి సుమారు 40 మొదటి ప్రాధాన్యతా ఓట్లు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉండటమే కాకుండా, ఇతర పార్టీల నుండి చేరిన ఎమ్మెల్యేల మద్దతుతో రెండు స్థానాలను సులువుగా గెలుచుకునే అవకాశం ఉంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ తన వద్ద ఉన్న సంఖ్యాబలం సరిపోకపోవడంతో ఈసారి తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. బీజేపీ, మజ్లిస్ ఎవరికీ - మిగతా3లో

## సంపాదకీయం


# ఈ ఒప్పందంతో.. దేశ రైతాంగానికి ఉరే!

భారత్–అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. అమెరికా అధికార వర్గాలు దీన్ని తమ రైతులకు లాభదాయకమని పేర్కొనడంతో..ఈ ఒప్పందం రైతాంగానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో, ఈ వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ఎవరి విజ్ఞప్తులను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె నిర్వహించాయి. ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ.. ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు.. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో? కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. 'పంట మనది – లాభం పరాయిది' అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు.. ఎంఎస్‌పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే. దేశానికి సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించక పోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఇది రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అసవరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. ఈ ఒప్పందం పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశు గ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అందుకే రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రాలను సంప్రదించ కపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక 'కూలీ'గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర–రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.. వీరిద్దరి మధ్య పోటీ అనేది అసమానమైనది. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకొని... భారత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# నేడు శివాజీ మహారాజ్ జయంతి

### ఓటమి ఎరుగని ధీరుడు,హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్

ఓటమి ఎరుగని ధీరుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్.. ఆయన క్రీ.శ. ఫిబ్రవరి 19, 1630వ సంవత్సరం వైశాఖమాసపు శుక్లపక్ష తదియనాడు పూణె జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర గల శివనేరి కోటలో శహాజీ, జిజాబాయి పుణ్యదంపతులకు జన్మించాడు. వీరు మహారాష్ట్రలోని వ్యవసాయ కున్బీ కులానికి చెందినవారు. జిజాబాయికి శంభాజీ తర్వాత పుట్టిన కొడుకులు అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై (పార్వతి) పేరు శివాజీకు పెట్టింది. శివాజీ తండ్రి షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా పనిచేస్తూ మొఘల్ రాజులకు వ్యతిరేకంగా అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. షాజహాన్ దండయాత్ర చేసిన సమయంలో కీలకపాత్ర పోషించాడు. తన సహచరుడిని నిజాంషాహీ ప్రభువు హత్యచేయించడంతో తిరుగుబాటు బావుటాను ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్య స్థాపనకు నాంది పలికాడు. రాజ్య విస్తరణ కోసం చేసిన యుద్ధాలలో పరాజయాన్ని చవిచూశాడు. తండ్రి వద్ద యుద్ధవిద్యలు, రాజనీతి మెలుకువలు నేర్చుకున్న శివాజీ తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనేక నూతన యుద్ధతంత్రాలను రూపొందించాడు. సకలవిద్యలను అవపోసన పట్టిన ఆయన మరాఠాసామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలను రచించాడు. 17 సంవత్సరాల వయస్సులోనే సూల్తానులలో యుద్ధాలకు తలపడిన శివాజీ బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. యుద్ధ భయంకరుడుగా పేరుపొందిన అఫ్జల్‌ఖాన్ శివాజీ మెరుపు దాడులు, గెరిల్లా యుద్ధ పద్ధతులు తెలుసుకుని ఆయనను రెచ్చకొట్టేలా శివాజీకి ఇష్టదైవమైన భావానీదేవి ఆలయాన్ని కూల్చివేశాడు. అఫ్జల్ కుట్రలు తెలుసుకున్న శివాజీ ప్రతాప్‌ఘడ్ కోట లోసమావేశానికి అంగీకరిస్తాడు, ముందు జాగ్రత్తగా ఉక్కుకవచాన్ని ధరించి పిడిబాకును దాచుకుని చర్చలకు సిద్ధమవుతాడు.శివాజీ ని అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకున్న అఫ్జల్ కత్తితో శివాజీపై దాడి చేస్తాడు, ఉక్కుకవచం కారణంగా రక్షించబడిన శివాజీ వెంటనే పిడిబాకులో దాడిచేస్తాడు, సైనికాధికారి చేతిలో అఫ్జల్ ఖాన్ మరణించగా మెరుపుదాడుల్లో సైనాన్ని మట్టికరిపిస్తాడు. ప్రతాప్ ఘడ్ యుద్ధంతో శివాజీ కీర్తిప్రతిష్టలు భారతదేశమంతటా వ్యాపిస్తాయి. ఎందరో హిందూ రాజులు ఆయన కు సంఘీభావం తెలియజేస్తారు. అఫ్జల్‌ఖాన్ మరణాన్ని సహించలేని బిజాపూర్ సుల్తాన్ పదివేలమంది అతిబలవంతులైన సైనికులను శివాజీని అంతమొందించడానికి పంపిస్తాడు. ఐదు వేలమంది మరాఠాయోధులతో హరహరమహా దేవ అంటూ విజృంభించిన శివాజీ వారిని ఊచకోతకోశాడు. శివాజీ పరాక్రమాలను తెలుసు కున్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ముందుజాగ్రత్తగా అపారమైన సైనికశక్తిని, సిద్ది జోహార్ అనే సైనికాధ్యక్షుడిని కొల్హాపూర్‌లో మోహ రిస్తాడు. సమీపంలోని పన్‌హాలా కోటలో వందలమంది అనుచరులతో ఉన్న శివాజీ విషయం తెలుసుకుని కోటనుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. ఈ యుద్ధంలో అతిఎక్కువమంది సైనికులను కోల్పోయిన శివాజీ సంధికి అంగీకరిస్తాడు. ఈ సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర్య రాజ్యంగా గుర్తింపు, సిద్ది జోహార్ విజయానికి బహుమతిగా పన్‌హాలా కోట దక్కింది. సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరు పోరు పవన్ ఖండ్ యుద్ధం. శివాజీతో యుద్ధంలో ఎలాగైనా విజయం సాధించాలన్న లక్ష్యంతో ఔరంగజేబు తన మేనమామ షాయిస్తాఖాన్



వెంట లక్షకు పైగా సైన్యాన్ని, ఆయుధాలను ఇచ్చి దక్కన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశిస్తాడు. అయితే మొగల్‌సేనల ముందు మరాఠి సేనలు నిలువలేక పోతారు. ఓటమిని అంగీకరించిన శివాజీ పూణే వదిలి వెళ్లిపోతాడు. శివాజీ నిర్మించిన లాలామహల్ లో షాయిస్తాఖాన్ నివాసం ఏర్పాటుచేసుకుని, శివాజీ దాడి నుంచి ముందస్తుజాగ్రత్తగా పూణే నగరమంతా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేసుకుంటాడు. మారువేషంలో వచ్చిన శివాజీ షాయిస్తాఖాన్ గదిలోకి చేరి కత్తితో దాడి చేస్తాడు. గాయపడిన ఖాన్ సైనికుల సహాయంలో ప్రాణాలు దక్కించుని ఔరంగజేబు వద్దకు చేరుతాడు. తిరిగి తన కోటను స్వాధీనం చేసుకున్న శివాజీ సూరత్ నగరం పై దాడి చేసి అపారమైన ధనాన్ని, ఆయుధాలను దోచుకుని తన సైన్యాన్ని బలోపేతం చేసుకుని క్రమంగా మొఘలుల, బీజాపూర్ సుల్తానుల కోటలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటాడు. మొఘల్ సర్దార్‌గా ఉండడానికి అంగీకరించి 23కోటలను, నాలుగు లక్షల రూపాయలను చెల్లిస్తాడు. ఔరంగజేబు తన పుట్టినరోజు సందర్భంగా శివాజీని , అతని ఆరేళ్ల కొడుకు శంభాజీని ఆహ్వానించి నిండుసభలో అవమానపరుస్తాడు. మరాఠీల తిరుగుబాటుకు బయపడి శివాజీని హతమర్చకుండా అతిధిగృహంలోనే బందీచేస్తాడు. చాకచాక్యంతో అక్కడినుంచి తప్పించున్న శివాజీ రహస్యంగా తన కార్యకలాపాలు నిర్వహిస్తూ 1674 నాటికీ లక్షమంది సుశిక్షితులైన సైన్యాన్ని, ఆయుధాలను, అశ్వాలను, గుఢాచారి వ్యవస్థను, నౌకావ్యవస్థను ఏర్పాటుచేసుకుంటాడు. శ్రీశైలం వచ్చి అక్కడ భవానీదేవిని ధ్యానిస్తాడు. ఆయన భక్తికి మెచ్చిన దేవి ప్రత్యేక్షమై ఖడ్గాన్ని ప్రసాదిస్తుంది.(ఇప్పటికీ ఆ ఖడ్గం మ్యూజియంలో ఉంది.) మరాఠ సామ్రాజ్యాన్ని విస్తరించాలన్న ఆకాంక్ష, దేవి ఆశీస్సులు ఉన్న ఖడ్గంతో శివాజీ ఎన్నో కోటలను సులువుగా స్వాధీనం చేసుకున్నాడు. కొండ కోట ను స్వాధీనం చేసుకోవడానికి అత్యంత గొప్ప సైనికాధికారిగా పేరు తెచ్చుకున్న తానాజీని పురమాయిస్తాడు శివాజీ. కోట నిర్మాణాన్ని క్షుణ్ణంగా పరిశిలించిన తానాజీ యశ్వంతి అనే ఉడుముకు తాడు కట్టి కొండపైకి విసిరి, ఆ తాడు హాయంతో కోట లోకి ప్రవేశించి కోటను స్వాధీనం చేసుకుంటాడు. అయితే ఈ పోరులో తానాజీ మరణిస్తాడు. కోటను గెలిచాం కాని సింహాన్ని కోల్పోయామని ఆవేదన చెందిన శివాజీ ఆ కోటను సింహఘడ్ గా మార్చాడు.మరాఠాసామ్రాజ్యాన్ని వ్యాపించచేసిన శివాజీకి రాయఘడ్ కోటలో వేదపఠనాల మధ్య క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ ఛత్రపతి బిరుదును ప్రదానం చేస్తారు. ఎన్నో కోటలపై దండయాత్రలు చేసిన శివాజీ ఏ మతానికి చెందిన పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు.మొగలులకు, సుల్తాన్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆయన కొలువులో అనేకమంది ముస్లింలు ఉండేవారు. సైన్యంలో మూడొంతులు ముస్లింలే. శివాజీకి సర్వసైన్యాధ్యక్షులుగా దౌలత్‌ఖాన్, సిద్ధిక, నావికాదళానికి ఇబ్రహీం ఖాన్, మందుగుండు విభాగానికి అధ్యక్షుడుగా సిద్ది ఇబ్రహీం బాధ్యతలు నిర్వహించేవారు. పరస్త్రీలను మాతృ సమానురాలుగా చూసిన గొప్ప వ్యక్తి శివాజీ. గెరిల్లా విధానంలో పోరాటం, కొత్త ఆయుధాలను కనుగొవడం శివాజీ అవలంభించిన యుద్ధవైటపుణఅయాలే. 27 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం అనేక యుద్ధాలు చేస్తూ మూడువందల కోటలను తన ఆధీనంలో ఉంచుకుని, లక్షమంది సైన్యాన్ని తయారు చేసిన శివాజీ కొండలపై సాంకేతిక విలువలతో శత్రుదుర్భేధ్యమైన కోటలను నిర్మించడంలో ప్రపంచఖ్యాతిని సొంతం చేసుకున్నాడు. నాసిక నుంచి మద్రాసు వరకు 1200 కిలోమీటర్ల మధ్య 300 కోటలు నిర్మించాడు. తన సామ్రాజ్యంలో అన్ని మతాల వారిని సమానంగా చూసిన ఆయన అనేక దేవాలయాలతో పాటు మసీదులను కూడా నిర్మించాడు. మతసామరస్యానికి ప్రతీకగా సాగిన శివాజీ పరిపాలన ను ఉదాహరించవచ్చు. ఏప్రిల్ 3, 1680న శివాజీ మరణం తరువాత ఆయన కుమారుడు శంభాజీ రాజ్యాపాలన బాధ్యతలు చేపట్టి తండ్రికి తగ్గ తనయుడిగా మొగల్‌లను ఎదుర్కొన్నారు. జనరంజకంగా పరిపాలన సాగించాడు.

# రెండుగా పాకిస్తాన్....

**లాహోరం, ఫిబ్రవరి 18:**మన పొరుగు దేశం పాకిస్తాన్ మళ్లీ రెండు ముక్కలు కాబోతోందా అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు. దశాబ్దాలుగా పాకిస్తాన్ నుంచి విభజన పోరాటం చేస్తున్న బలూచిస్తాన్.. పాకిస్తాన్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయం అయినట్లు తెలుస్తోంది. ఇటీవల పాకిస్తాన్ మంత్రి చట్టసభలో మనము.. వాళ్లు అని చెప్పడం 1971 బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు వాడిన పదాలను గుర్తు చేస్తోంది. ఈ పరిణామాలు బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి.బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 1 నిమిషం 10 సెకన్ల వీడియోలో పాకిస్తాన్ సైనికులు జీమీల్, షమ్మ్రబ్రేజ్‌లను చూపించింది. వీరిని 7 రోజుల్లో విడుదల చేయకపోతే చంపేస్తామని హెచ్చరించారు. 5 వేల అత్యాధునిక డ్రోన్లతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌పై దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,184 మంది పాక్ సైనికులు మరణించారు.బలూచిస్తాన్




సీఎం అక్తర్ మెంగల్ 15 రోజుల క్రితం రాజీనామా చేసి, 'ఇక పాకిస్తాన్‌లో ఉండదు' అని ప్రకటించారు. 1947లో ఖాన్ ఆఫ్ కలాట్‌తో ఒప్పందం ఉల్లంఘించి, 1950లో బలూచిస్తాన్‌ను బలవంతంగా కలిపారు. 1958లో నవాబ్ నవరోజ్ ఖాన్ తిరుగుబాటు చేసి అరెస్టు చేయబడ్డాడు. 2006లో నవాబ్ అక్బర్ బుగ్తి హత్యకు దారి తీసింది. ఇలా పాకిస్తాన్ బలూచిస్తాన్‌ను మోసం చేసింది. దీంతో బలూచ్ ప్రజలు పాకిస్తాన్‌ను విశ్వసించడం లేదు.2002లో చైనా--పాక్ ఆర్థిక మార్గం (సీపీఈసీ) ప్రకటించడం బలూచ్‌లలో కోపాన్ని మేల్కొలిపింది. ఇప్పుడు బీఎల్ఏ ఆపరేషన్ హెరాఫ్ 2.0లో భారత సరిహద్దు యాంటీ--డ్రోన్ టెక్నాలజీతో దాడి చేస్తోంది. భవిష్యత్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది.బలూచ్ నాయకులు 'పాకిస్తాన్ ఆక్రమణ' అని పిలుస్తున్నారు. మెంగల్ 'ప్రభుత్వ అధికారం ఏ ఇంచ్ లేకుండా పోయింది' అన్నారు. ఈ ఘటనలు 1971 బంగ్లాదేశ్ సారాంశాన్ని పునరావృతం చేస్తూ, పాక్‌కు కీలక సవాలుగా మారాయి.

# రెండో వారంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18,:**ఈ ఏడాదిలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ కసరత్తు ప్రారంభించింది. బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరీల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఈ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఎస్ఐఆర్‌పై ఓ పక్క విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. దీంతో ఎన్నికల తేదీలను మార్చి రెండో వారంలో ప్రకటించి, చివరి వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈసీ అధికారులు.. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. వచ్చే ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు శాసనసభకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. వీటితో పాటు కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మార్చి రెండో వారంలో షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇక, ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఇప్పటికే ఈసీ అధికారులు పర్యటనలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈసీ బృందం అసోంలో పర్యటిస్తుంది.తమిళనాడు, కేరళ, పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీలకు మే నెలలోనూ.. పుదుచ్చేరి శాసనసభకు జూన్ 15తో గడువు ముగియనుంది. ఇక, ఎన్నికల జరగనున్న రాష్ట్రాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివర దశకు చేరుకుంది. ఫిబ్రవరి 10 అసోం,



ఫిబ్రవరి 14న పుదుచ్చేరిలో ఓటర్ల జాబితా ప్రచురించిన సంగతి తెలిసిందే. తమిళనాడులో మంగళవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 21న కేరళ, 28న పశ్చిమ బెంగాల్లో తుది జాబితాలు విడుదలవుతాయి. కానీ, ఎస్ఐఆర్‌పై తమిళనాడు, బెంగాల్‌లో రగడ కొనసాగుతోంది.తమిళనాడులో డిసెంబరు 19న విడుదల చేసిన ముసాయిదాలో 97 లక్షల మంది పేర్లను తొలగించారు. బెంగాల్‌లోనూ 58 లక్షల మంది పేర్లు డిలీట్ చేశారు. ఇప్పటికే దీనిపై తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై దీదీ యుద్ధం ప్రకటించారు. సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసి, స్వయంగా మమతా బెనర్జీ వాదనలు వినిపించడం గమనార్హం.బెంగాల్‌లో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన మమతా బెనర్జీ.. నాలుగోసారి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అటు, బీజేపీ సైతం అధికారం కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని భారీ అంచనాలు పెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్‌లో ఆ పార్టీకే అనుకూలమని వచ్చినా.. ఫలితాలు మాత్రం కమలానికి షాకిచ్చాయి. 2011, 2016కు మించి భారీ మెజార్టీతో మమతా బెనర్జీ గెలిచారు. ఈసారి ఏ అవకాశం వదులుకోరాదని కమలనాథులు గట్టిగానే కృషిచేస్తున్నారు.

## విశాఖలో భారీగా
# ఏఐ ఉద్యోగులు...

**విజయవాడ, ఫిబ్రవరి 18**:అమెరికా, చైనాల తర్వాత ఏఐ రంగంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం చుట్టూ 100 కిలోమీటర్ల పరిధిలో భారీ డేటా సిటీ ని నిర్మిస్తోంది. ఇది కేవలం డేటా నిల్వ కేంద్రం మాత్రమే కాకుండా, ఏఐ చిప్ డిజైనింగ్, సర్వర్ తయారీ, పరిశోధన , అభివృద్ధి కేంద్రాల కలయికగా ఉండబోతోంది. తైవాన్ దేశం 100 కిలోమీటర్ల వెడల్పులో ఏ విధంగా సెమీకండక్టర్ హబ్‌గా మారిందో, అదే తరహాలో వైజాగ్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ డేటా సిటీ ప్రాజెక్టులోకి ఇప్పటికే ప్రపంచ స్థాయి ఐటీ దిగ్గజాలు క్యూ కడుతున్నాయి. అక్టోబర్ 2025లో కుదిరిన ఒప్పందం ప్రకారం, గూగుల్ , అమెరికా వెలుపల తన అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హబ్‌ను వైజాగ్‌లో ఏర్పాటు చేసేందుకు సుమారు రూ. 1.25 లక్షల కోట్లు పెట్టుబడిని ప్రకటించింది. దీనితో పాటు రిలయన్స్-బ్రూక్‌ఫీల్డ్ జాయింట్ వెంచర్ రూ. 91,000 కోట్లు, మైక్రోసాఫ్ట్ , మెటా వంటి సంస్థలు కూడా భారీ వ్యూహాలతో ఇక్కడ అడుగుపెడుతున్నాయి. మొత్తంగా రూ. 15 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ఏఐ



డేటా సెంటర్ల నిర్వహణకు అత్యంత కీలకమైనది నిరంతర భారీ విద్యుత్ సరఫరా. దీనికోసం ప్రభుత్వం 6 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యాన్ని సిద్ధం చేస్తోంది. ఇందులో ఇప్పటికే 3 గిగావాట్లకు సంబంధించిన ఒప్పందాలు పూర్తయ్యాయి. ఈ భారీ అవసరాలను తీర్చేందుకు శ్రీకాకుళం జిల్లాలోని కొవ్వాడ అణు విద్యుత్ ప్లాం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా, ఈ సెంటర్లను చల్లబరచడానికి సముద్రపు నీటిని వినియోగించుకునే వినూత్న కూలింగ్ టెక్నాలజీ ని ఇక్కడ అమలు చేస్తున్నారు.విశాఖపట్నం తీరాన్ని అంతర్జాతీయ సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ ల్యాండింగ్ పాయింట్‌గా మారుస్తున్నారు. గూగుల్ బ్లూ-రామన్ , మెటా వాటర్‌వర్త్ కేబుల్స్ ఇక్కడ ల్యాండ్ కావడం ద్వారా సింగపూర్, మలేషియా వంటి దేశాలతో వైజాగ్‌కు డైరెక్ట్ హై-స్పీడ్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. ముంబై కంటే రెండు రెట్లు ఎక్కువ కేబుల్ నెట్‌వర్క్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడమే లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల ఇంటర్నెట్ లేటెన్సీ తగ్గి, సెర్చ్ ఇంజన్లు , ఏఐ అప్లికేషన్లు అద్భుతమైన వేగంతో పనిచేస్తాయి. మంత్రి నారా లోకేష్ ఈ ప్రాజెక్టు ద్వారా 2032 నాటికి వైజాగ్ ఆర్థిక వ్యవస్థను 120 బిలియన్ డాలర్లకు చేర్చాలని, లక్షలాది మంది యువతకు ఉన్నత స్థాయి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భూమి ధరలను అతి తక్కువగా అందించడం ద్వారా గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నారు. కేవలం డేటా నిల్వకే కాకుండా, సర్వర్ తయారీ , శీతలీకరణ వ్యవస్థల పరిశ్రమలను కూడా ఇక్కడికి తీసుకురావడం ద్వారా ఒక సంపూర్ణ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తున్నారు.

## కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ
# సోదరీమణుల మీద దౌర్జన్యం

**కరీంనగర్, ఫిబ్రవరి 18**:కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు తాగి వచ్చి తమ మహిళా కౌన్సిలర్ సోదరీమణులను తాకరాని చోట తాకారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ అక్కడ కూర్చుని మా సోదరీమణుల మీద దౌర్జన్యం చేయిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఆడకూతుళ్లు లేరా నిలదీశారు. తాను రౌడీయిజం చేయలేదని, మంత్రి, ఎంపీలే రౌడీయిజం చేశారని ఆరోపించారు. మంత్రి, ఎంపీ తీరుకు నిరసనగా బీఆర్ఎస్, సీపీఐ కలిసి క్యాతనపల్లి మున్సిపాలిటీ బంద్‌కు పిలుపునిస్తున్నామని అన్నారు.క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో బాల్క సుమన్ సీపీఐ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఒక మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా, సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.మీరు విజ్ఞప్తి చేస్తే ఛైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీకి



ఇచ్చేందుకు సిద్ధమే అన్నారు. తమ ఆడకూతుళ్ల కంటే మున్సిపల్ ఛైర్మన్ పదవి తమకు ఎక్కువ ఏమీ కాదని అన్నారు. వివేక్ కుటుంబం ఎన్ని పదవులు అనుభవించింది, ఈ ప్రాంతంలో వారికి ఎంత గౌరవం ఉంది, కానీ ఇప్పుడు ఇంత దిగజారి ప్రవర్తించడమేమిటని ధ్వజమెత్తారు. ఇంత అనైతిక చర్యలకు పాల్పడమేమిటని ప్రశ్నించారు. రేపు బంద్‌కు అందరూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారుపోలీసుల తీరుపై బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా ప్రవర్తించారని ఆరోపించారు. ఇక ఖాకీ దుస్తులు అవసరం లేదు, కాంగ్రెస్ రంగు దుస్తులు వేసుకుని, రేవంత్ రెడ్డి పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేసుకోండని వ్యాఖ్యలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోవాలని అన్నారు. ప్రజల పక్షాన, సింగరేణి కార్మికుల పక్షాన, రైతుల పక్షాన ప్రతిపక్ష నాయకుడిగా తాను పోరాటం చేస్తానని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ 10, కాంగ్రెస్ 7, సీపీఐ 4, స్వతంత్రులు ఒక స్థానాన్ని గెలుచుకున్నారు. అయితే రెండు ఎక్స్ అఫీషియో సభ్యులు, స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో కాంగ్రెస్ బలం 10కి చేరుకుంది. దీంతో క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక ఉత్కంఠగా మారింది. అయితే ఉద్రిక్తతల నేపథ్యంలో కోరం లేదని చెబుతూ క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

# రాజ్యసభ కోసం పోటీ..

- మొదటి పేజీ తరువాయి

మద్దతుగా ఓట్లేసే అవకాశం లేదు. మజ్లిస్ ఒక వేళ ఓటింగ్ లో పాల్గొంటే కాంగ్రెస్‌కు సహకరిస్తుంది. అందుకే రెండు సీట్లు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.అందుకే కాంగ్రెస్‌లో అభ్యర్థులు ఎక్కువగా పోటీ పడుతున్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి రెన్యువల్ దాదాపు ఖాయమని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గళాన్ని వినిపించడంలో, పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలను డీల్ చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉప ఎన్నిక ద్వారా ఆయన తెలంగాణ నుంచి ఎంపికయ్యారు, ఇప్పుడు పూర్తి కాలానికి గాను ఆయనను హైకమాండ్ మళ్ళీ బరిలోకి దింపే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.ఇక రెండో స్థానం కోసం తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే మాజీ మంత్రి, సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ విసి సుదర్శన్ రెడ్డి, పార్టీలో సీనియర్ అయిన వి. హనుమంతరావు, ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు వంటి హేమాహేమీలు ఈ రేసులో ఉన్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఎవరిని వరిస్తుందో చూడాలి.ఈ ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 26న నోటిఫికేషన్‌తో ప్రారంభమై మార్చి 16న పోలింగ్, అదే రోజు కౌంటింగ్‌తో ముగియనుంది. సింఘ్వీ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో, మిగిలిన ఒక్క సీటు కోసం పైరవీలు ఢిల్లీ స్థాయికి చేరుకున్నాయి. పార్టీ



విధేయులకే ప్రాధాన్యత ఉంటుందని అధిష్టానం సంకేతాలు ఇస్తున్న సమయంలో , ఈ రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# యెల్లో మెటల్ ధరల పతనానికి రష్యా మాస్టర్ స్ట్రోక్..

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ.1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఎనిమిదవ వింతలా మారుతుందేమోనన్న ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ.1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధరలు అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం రష్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి.ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.బంగారం ధరలు తగ్గుతున్నప్పటికీ, కొనుగోలుదారులు ఒకేసారి భారీగా పెట్టుబడి పెట్టకుండా ధరలు పూర్తిగా స్థిరపడే వరకు వేచి చూడటం మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## రాజ్యసభ ఎన్నికల
# షెడ్యూల్ విడుదల..

- మొదటి పేజీ తరువాయి

విడుదల చేయనున్నారు. మార్చి 16న పోలింగ్ నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. పది రాష్ట్రాల్లో మొత్తం 37 రాజ్యసభ ఎంపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియ మొదలైంది. ఏప్రిల్ 9కి తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీల రాజ్యసభ పదవీ కాలం పూర్తికానుంది.తమిళనాడులో




ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, బిహార్‌లో అయిదుగురు, ఒడిశాలో నలుగురు, అస్సాంలో ముగ్గురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ సీటు ఖాళీ కాబోతున్నాయి. రాజ్యసభ నిరంతర సభ కాగా, అందులో 37 మంది సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుందని తెలిసిందే. ఈ ఖాళీల భర్తీకి సంబంధించి ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 26న ఈసీ విడుదల చేయనుంది. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది. షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ప్రక్రియ విజేతను ప్రకటిస్తారు.

# కళ్లజోడు.. ఏఐ తోడు

- మొదటి పేజీ తరువాయి

చేశారు. ఈ కళ్లజోడు ప్రత్యేకతల విషయానికి వస్తే.. అది ఎదురుగా ఉన్న దృశ్యాలను చూసి అర్థం చేసుకోగలదు. కావాలంటే ఆ దృశ్యాలను రికార్డు కూడా చేయగలదు. మనం అడిగిన ప్రశ్నలు అర్థం చేసుకుని స్పందించి సమాధానమివ్వగలదు. మనం అడిగిన సమాచారాన్ని నెట్‌లో వెతికి చెప్పగలదు. మన ఎదురుగా ఉన్న వస్తువులను లేదా సమాచారాన్ని గుర్తుపట్టి వివరాలు అడిగితే ఇవ్వగలదు. అన్నిటికంటే ముఖ్యంగా.. పలు భారతీయ భాషలను అప్పటికప్పుడే (రియల్‌టైమ్‌లో) మనకు కావాల్సిన భాషలోకి అనువదించగలదు! ఉదాహరణకు.. ఈ కళ్లజోడు ధరించి మనం చెన్నైకో, కోయంబత్తూరుకో వెళ్లామనుకోండి. అక్కడ వాళ్లు మాట్లాడే తమిళ భాషను ఎంచక్కా మన తెలుగులోకి మార్చి వినిపిస్తుంది. మనం దానికి మాటల ద్వారా ఆజ్ఞలు జారీచేయొచ్చు. దీంట్లో చాట్ ఫీచర్ కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. అంటే.. మొబైల్‌లో సర్వం యాప్ ద్వారా రాతపూర్వకంగా కూడా ఈ కళ్లజోడుకు మనం కమాండ్స్ ఇవ్వొచ్చు. దీనికి ఉన్న అసలైన ప్రత్యేకత ఏంటంటే.. ఈ పనులన్నీ ఇది ఆఫ్‌లైన్‌లో కూడా చేయగలదు. 'సర్వం ఎడ్జ్' అనే మినీ బ్రెయిన్‌ని 'సర్వం ఏఐ' సంస్థ ఈ కళ్లజోడులో అమర్చింది. అది పనిచేయడానికి ఇంటర్‌నెట్ అక్కర్లేదు. 'కేజ్' అంటే జపన?సలో 'గాలి' అని అర్థం. 'గాలి'లా సర్వాంతర్యామిలా పనిచేస్తుంది కాబట్టే సర్వం ఏఐ సంస్థ ఈ కళ్లజోడుకు 'సర్వం కేజ్' అనే పేరు పెట్టింది. ఈ కళ్లజోడును మే నెలలో మార్కెట్లోకి తేనున్నట్టు తెలిపింది.

**సర్కారు ఏఐ మిషన్‌లో భాగంగానే..**

చాట్‌జీపీటీ, జెమినై వంటి ఏఐ మోడళ్లను వాడేటప్పుడు.. మన వివరాలు, మనం వాటిలోకి అప్‌లోడ్ చేసే ఫొటోలు.. అన్నీ విదేశీ సర్వర్లలోకి వెళ్తాయి. ఆ ప్రమాదం లేకుండా దేశీయంగా వాటికి దీటుగా కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో 2024లో కేంద్ర ప్రభుత్వం రూ.10,372 కోట్లతో 'ఇండియన్ ఏఐ మిషన్'ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ మిషన్‌లో భాగంగానే సర్వం ఏఐ ఈ కళ్లజోడును తయారు చేసింది. ఈ మిషన్ కోసం ప్రభుత్వం మన స్టార్టప్‌ల కోసం 38 వేలకుపైగా జీపీయూలను సమకూర్చింది.

**25 ఏళ్ల తర్వాత ఉద్యోగాల అవసరం ఉండదు: వినోద్ ఖోస్లా**

మరో పాతికేళ్లలో ప్రజలెవరికీ ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదని టెక్ దిగ్గజం వినోద్ ఖోస్లా అంచనా వేశారు. అప్పటికి అన్ని రంగాల్లో ఏఐ వేగంగా దూసుకెళ్తుందని చెప్పారు. మంగళవారం ఆయన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో మాట్లాడారు. 2050 నాటికి ఉద్యోగాల విషయంలో ఒక స్పష్టత వస్తుందని అన్నారు. ఐదేళ్లలో ఐటీ, బీపీవో వైట్ కాలర్ ఉద్యోగాలు అదృశ్యం అవుతాయని పునరుద్ఘాటించారు. ఐటీ ఉద్యోగాల మీద ఎక్కువగా ఆధారపడుతున్న భారత్ మీద దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఒక ఐటీ కంపెనీలో ఎవరైనా 15-20 ఏళ్లుగా పని చేస్తున్నట్లయితే వాళ్లను వెంటనే తీసేయొచ్చని అన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడుకోవడానికి సావరిన్ ఏఐ మోడల్స్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఖోస్లా చెప్పారు. అందుకే సర్వంలో తాను పెట్టుబడులు పెట్టానన్నారు.

## పూర్తయిన
# ఇబ్రహీంపట్నం ఎన్నిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 18**:రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు సంబంధించి బీఆర్ఎస్ పార్టీకి హైకోర్టు షాకిచ్చింది. నిన్న వాయిదాపడిన 11 మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలలో రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం ఒకటి. 24 వార్డులకు గాను బీఆర్ఎస్ 13, కాంగ్రెస్ 8, బీజేపీ 2, స్వతంత్రులు ఒక స్థానం కైవసం చేసుకున్నారు. ఈరోజు జరిగిన మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పీఠాన్ని దక్కించుకుంది. ఛైర్మన్‌గా టేకు సుదర్శన్ రెడ్డి ఎన్నికయ్యారు.అయితే, 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అదృశ్యం కావడంతో ఈ ఎన్నికపై హైకోర్టు స్టే విధించింది. తన తండ్రిని ఎవరో కిడ్నాప్ చేశారంటూ యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. యాదగిరిని ఎల్లుండి తమ ఎదుట హాజరుపరచాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి వరకు ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు స్టే విధించింది. అయితే హైకోర్టు స్టే అందే సమయానికి సుదర్శన్ రెడ్డి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దాంతో, హైకోర్టు ఆదేశాలతో వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు.

## 23 తర్వాత పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్

- మొదటి పేజీ తరువాయి

ఈ మంత్రి వర్గ సమావేశానికి ముందే తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక సంఘటన చోటు చేసుకోనుంది. ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు దేశ రాజధాని ఢిల్లీలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు.




కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన ఏఐసీసీ వేదికగా కీలక భేటీ జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం ఢిల్లీకి వెళ్లనుంది.కేబినెట్ భేటీకి ముందు హస్తం పార్టీ అధిష్ఠానంతో జరగనున్న ఈ భేటీ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు.. ఆ తర్వాత జరిగే కేబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు అనేది ఇప్పుడు తెలంగాణలో ఆసక్తిగా మారింది.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి....

**రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు**



**కమాన్ పూర్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగిరి మండలం రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు పేర్కొన్నారు.రామగిరి మండలం పోయిన రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాంనగర్ లో బుధవారం మురికి కాలువలలో పేర్కొని పోయిన చెత్తాచెదారం (షీల్ట్) తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలోని మురికి కాలువలో భారీగా చెత్తాచెదరం పేర్కొని పోయింది. ఈక్రమంలో స్పెషల్ డ్రైవ్ కింద ఈ పనులను ప్రారంభించడం జరిగింది. గ్రామంలోని అన్ని మురికి కాలువలలో షీల్ట్ తీయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాద్రపు.ప్రవల్లిక ప్రశాంత్, సెక్రటరీ గంగుల సంతోష్, వార్డ్ సభ్యులు జక్కుల పద్మ చందన్, బత్తిని ప్రశాంత్, అల్లి రమేష్, పున్నశీ మణి తేజ, జుట్టు యశోద సత్యనారాయణ, బత్తుల రాజమణి రమేష్ ,కారోబర్ కొండపర్తి శ్రీనివాస్, స్థానిక నాయకులు సందెవేన కుమార్,ఖండే కిష్టయ్య, నగునూర్.శ్రీనివాస్, జంగేటి కుమార్, అల్లమ్ రాజేందర్,శ్యామ శ్యామసుందర్, మొగిలి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను పగడ్బందీ గా నిర్వహించాలి



**రాయచోటి, ఫిబ్రవరి 18:** ఇంటర్ మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు అధికారులను ఆదేశించారు.ఈ నెల 23 నుండి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలపై వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థి దశలో ఇంటర్ మీడియట్ ఎంతో కీలకమని, పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు, తప్పిదాలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని ఆయన కోరారు. ఇంటర్ పరీక్షలు ఈనెల 23 నుంచి ప్రారంభమై 24 మార్చి వరకు జరుగుతాయని డిఆర్ఓ తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు జరుగుతాయని చెప్పారు. మొదటి సంవత్సర పరీక్షలకు 14,607 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 13,328 మంది బ్యాక్ లాగ్ 615 మంది మొత్తం 28,550 మంది హాజరవుతారని చెప్పారు. మొత్తం 50 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే విద్యార్థిని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం ఎనిమిది గంటలకల్లా చేరుకొని విధంగా చూడాలని, పరీక్ష సమయం తొమ్మిది గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లో అనుమతించబడదని, అలాగే విద్యార్థులు ఎలాంటి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పరీక్ష కేంద్రంలో అనుమతించారని తెలిపారు. ప్రతి ఒక్క పరీక్షా కేంద్రం వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష కేంద్రాల్లో ఏదైనా సమస్య వస్తే వెంటనే తెలియజేయుటకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని కంట్రోల్ రూమ్ నెంబర్ 9866112750 కు తెలియజేయవచ్చునని తెలిపారు.పరీక్షా కేంద్రాలవద్ద 163 సెక్షన్ విధించాలని, జెరాక్స్ షాపులను మూసివేయాలని చెప్పారు.విద్యార్థులు ఇబ్బంది పడకుండా త్రాగునీరు, మరుగుదొడ్లు లాంటి మౌలిక వసతులను కల్పించాలని, పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేందుకు వీలుగా ఆర్టిసి బస్సులను నడపాలని చెప్పారు. పరీక్ష నిర్వహించే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని, పారిశుధ్యం, త్రాగునీటి వసతుల కల్పనను పంచాయితీశాఖ, మున్సిపాల్టీలు పర్యవేక్షించాలని సూచించారు. కేంద్రాలవద్ద పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతీ పరీక్షా కేంద్రంవద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ కేంద్రంవద్దా సిట్టింగ్ స్క్వాడ్ తోపాటు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మీడియట్ పరీక్షలకు సంబంధించిన విద్య, పోలీస్, రవాణా, విద్యుత్తు, వైద్య,పోస్టల్, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్ తదితర శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటి మరియు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రవి, డీఈవో సుబ్రహ్మణ్యం, విద్యుత్ శాఖ ఏఈ ఉత్తన్న, మున్సిపల్ శాఖ డి వై ఈఈ పి శ్రావణి,డిపిఎమ్ఓ రమేష్ బాబు, ఆర్టీసీ డిఎం ఎం. వి. ఆర్. రెడ్డి, ఇన్స్పెక్టర్ రామాంజనేయులు, పోస్టల్ అధికారిని నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ కలెక్టర్ కుజైలు శిక్ష

**నాలుగు వారాల గడువు**

**సంచలనంగా మారిన వైనం**



**మెదక్:**కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటూ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు హైకోర్టు జైలు శిక్ష విధించడం సంచలనంగా మారింది. చేగుంట మండలం బోనాల గ్రామానికి చెందిన లక్ష్మీ అనే మహిళ భూమి వివరాల కేసును పరిష్కరించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాలకు నోటీసులు జారీ చేసి భూ సమస్యను పరిష్కరించాలని హైకోర్టు కలెక్టర్ రాహుల్ రాజ్ ను ఆదేశించింది. సమస్యను పరిష్కరించకుండా గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోలేదంటూ లక్ష్మీ కోర్ట్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారించిన హైకోర్టు ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ. 2వేల జరిమానా విదిస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. తరువాత తీర్పు అమలును నాలుగు వారాలపాటు నిలిపివేసింది. ఆపిల్ చేసుకునేందుకు కలెక్టర్ కు నాలుగు వారాల పాటు హైకోర్టు గడువు ఇచ్చింది.

# మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు

**కమాన్ పూర్:** కమాన్ పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోఎఫ్ పి ఎస్ టిపెద్దపల్లిల్ల వారి ఆధ్వర్యం లతి 8.9 వ తరగతుల విద్యార్థులకు మండల స్థాయి ఫిజకల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో కమాన్ పూర్, జూలపల్లి మరియు రొంపికుంట ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా జి. రిషిక్ సాయి జిల్లా పరిషత్ పాఠశాల జూలపల్లి అనే విదార్థి మొదటి స్థానం లో కె. రుచిత జిల్లా పరిష త్ పాఠశాల కమాన్ పూర్ అనే విద్యార్థి ద్వితీయ స్థానం లో నిలిచారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులు ఈనెల 23-నాడు పెద్దపల్లి బాలికల ఉన్నత పాఠశాల లో జరిగే జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ ఊలెంట్ టెస్టు లో పాల్గొంటారు. మొదటి, ద్వితీయ స్థానం సాధించిన ' విద్యార్థులను మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అభినందిస్తూ జిల్లా స్థాయిలో కూడ మంచి ప్రతిభను కనబరిచి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో .. ఫిజకల్ సైన్సన ఉపాధ్యాయులు శ్రీ జి రాజేశ్వర్ రావు, పి. సతీష్, ఎం. శ్రీనివాస్ రెడ్డి పాయ ఎం శ్రీనివాస్ మరియు కె శ్రీనివాసు పాల్గొన్నారు.

# మర్డర్, ఆత్యాచారం జరగలేదు

**ప్రత్యూష కేసులో సుప్రీం కోర్టు**



న్యూఢిల్లీప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీలో కీలక అంశాలు వెల్లడించింది. 60 పేజీల సుప్రీంకోర్టు తీర్పు కాపీలో 12 కీలక అంశాలను వెల్లడించింది.ఈ కేసులో నిందితుడు సిద్ధార్థ్ రెడ్డి కి పురుగులు ముందు ప్రాణాంతకం అని తెలిసినా కొనుగోలు చేశాడు. ఇద్దరు సేవించి నటి ప్రత్యుష ను పురిగొల్పాడు , సిద్ధార్థ్ రెడ్డి దోషిత్వం పూర్తిగా రుజువైందని సుప్రీం కోర్ట్ పేర్కోంది. . ప్రత్యూషను గొంతు నిలిమి హత్య చేశారని వాదనకు ఆధారాలు లేవని తేల్చింది. కోర్టుకు సబ్మిట్ చేసిన మెడికల్ రిపోర్టులు సాక్షులు వాంగ్మూలాలు ప్రకారం ఆమె విషం తీసుకుని చనిపోయినట్లు గుర్తించింది. నిందితుడు సిద్ధార్థ రెడ్డి నటి ప్రత్యూష పై లైంగిక దాడి చేసినట్లు ఆరోపణలు రుజువు కాలేదు. కేసు విచారణ చాలాకాలం జరిగిన తర్వాత ప్రత్యూష పై మర్డర్ , అత్యాచారం జరిగిందనే ఆరోపణలు పరిగణలోకి తీసుకోవడం కష్ట సాధ్యం అని అభిప్రాయపడింది.. ఈ కేసులో అత్యంత కీలకమైన పోస్ట్ మార్టం రిపోర్ట్ పై అభ్యంతరం చెప్పిన సుప్రీంకోర్టు, డాక్టర్ మునిస్వామి సమర్పించిన రిపోర్టు అన్ ప్రొఫెషనల్ గా ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. ఈ కేసులో నివేదికను సమర్పించక ముందే, అసంపూర్తి సమాచారాన్ని బయట పెట్టడం వల్ల కేసు దారిమల్లింది దాని పర్యావసనాలు తీవ్రంగా ఉన్నాయని అభిప్రాయపడింది.. ఈ కేసులో కీలక సాక్షి నంబర్ 34 వాంగ్మూలం విశ్వసనీయంగా ఉందని, అది తీర్పులో కీలకపాత్ర పోషించిందని ధర్మాసనం పేర్కోంది. పరిస్థితుల ప్రభావం సాక్ష్యాలు స్పష్టంగా నిందితుడికి వ్యతిరేకంగా ఉన్నాయి. . కుల్ డ్రింక్ లో ఏదో కలిపామని, అది ప్రమాదవశాత్తు జరిగిందన్న డిఫెన్స్ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. ఆత్మహత్య చేసుకోవడానికి ఉపయో గించిన 'నొవాక్రాన్'అనే పురుగుల మందును సిద్ధార్ద్ రెడ్డీ కొనుగోలు చేశాడన్న విషయం రుజువైంది. ఇది ఆత్మహత్యకు ప్రేరేపించడమే. చెల్లూరు కేసులో ఇచ్చిన తీర్పును ఈ కేసులో అన్వయించుకోలేమని స్పష్టం చేసింది. ఇది అత్యంత కీలకమైన అంశం.. ఇద్దరు వ్యక్తులు పరస్పర అంగీకారంతో ఆత్మ హత్య చేసుకోవాలని నిర్ణయిందుకున్నప్పుడు.అందులో ఒకరు చనిపోయి, మరొకదు బతికితే చట్ట ప్రకారం బతికున్న వ్యక్తి ఆ మరణానికి బాధ్యుడవుతాడు. ఈ చట్టపరమైన అంశం ఆధారంగానే సిద్ధార్ద్ రెడ్డిని దోషిగా కోర్టు నిర్ధారించింది.

# బాల్క సుమన్ అరెస్ట్.. క్యాతనపల్లిలో ఉద్రిక్త వాతావరణం



క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా

**మంచిర్యాల, ఫిబ్రవరి 18:** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దఎత్తున బాల్క సుమన్ ఇంట్లోకి వెళ్లిన పోలీసులు.. అరెస్ట్‌కు సహకరించాలని కోరారు. ఇందుకు మాజీ ఎమ్మెల్యే ససేమిరా అనడంతో బలవంతంగా ఆయనను అరెస్ట్ చేసి పోలీస్ వ్యాన్‌లో తరలించారు. అయితే బాల్క సుమన్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. కార్యకర్తల ఆందోళనల మధ్యే సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం ఆయనను ఆస్పత్రికి తరలించారు. దీంతో క్యాతనపల్లిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాగా, నిన్న (మంగళవారం) ఘర్షణలు చోటుచేసుకున్నాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళు రువ్వారని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బాల్క సుమన్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలపై క్యాతనపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసేందుకు పోలీసులు భారీగా తరలివచ్చారు. ఆయన నివాసం చుట్టూ వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకుని అరెస్టును అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య తోపులాట, ఉద్రిక్తత నెలకొంది. చివరకు బీఆర్ఎస్ శ్రేణులను చెదరగొట్టిన పోలీసులు సుమన్‌ను అరెస్ట్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు..



**హైదరాబాద్/అమరావతి, ఫిబ్రవరి 18:** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు ఇవాళ (బుధవారం) బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఈరోజు బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహ ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ-మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

# రాబోయే రోజుల్లో వానలు...



**హైదరాబాద్, ఫిబ్రవరి 18:** ఈ ఏడాది తొలిసారిగా అకాల వర్షాలు వచ్చే వారం కురవనున్నాయి. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంది. వడగళ్లు, పిడుగులు పడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వచ్చే వారం 20 నుంచి 40 మిమీ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసిందివాతావరణ నిపుణుడు టి. బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం, ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో తెలంగాణలో పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం, కరీంనగర్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఐఎమ్‌డీ అంచనా ప్రకారం వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంది. పొగమంచుతో ఉదయం వేళ ప్రజలు ఇబ్బంది పడతారు. ఇరవై నుంచి నలభై మిల్లీమీటర్ల మేర వర్షం కురిసే అవకాశం ఉందని, హైదరాబాద్ వాసులను సైతం అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ పొగమంచు కురుస్తుందని పేర్కొన్నప్పటికీ, వర్షాలకు సంబంధించి ఎటువంటి హెచ్చరికను జారీ చేయలేదు. ఫిబ్రవరి 20 వరకు ఉదయం లేదా రాత్రి సమయాల్లో పొగమంచు కురుస్తుంది. వర్షాలు, వడగళ్ల వానల సూచనల ప్రకారం వచ్చే వారంలో అందుకు తగినట్లుగా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది కనుక, ప్రజలు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2026 సంవత్సరంలో తొలిసారి అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో వడగళ్ల వానలు కురిసే ప్రమాదం ఉందని, ఇప్పటికే రాష్ట్రంలో పొగమంచు కురుస్తుందని అటు భారత వాతావరణ శాఖ (×వీణ) అంచనా వేసింది. ఫిబ్రవరి నాలుగో వారంలో వర్షాలు కురవనున్నాయి. ఫిబ్రవరి 22, 23, 24 తేదీలలో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది కనుక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెదర్ నిపుణుడు టి. బాలాజీ సూచించారు.

# వనస్థలిపురంలో దారుణం..

**భార్యను హతమార్చిన మాజీ భర్త**

**హైదరాబాద్:**వనస్థలిపురంలో దారుణం జరిగింది. తనకు విడాకులు ఇచ్చిందన్న కోపంతో భార్యను మాజీ భర్త హత్య చేసాడు. వనస్థలిపురం గ్రీన్ సీటీ కాలనీలోని అపార్ట్మెంట్ లో సునీత ఇంట్లో కి మాజీ భర్త మహేష్ రెండు కత్తులతో పెట్రోల్ డబ్బా తో వచ్చి దారుణంగా హత్య చేసాడు.ఇంట్లో కి ఎవరైనా వస్తె పెట్రోల్ పోసి తగలబెడుతాని బెదిరింపులకు పాల్పడ్డాడు. నిందితుడు పోలీసుల అదుపులో వున్నాడు. తనకి (మహేష్) సునీత తో గతం వివాహం జరిగిందని, నాపై కేసులు పెట్టీ విదేశాలకు వెళ్లకుండా చేసిందని కోపంతో ఆమెను హత్య చేసినట్లు అని మహేష్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం..విడాకుల అనంతరం శ్రీనాథ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. సునీత ఇప్పుడు ప్రస్తుతం మూడు నెలల గర్భవతి.

# ఏబీవీపీ ఇంటర్ బోర్డు ముట్టడి...ఉద్రిక్తత

**హైదరాబాద్:**నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయం ముందు ఏబీవీపీ ఆందోళనకు దిగింది. ఇంటర్ బోర్డు కార్యాలయం గేటు ముందు ఏబీవీపీ నాయకులు బైఠాయించారు. 300 మంది ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులను ఎన్రోల్మెంట్ చేయకుండా వారి జీవితాలతో ఇంటర్ బోర్డ్ చెలగాటం ఆడుతుందని ఏబీవీపీ నాయకుడు పృద్వి ఆరోపించారు.అనుకోని కారణాలతో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఒక కాలేజీలో చదివి , సెకండ్ ఇయర్ మరో కాలేజీలో చేరిన విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదు. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల 300 మంది విద్యార్థులు ఎగ్జామ్ రాయలేకపోతున్నారు. నిర్లక్ష్యం వహించిన కాలేజీలపై చర్యలు తీసుకోవాలి. 300 మంది విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి , ఎగ్జామ్ కు అనుమతించాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు కార్యాలయం గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ఏబీవీపీ నాయకులు ప్రయత్నించారు. వారిని అడ్డుకున్న పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు.

# డీపీఆర్ లేని ప్రాజెక్టు మూసీ

**హైదరాబాద్:**మూసీ లాంటి పెద్ద ప్రాజెక్టుకు డీపీఆర్ లేదు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముక్కలు ముక్కలుగా చూపిస్తూ ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నారని మూసీ బాధితులు అన్నారు. ఈ మేరకు వాళ్లంతా సోమజీగూడలో సమావేశం నిర్వహించారు.బాధితులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏమో ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నుండి లోన్ వచ్చింది, మూసీ పనులు స్టార్ట్ చేయబోతున్నామని అంటున్నారు.ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ అధికారులు ఏమో ఇంతవరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మాకు లేఖ రాశారు, చెప్పారు కూడా. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుండి ప్రపోజల్ వస్తే ఏడీబీ వాళ్ళు దాన్ని పరిశీలనలో ఉంచారని అన్నారు.మా ఇండ్లు మూసీ బఫర్ జోన్లో ఉండి డేంజర్లో ఉన్నాయని మమ్మల్ని పంపాలి అని చూస్తున్నారు. మమ్మల్ని పంపాక అక్కడ కట్టే పెద్ద పెద్ద బిల్డింగులు బఫర్ జోన్లోకి రావా? ఆ బిల్డింగులు డేంజర్లో ఉండవా? ఇల్లు అనేది ఒక కల.. అలాంటి ఇల్లును కూల్చేస్తామంటే ఎలా అని వాపోయారు.

# బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత...

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 18(స్కై న్యూస్):**బాల్య వివాహాలు నిర్మూలించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, సంబంధిత శాఖల అధికారులేకాక ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ పిలుపునిచ్చారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సౌజన్యంతో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జస్ట్ రైట్స్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన పై అవగాహన కల్పించేందుకు బాల్య వివాహ ముక్త్ భారత్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా రూపొందించిన రథయాత్ర వాహనాన్ని బుధవారం ఐడిఓసి ఆవరణలో జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి. ఎం. సంతోష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినప్పటికీ అక్కడక్కడ బాల్యవివాహాలు జరుగుతుండడం బాధాకరమన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని నిర్మూలించేందుకు ప్రజలందరూ సామాజిక బాధ్యతతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలకు సన్నాహాలు చేస్తుంటే ముందుగానే తెలుసుకొని ఆపివేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098



కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అమ్మాయిలకు 18 ఏళ్లలోపే పెళ్లి చేయడం వలన వారి చదువు మధ్యలోనే ఆగిపోతుందని, ఆరోగ్యపరంగానూ ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. చిన్న వయసులోనే గర్భం దాల్చడం వలన తల్లితోపాటు శిశువు ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని ఫలితంగా రెండు, మూడు తరాలు వివిధ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల్లో పాలుపంచుకునే వారందరికీ చట్టపరంగా వివిధ శిక్షలు వేయడం జరుగుతుందని ప్రజలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. పౌరులందరూ బాల్యవివాహాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా భావించి ప్రభుత్వానికి సహకరించాలని పేర్కొన్నారు. 2030వ సంవత్సరం నాటికి దేశంలో బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, బాల్య వివాహ ముక్త్ భారత్ ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందేశం ప్రతి మండలానికి, గ్రామానికి, ప్రతి ఒక్క ఇంటికి చేరేలా సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ముద్రించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి విడుదల చేశారు. బాల్య వివాహాలు లేని భారతదేశము నినాదంతో రూపొందించిన సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై కలెక్టర్ తో పాటు పలువురు అధికారులు తమ సంతకాలు చేశారు. అలాగే బాల్యవివాహాల నిర్మూలన ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శంకర్, డిడబ్ల్యుఓ సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుషిత, డీసీపీఓ నరసింహ, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, జస్ట్ రైట్స్ సమన్వయకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# యాంత్రీకరణ స్కీం రైతుల పాలిట వరం

**ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి**





**దేవరకద్ర ఫిబ్రవరి 18 (స్కై న్యూస్);** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం రైతులకు వ్యవసాయ యాంత్రికరణ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలు, రోటవేటర్, కల్టివేటర్, వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులతో పాటు అన్ని వర్గాల రైతులకు ఎంతో మేలు చేసే వ్యవసాయ యాంత్రీకరణ స్కీంను గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం రద్దు చేసి, రైతులను బిఆర్ఎస్ ప్రభుత్వం దగా చేసిందని అన్నారు.రైతులను ఆదుకునాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం దాదాపు రూ100 కోట్ల రూపాయల నిధులతో ఈ నెల 9న వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని పునర్ ప్రారంభించింది అన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న రైతులకు చిన్న, సన్నకారు, మహిళా రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అర్హతను బట్టి వరి కోత యంత్రాలు, కలుపు మొక్కలు, విత్తనాలు, ఎరువులు కలిపి వేసే యంత్రాలు, గడ్డి కట్టలు కట్టే యంత్రాలు, రోటా వేటర్స్, బ్యాడరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, పవర్ టిల్లర్స్, మైజ్ షెల్లర్స్, పవర్ వీడర్తో పాటు ట్రాక్టర్లను అందిస్తుందని, రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారుల తో పాటు ఆయాగ్రామల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## 37 మందికి ఇందిరమ్మ ప్రొసీడింగ్స్, 13 కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ: ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, భూత్పూర్ ఫిబ్రవరి 18 (స్కై న్యూస్);** భూత్పూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం 37 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు, ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్, 13 మంది కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.అనంతరం భూత్పూర్ మున్సిపాలిటీ 10వ వార్డులో కళావతమ్మ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 18 (స్కై న్యూస్):**రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ప్రత్యేక అవసరాల గల విద్యార్థులను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అభినందించారు.బుధవారం ఐడీఓసీ కలెక్టర్ ఛాంబర్ నందు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన జిల్లాకు చెందిన విద్యార్థులను అభినందించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్ లోని దోమలగూడ ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఈనెల 17న సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన విష్ణు లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, షాట్‌పుట్‌లో రెండో స్థానం సాధించి విశేష ప్రతిభ చూపించారు. నిఖిత క్యారమ్స్‌లో, షాట్‌పుట్‌లో రెండో స్థానం సాధించింది. వినయ్ కుమార్, విజయేంద్ర రన్నింగ్ విభాగంలో రెండో స్థానం సాధించి జిల్లాకు పేరు తెచ్చారు. విద్యార్థులు తమ శారీరక పరిమితులను అధిగమిస్తూ ధైర్యంగా పోటీల్లో పాల్గొని విజయాలు సాధించడం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందన్నారు.ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, ఇటువంటి రాష్ట్రస్థాయి పోటీలు వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విజేతలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ప్రతిభ కనబరచాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి విజయ లక్ష్మి, సెక్టోరియల్ అధికారులు కర్రెప్ప, మైఖేల్, శ్రీనివాసులు, శిక్షకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు సహస్ర పారాయణం భవన నిర్మాణానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తా

**మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వశీ**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 18** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికైన అగ్గనూర్ బస్వశీను సన్మానించిన్న షాద్ నగర్ విష్ణు సహస్రనామ పారాయణం సభ్యులు ఘనంగా సన్మానించారు భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చారు ఆధ్యాత్మిక చింతనతో నిర్మిస్తున్న చేపడుతున్న ఈ కార్యక్రమాలు ఎంతో గొప్పవనీ వారు కొనియాడారు.

# ఎమ్మెల్యే శంకర్ కు వీరశైవులం రుణపడి ఉంటాం

**వీరశైవ లింగాయత్ సమాజం 2026 డైరీ క్యాలెండర్ల విడుదల**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 18 :-** వీరశైవులకు మున్సిపల్ చైర్మన్ పదవిని కేటాయించి అగ్గనూరు బసవేశ్వరుని చైర్మన్ చేయడం ఎంతో గొప్ప విషయమని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కూకట్ పల్లి వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు అల్లి భద్రప్ప ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా షాద్ నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ను వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు అల్లిభద్రప్ప, ఉపాధ్యక్షులు మొరగి నర్సింలు, కోట మల్లేశం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి సుఖశాంతం, కోశాధికారి శివశంకర్ ఆధ్వర్యంలో చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ ను ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా అధ్యక్షులు అల్లి భద్రప్ప మాట్లాడుతూ వీరశైవ సమాజం నుండి అగ్గనూరు బస్వంను చైర్మన్ పదవి కేటాయించడం పట్ల స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు సమాజ సేవకు పరితపించే వారిలో వీరశైవ సమాజం ముందుంటుందని తమ రాజకీయ



అవసరాలు అభివృద్ధి గుర్తించి రాజకీయంగా ప్రోత్సహించిన సందర్భంగా ప్రభుత్వానికి సైతం వారు ధన్యవాదములు తెలిపారు ఈ సందర్భంగా అగ్గనూరు బసవేశ్వర్ మాట్లాడుతూ తనను చైర్మన్ పదవి వరించడం ఎంతో సంతోషంగా ఉందని ఇదంతా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులేనని చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ సంతోషం వ్యక్తం చేశారు కూకట్ పల్లి వీరశైవ లింగాయత్ సమాజం తరపున



తనకు సన్మానించడం ఎంతో గర్వంగా ఉందని అన్నారు వీరశైవుల పట్ల ఎంతో నిబద్ధతతో నిజాయితీతో తనకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో 2026 వీర శైవ లింగాయత్ సమాజం కు సంబంధించిన డైరీ, క్యాలెండర్ ను షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గునూరు బస్వం విడుదల చేశారు.

# రాయికల్ టోల్ ప్లాజా సమీపంలో రోడ్డు ప్రమాదం..

**ఇద్దరు మృతి ముగ్గురికి తీవ్ర గాయాలు**

**మృతదేహాలను సందర్శించిన సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఫిబ్రవరి 18 :-** రంగారెడ్డి జిల్లా రాయికల్ టోల్ ప్లాజా దగ్గర అర్థరాత్రి ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన పై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు గుర్తుతెలియని వాహనం ఇన్నోవా క్రిస్టా కారును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురిలో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు మృతులు రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ కు చెందిన పి. పురుషోత్తం రెడ్డి, గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డిగా గుర్తించారు మిగతా ముగ్గురు తీవ్రంగా గాయపడగా వారిని సమీప ఆసుపత్రికి తరలించారు అరుణాచలం యాత్ర ముగించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో ఉన్న సమయంలో ఈ దుర్ఘటన జరిగిందనీ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు మృతదేహాలు ఆసుపత్రిలో ఉండగా వాటిని సందర్శించి ఎమ్మెల్యే సంతాపం వ్యక్తం చేశారు వెంటనే పోస్టుమార్టం తదితర కార్యక్రమాలు నిర్వహించి శవాలను బంధువులకు అప్పగించాలని ఎమ్మెల్యే శంకర్ వైద్యులను ఆదేశించారు రోడ్డు ప్రమాదాలపై వాహనదారులు ఎల్లప్పుడూ జాగ్రత్త వహించాలని కోరారు.

# వృత్తి నిర్వహణలో క్యాలెండర్ పాత్ర కీలకం

**ఎస్ఎల్ టి ఏ క్యాలెండర్ ఆవిష్కరణ**



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 18( స్కైన్యూస్)** వృత్తి నిర్వహణలో క్యాలెండర్లు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని ఎస్ఎల్ టి ఏ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఎంతో సమాచారాన్ని పొందుపరిచారని జి హెచ్ ఎం మురళీ మోహనా చారి అన్నారు బుధవారం బిజినేపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన క్యాలెండర్ ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దడంతో కీలకపాత్ర పోషిస్తున్న ఎస్ఎల్ టి ఏ సభ్యుల పాత్రను వివరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గబ్బి శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## సరస్వతి దేవిగా జన్మదిన వేడుకలు జరుపుకోవాలీ: మాజీ ఎమ్మెల్యే అల



**చిన్నచింతకుంట ఫిబ్రవరి 18 (స్కై న్యూస్);** చిన్నచింతకుంట మండలం అల్లీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రఘువర్ధన్ గౌడ్ తమ్ముడి కూతురి జన్మదిన వేడుకల్లో బుధవారం ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. చిన్నారి జన్మదిన వేడుకల కేకులు కట్ చేసి చిన్నారికి తల్లిదండ్రులకు తదితరులకు తినిపించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ చిన్నారి ఆయురారోగ్యాలతో, అందరి దీవెనలతో, దేవాది దేవుని దీవెనలతో, సరస్వతి దేవిగా ప్రతి ఏట జన్మదిన వేడుకలు జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల కోరారు. అందరి ఆశీస్సులతో దురాత్మలు దూరపరుస్తూ సరస్వతి అమ్మవారి ఆశీస్సులు ఉండి చల్లగా దీవించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

## 25న ఉచిత కంటి ఆపరేషన్ చికిత్స శిబిరం



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 18( స్కైన్యూస్)** ఈనెల 25న జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ కార్యాలయంలోని 102 గదిలో జిల్లా అంతర్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ తెలిపారు. ఉదయం 9 నుండి 12గంటల వరకు వచ్చిన రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు,సాధారణ పరీక్షలు నిర్వహించి, అందులో అవసరమైన వారికి,క్యాటరాక్టు పొర గలవారికి ఉచితంగా కంటిఆపరేషన్లు మహబూబ్ నగర్ ఏనుగొండ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు.రోగులకు ప్రత్యేక అంబులెన్స్ ద్వార ఏనుగొండకు పంపనున్నట్లుతెలిపారు.రోగులు ముందుగా బి.పి,షుగర్ పరీక్షలు చేసుక్కొని రిపోర్టు వెంటతెచ్చుకోవాలనితెలిపారు.ఈ ప్రాంత రోగులు ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఓటర్ కార్డు,ఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ,ఫోన్ నెంబర్ ని తమవెంట తెచ్చు కోవాలని తెలిపారు.వివరాలకు 9440876556, 7386940480 లో సంప్రదించాలన్నారు.

## మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్ లను సన్మానించిన కాలనీవాసులు





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 18 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ 6 వార్డులో టీచర్స్ కాలనీ హనుమాన్ టెంపుల్ దేవాలయం వద్ద షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వశీ, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, 24 వార్డు కౌన్సిలర్ అగ్గనూర్ విశాల, 6వార్డ్ కౌన్సిలర్ రాజు నాయక్ లను సన్మానించిన్న కాలనీ వాసులు, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విజయ్ కుమర్ రెడ్డి,కిరణ్, సుధాకర్ గౌడ్,శ్రీకాంత్ ముదిరాజ్, రామన్ తేజ,శివ కృష్ణ రెడ్డి అభయాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, టీచర్స్ కాలనీ అధ్యక్షులు ఆలయ కమిటీ అధ్యక్షులు వావిలాల మల్లేష్ సాగర్, రాజేందర్, రాజు చారి, రాందాస్ శంకరయ్య, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందులాల్ నాయక్, నల్లమోని శ్రీనివాస్, గోపాల్ చారి, గోనెల శ్రీనివాస్, సుధాకర్ గౌడ్, మనోహర్ రెడ్డి, శ్రీకాంత్, హరినాయక్, వెంకటయ్య గౌడ్, రవి తేజ, రవి నాయక్, నడికుడా నర్సింలు, రవి చారి, అమర్నాథ్ రెడ్డి, సుదర్శన్, పాత్లవత్ రవి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ మూడ్ గణేష్'కు ఘన సన్మానం

**కొత్తగూడెం కార్పొరేషన్ విజయంతో సిపిఐ చారిత్రాత్మక ఘనత.. జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, శేషగిరి భవన్‌లో శాలువాలు, పూలమాలతో సత్కారం**

**ప్రజా ఆశయాల విజయమే ఈ ఫలితం --- కోరిమి రాజ్ కుమార్**




**కొత్తగూడెం ఫిబ్రవరి18( స్కై న్యూస్) :** కొత్తగూడెం కార్పొరేషన్‌కు తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో సిపిఐ 23 దివిజన్లతో పాటు మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మేయర్‌గా ఎన్నికైన మూడ్ గణేష్‌ను, కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పర్యవేక్షణ, సూచనలతో పార్టీ అభ్యర్థుల గెలుపుకు నిరంతర కృషి చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషాను ఘనంగా సన్మానించారు. సిపిఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇద్దరికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కోరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక, ప్రజా వర్గాల విశ్వాసానికి ఇది నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. కొత్తగూడెం అభివృద్ధికి మేయర్, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ విజయం ప్రజా పోరాటాలకు లభించిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ వి రమణ మూర్తి, బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

## కొత్వాల దంపతులను ఘనంగా సన్మానించిన మైనార్టీ నాయకులు

**ముస్లిం మైనార్టీల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం**

**రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల**



**పాల్వంచ ఫిబ్రవరి 18 (స్కై న్యూస్ ):**తెలంగాణా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికే కట్టుబడి వున్నదని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 46 డివిజన్ పాత పాల్వంచ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించిన కొత్వాల విమలాదేవి ని, ఆమె భర్త కొత్వాల శ్రీనివాసరావును ముస్లిం మైనార్టీ సోదరులు ఘనంగా సన్మానించారు. పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో బుధవారం ముస్లిం మైనార్టీ సోదరులు వారిని శాలువా, బొకేలతో సత్కరించారు. స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కార్పొరేషన్ ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ సోదరులు కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశారనీ, వారందరికీ కాంగ్రెస్ పార్టీ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు గాలికి

**26 నెలలైనా తీరని మహిళల, వృద్ధుల నిరీక్షణ**

**జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి ఆగ్రహం**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 18 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో జాగృతి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి విలేకర్ల విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ?ఎన్నికల సమయంలో అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగా రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు ప్రభుత్వం కొలువుదీరి 26 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన ప్రధాన హామీల అమలులో దారుణమైన జాప్యం జరుగుతోందని ఆయన విమర్శించారు విలేకరులకు అందజేసిన పత్రికా ప్రకటనలో ఆయన ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తూ ఈ క్రింది డిమాండ్లను లేవనెత్తారు ప్రతి నెల మహిళలకు రూ. 2500 మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 26 నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం మహిళా లోకాన్ని వంచించడమే ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు ?వృద్ధాప్య పింఛన్ రూ. 4000లకు, దివ్యాంగుల పింఛన్ రూ. 6000లకు పెంచుతామని ఆడబిడ్డ వివాహానికి తులం బంగారం చదువుకునే అమ్మాయిలకు స్కూటీలంటూ ఇచ్చిన హామీ ఏమైందని, పెరిగిన ధరలతో అల్లాడుతున్న సామాన్యులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, కాలయాపన చేస్తూ తత్సారం చేయడం అన్యాయం తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు పింఛన్లు ఇవ్వడంపై సాక్షాత్తూ హైకోర్టు ప్రశ్నించే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం తెలంగాణ సాధనలో ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు ఎన్నికల హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు ఇప్పటికైనా ప్రభుత్వం కుంటి సాకులు మానుకొని తక్షణమే పెంచుతామన్న పింఛన్లను మరియు మహిళలకు ఇస్తామన్న నగదును విడుదల చేయాలి ఈ ఆర్థికసంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్ లో నైన మహిళలకు వృద్ధులకు దివ్యాంగులకు ఉద్యమకారులకు,రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యేలా కేటాయింపులు చెయ్యాలని అన్నారు లేనిపక్షంలో రాజకీయ పార్టీగా ఎర్పడుతున్న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని కప్పాటి పాండురంగా రెడ్డి హెచ్చరించారు.

# శివాజీ జయంతి వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట ఫిబ్రవరి 18 (స్కై న్యూస్)** గురువారం శివాజీ జయంతి సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో మొత్తం 54 శోభయాత్రలు, బైక్ ర్యాలీలు నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.శివాజీ జయంతి శోభాయాత్ర, బైక్ ర్యాలీలకు ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరి అని, ర్యాలీ నిర్వహించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. నూతన శివాజీ విగ్రహాలను ప్రతిష్టించాలంటే తప్పనిసరిగా పరిమిషన్ తీసుకోవాలని అందుకు నిర్వాహకులు, ఆర్గనైజర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ తెలిపారు. ర్యాలీలు నిర్వహించే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని అందుకు నిర్వాహకులు సమయపాలన తప్పకుండా పాటించాలని సూచించారు. శోభయాత్ర నిర్వహించే సమయంలో డీజేలు, అధిక శబ్ద పరికరాలు, లేజర్ లైట్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. అశాంతి కలిగించే నినాదాలు, ప్రవర్తన చేయరాదని, మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.మద్యం సేవించి ర్యాలీలో పాల్గొనడం నిషేధమని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే లోకల్ పోలీసులకు లెడ్ డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇతరులను కించపరిచే విధంగా పోస్టులు చేయరాదని, అలాంటి వారిపై చట్టపకరం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి...

**అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.**

**ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు**

**మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.**

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ గారు తెలిపారు.

## కార్పొరేటర్ ని సన్మానించిన విద్యానగర్ నాయకులు



**కొత్తగూడెం ఫిబ్రవరి 18 (స్కై న్యూస్):** కార్పొరేషన్ ఎన్నికలలో 27వ డివిజన్ కార్పొరేటర్ గా ఎన్నికైన శ్రీమతి మద్దెల హరిత ని, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి సారథ్యంలో మర్యాద పూర్వకముగా వారి స్వగృహంలో కలిసి శాలువా కప్పి వారిని అభినందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి భూక్య శాంతి శ్రీ వార్డు మెంబర్స్ వాడపల్లి జకరయ్య , శ్రీమతి భూక్య పూర్ణ , మాలోతు శంకర్ , టిడిపి సీనియర్ నాయకులు బిక్కసారి నాగేశ్వరరావు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాసాని శ్రీనివాస్ రెడ్డి , రాజేశ్వర్ , పంచాయితీ కార్యవర్గము బండ రామకృష్ణ కిషోర్ , సల్ల వేణు , రంజిత్ , మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 18 (స్కై న్యూస్):**ఎంఎస్ ఎంఈ, డీఎఫ్ఓ ఆధ్వర్యం లో బుధవారం గద్వాల అక్షయ గ్రాండ్ బంకెట్ హాల్ లో పీఎం విశ్వ కర్మ లబ్ధిదారులకు డిజిటల్ మార్కెటింగ్, ఆర్థిక అక్షరాస్యత మీద ఆగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా జిఎం డిఐసి రామలింగేశ్వర గౌడ్ ఎమ్మెస్ ఎం ఇ స్కీమ్స్, ఇతర ప్రభుత్వ స్కీమ్స్ గురించి వివరించడం జరిగింది. ప్రోగ్రామ్ లో రామలింగేశ్వర గౌడ్, బీసీ వెల్ఫేర్ అధికారి అక్బర్ భాష , సజ్జన్ సీనియర్ మేనేజర్ ఇండియా పోస్ట్ పేమెంట్, బ్యాంక్ ఎల్డీఎం శ్రీనివాస్ రావు, నుసిత, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్, శ్రీనివాస్ అడిషనల్ రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్, డి ఎం శ్రీనివాస్ నాయక్ ఆర్ సి టి, గురుస్వామి, రాజేశ్ యాదవ్ అసిస్టెంట్ డైరెక్టర్ లు ఎమ్మెస్ ఎం ఇ డీఎఫ్ఓ,హైద్రాబాద్, ఆనిమి రెడ్డి, పీఎం విశ్వ కర్మ మేనేజర్,వినీత్ పీఎం వి కన్సల్టెంట్, దయాకర్ ఈ డి సి మేనేజర్, శ్యామల ఈ డి సి అసిస్టెంట్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**




**నారాయణపేట ఫిబ్రవరి 18( స్కై న్యూస్)** వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం కార్యాచరణ జంతు జనన నియంత్రణ (ఆదీజ) మరియు రేబిస్ టీకాలపై ప్రత్యేక దృష్టి పెట్టీ స్టెరిలైజేషన్ వేగవంతం చేస్తూనే, ప్రమాదకరమైన కుక్కల కోసం ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా ఉండటానికి, వీధి కుక్కలకు ఆహారం పెట్టే ప్రదేశాలను నియంత్రిస్తూ (ఖీవవసఱఅస్త్ర శీఅవం) కీలక నిర్ణయాలు తీసుకోవాలన్నారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదీజ ఆ టీకాలు: 2023 నియమాల ప్రకారం కుక్కలకు స్టెరిలైజేషన్, రేబిస్ టీకాలు వేసి, పట్టుకున్న చోటే వదిలివేయాలని,ప్రత్యేక ఆహార జోన్లు: రోడ్లపై, నడిచే దారుల్లో కుక్కలకు ఆహారం పెట్టడం నిషేధించి, ప్రత్యేక ప్రాంతాలు ఏర్పాటు చేయాలన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కుక్కల జనాభా నియంత్రణలో నిర్లక్ష్యం వహించవద్దని, శాస్త్రీయ పద్ధతులు పాటించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు.వీధి కుక్కల నియంత్రణకు జంతు సంక్షేమ చట్టాలను పాటిస్తూనే, ప్రజా భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలన్నారు. జిల్లాలో వీధి కుక్కల బెడద చాలా ఉందని తెలిపారు. వీధి కుక్కల విషయంలో సుప్రీంకోర్టు జారీచేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ వాటిని ప్రతీ గ్రామంలో ఊరి బయట ఒక సెల్టర్ ఏర్పాటు చేసి, వీధి కుక్కలను అక్కడికి తరలించి అక్కడే వాటికి ఫుడ్, తాగునీటి వసతి కల్పించాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర సముదాయాలలో ఇక పై వీధి కుక్కల సంచారం ఉండకుండా చుట్టూ కట్టుదిట్టమైన ప్రహరీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతీ మున్సిపాలిటీ కేంద్రంలో, ప్రతి మండల కేంద్రంలో తప్పనిసరిగా ఒక ఎనిమల్ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని, గ్రామాల వారీగా ఉన్న కుక్కల సంఖ్య లెక్కించి వాటిని ఎనిమల్ కేర్ సెంటర్ కు తరలించి, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించి, ఎక్కడి నుంచి వాటిని తీసుకువచ్చామో తిరిగి అక్కడే వదిలి పెట్టాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ఒకే ఒక్క ఎనిమల్ కేర్ సెంటర్ ( డంపింగ్ యార్డ్ వద్ద) ఉందని, బ్లూ క్రాస్ సహకారంతో ఎన్ జీ ఓ తో ఒప్పందం చేసుకుని పట్టణంలోని వీధి కుక్కలను అక్కడికి తరలించి స్టెరిలైజేషన్ ( సంతాన నిరోధక శస్త్ర చికిత్స) చేసి తిరిగి వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చామో అక్కడే వదిలి పెట్టాల్సి ఉంటుందన్నారు. కేవలం వీధి కుక్కలే కాకుండా జాతీయ రహదారులు, రోడ్లపై తిరిగే ఆవులు, ఎద్దులను గో శాల కు తరలించాలన్నారు. జిల్లా లోని మక్తల్, కోస్గి, మద్దూరు మున్సిపాలిటీలలో ఎనిమల్ కేర్ సెంటర్ లను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అప్పటి వరకు నారాయణపేట లో ఉన్న ఎనిమల్ కేర్ సెంటర్ కు జిల్లాలోని అన్ని గ్రామాలలోని వీధి కుక్కలను తీసుకువచ్చి స్టెరిలైజేషన్ చేయించి, తిరిగి ఆయా గ్రామాలకు వాటిని తరలించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.. జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు మందకొడిగా సాగుతున్నాయని, వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామాలు, మండలాలకు ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో టార్గెట్లను అచీవ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో నారాయణపేట మక్తల్ మద్దూర్ మున్సిపాలిటీల కమీషనర్లు నర్సయ్య, శ్రీ రాములు,శ్రీకాంత్, అగ్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# పార్కు స్థలం కబ్జాకు..... రంగం సిద్ధం

## రూ. 5 కోట్ల విలువైన ఓపెన్ స్పేస్ ఆక్రమణ
## మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన బోర్డు తొలగింపు
## దర్జాగా చదును చేసి మాదే అంటున్న వైనం
## పార్కు స్థలం కాపాడాలంటూ అధికారులకు ఫిర్యాదు
## కబ్జాపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 18 :-** ప్రజా ప్రయోజనాల కోసం వదిలేసిన పార్కు స్థలంపై కొందరు కన్నేశారు ఎలాగైనా ఆ స్థలం ఆక్రమించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశారు అనుకున్నదే తడవుగా పావులుకదిపి దర్జాగా వెంచర్ లో ఓపెన్ స్పేస్ గా చూపిన కోట్ల విలువైన స్థలాన్ని చదును చేసేశారు ఈ స్థలం మాదే అంటూ బీరాలు పలికారు అనుకోని ఈ పరిణామాన్ని చూసిన ప్లాట్ల ఓనర్లు ఒక్కసారిగా ఆందోళనతో అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని ఫరూక్ నగర్ పట్టణ శివారులో వెలుగు చూసింది పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని ఫరూఖ్ నగర్ శివారులోనీ సర్వే నెంబర్ 28 లో దాదాపు 23 సంవత్సరాల క్రితం సుమారు 21ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో వేంకటేశ్వర వెంచర్ పేరుతో గ్రామ పంచాయతీ లేఔట్ వేశారు అప్పట్లో చిరు






వ్యాపారస్తులు ఖాయా కష్టం చేసుకుని బ్రతికే పేద ప్రజలు రూపాయి రూపాయి కూడబెట్టి స్వంత ఇల్లు నిర్మాణం చేసుకోవాలి అనే ఆశతో వేంకటేశ్వర వెంచర్ లో ప్లాట్లను కొనుగోలు చేశారు విశాలమైన రోడ్లు 33ఫీట్ల, 40 ఫీట్లు వెంచర్ మ్యాప్ లో చూపిన విధంగా ఓపెన్ స్పేస్ లను చూసిన జనం తమకు అనుకూలమైన ప్లాట్లను ఎంచుకుని అందుకు తగ్గట్టుగా వెంచర్ నిర్వాహకులకు ధర చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు ఈ తతంగం పూర్తయిన 20 ఏళ్ల తరువాత కొంతమంది వ్యక్తులు మంగళవారం వేంకటేశ్వర వెంచర్ లో ప్రజా ప్రయోజనాల కోసం వదిలేసిన సుమారు రూ.5 కోట్ల విలువైన ఓపెన్ స్పేస్ స్థలాన్ని కబ్జా చేసే ప్రయత్నం చేశారు వెంచర్ మ్యాప్ లో ఓపెన్ స్పేస్ గా ఉన్న స్థలాని డోజర్ లతో చదును చేశారు మున్సిపల్ స్థలం అనే బోర్డును తీసేసి యెదేచ్ఛగా

హద్దులు తొలగించారు ఇది గమనించిన వెంకటేశ్వర వెంచర్లోని ప్లాట్ల యజమానులు కొందరు ఇది పార్క్ స్థలమని ఎందుకు ఇలా చేస్తున్నారని అడ్డుకుని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు గతంలో మున్సిపాలిటీ అధికారులు ఈ స్థలం మున్సిపాలిటీకి చెందిందని బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు, సదరు బోర్డును కూడా కబ్జాకు యత్నించిన వారు తొలగించారని ప్లాట్ల యజమానులు వాపోతున్నారు ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడే విలువైన స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలని బాధితులు అధికారులను కోరుతున్నారు

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్లాట్ల యజమానులు కోరుతున్నారు

**కబ్జాపై స్పందించి పనులను ఆపేసిన మున్సిపల్ కమిషనర్**

దస్తావేజులను పరిశీలించి త్వరలోనే చట్టపరమైన చర్యలను





చేపడతామన్న మున్సిపల్ కమిషనర్.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం మున్సిపాలిటీ ఏరియాలోని వెంకటేశ్వర కాలనీలో కబ్జా జరిగిన వ్యవహారంపై స్థానికులు మున్సిపాలిటీకి ఫిర్యాదు చేయగా కమిషనర్ సునీత రెడ్డి వెంటనే స్పందించారు పార్కు స్థలాన్ని చదును చేస్తున్న వాహనాన్ని అక్కడి నుండి పంపించేశారు ఈ దుశ్చర్యకు పాల్పడే యూనుస్ అనే వ్యక్తిని అక్కడినుండి మున్సిపల్ సిబ్బంది పంపించేశారు ఏదైనా డాక్యుమెంట్లు ఉంటే వచ్చి కార్యాలయంలో కలవాలని అంతేతప్ప ప్రభుత్వ స్థలంలో ఇక్కడ పనులు చేపట్టకూడదని అభ్యంతరాలు ఉన్నప్పుడు ఇక్కడికి రాకూడదని మున్సిపల్ సిబ్బంది తెలియజేశారు.

# మానవత్వాన్ని చాటుకున్న కొత్వాల దంపతులు

## 1 లక్షా 53 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసిన కొత్వాల దంపతులు
## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాలుడిని మానవత్వంతో ఆదుకోవాలి
## రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

**పాల్వంచ ఫిబ్రవరి 18 (స్కై న్యూస్ ):**పాత పాల్వంచ గ్రామస్థుల ద్వారా బాలుడి కుటుంబానికి 1 లక్షా 53 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసిన కొత్వాల దంపతులు.అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పాత పాల్వంచకు చెందిన బాలుడు బద్రిని మానవత్వంతో ఆదుకోవాలని రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. 46వ డివిజన్ పాత పాల్వంచకు చెందిన సీతారామరాజు, ప్రమీల దంపతుల కుమారుడు బద్రి ఇటీవల అనారోగ్యంతో పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య చికిత్స నిమిత్తం వెళ్ళగా ఇంజక్షన్ వికటించి తీవ్ర అనారోగ్యం పాలవగా, విజయవాడలోని ప్రైవేట్



ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యానికి లక్షలాది రూపాయలు అవసరమవుతుండగా పాత పాల్వంచలోని కొంత మంది దాతలు మానవత్వంతో 1 లక్షా 53 వేల రూపాయలు సేకరించారు. పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో బుధవారం ఈ పైకాన్ని కొత్వాలతోపాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవిలు బాలుడి తండ్రి సీతారామరాజుకు అందజేశారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ బాలుడి చికిత్సకు లక్షల రూపాయలు అవసరం వుందని, దాతలు విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శిరీష, గౌరీ, నాగమణి, ఆదిలక్ష్మి, వినయ్, వసుమల్ల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ శాంతి శ్రీ

## విద్యానగర్ పంచాయతీ పదవ వార్డులో సమస్యలు వింటున్న సర్పంచ్





**చుంచుపల్లి ఫిబ్రవరి 18 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ పదవ వార్డులో వార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్న విద్యానగర్ గ్రామ పంచాయతీ ప్రథమ పౌరురాలు భూక్య శాంతి శ్రీ ప్రసాద్. పదవ వార్డులో 15 సంవత్సరాల నుండి సైడ్ కాలువలు సమస్య ఉండేదని ఎందరో వచ్చి వెళ్లారు కానీ వార్డు సమస్యలు ఎవరు పట్టించుకోలేదని సర్పంచ్ శాంతి శ్రీ తో వార్డు ప్రజలు విన్న వించినారు. ఈ సందర్భంగా విద్యానగర్ ప్రథమ పౌరురాలు శాంతి శ్రీ మాట్లాడుతూ సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో కొత్తగూడెం అభివృద్ధి పదంలో నడుస్తుందని దానికి ఉదాహరణ నే గతంలో పంచాయతీ ఎన్నికలు ఇప్పుడు కార్పొరేషన్ ఎన్నికల లో ప్రజలు సిపిఐ పార్టీకి భ్రమ రథం పట్టారని ప్రజల ఆశలకు అనుగుణంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా నేతృత్వంలో చుంచుపల్లి మండల కార్యదర్శి ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి ఆధ్వర్యంలో విద్యానగర్ పంచాయతీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని సర్పంచ్ శాంతి శ్రీ ప్రసాద్ అన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఫిబ్రవరి 18 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో రైతుల ఆర్థికాభివృద్ధి నేల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమంలో భాగంగా బూర్గుల గ్రామం రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ పథకం కింద గ్రామానికి చెందిన 125 మంది రైతులను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత అమలు విధానాలు దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు రసాయన ఎరువులు పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ దేశీ ఆవు పేడ మూత్రం జీవామృతం ఘనజీవామృతం బీజామృతం వంటి సహజ వనరులతో సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వివరించారు ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారవంతం పెరగడంతో పాటు నీటి వినియోగం



తగ్గుతుందన్నారు పంటల వ్యయం తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు అంతేకాకుండా పర్యావరణ కాలుష్యం తగ్గి, దీర్ఘకాలికంగా భూసారం నిలుస్తుందని అన్నారు వినియోగదారులకు రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని స్పష్టం



చేశారు సదస్సులో పాల్గొన్న రైతులకు పంటల నిర్వహణ సహజ పురుగుల నియంత్రణ పద్ధతులు ప్రభుత్వ సబ్సిడీలు శిక్షణా కార్యక్రమాలపై కూడా అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు రాంబాబు, తేజ్ కుమార్, రిసోర్స్ పర్సన్స్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మదనపల్లి ఘటన నేపథ్యం గంజాయి ప్రభావమే

## రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేసి డ్రగ్స్ ను అరికట్టాలి
## మాజీ పార్లమెంటు సభ్యులు పెనుమల్లి మధు

ఏడేళ్ల పసిపాపపై అత్యాచారం జరిపి, దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడు డ్రగ్స్ స్వీకరించి ఉన్నారన్న వార్త తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. తిరుపతి సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పెరిగిపోతున్న డ్రగ్ ప్రభావం గురించి ప్రజలు ఆందోళనతో ఉన్నారని, స్కూళ్లు, కళాశాలల వద్ద డ్రగ్స్ అమ్మకాలు పెరిగాయని వివరించారు. 7 ఏళ్ల పసిపాపను సైతం కన్ను మిన్ను కానకుండా అత్యాచారానికి పాల్పడడం వెనుక గంజాయి ప్రభావం ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల కారణంగా హత్యలు, అత్యాచారాలు, దాడులు సంఖ్య పెరిగిందని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియా తీవ్రతను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణం పున్నయ్య కమిషన్ తరహాలో రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటన చేయాలని మాదక ద్రవ్యాల తీవ్రతను గమనించి నిర్దిష్ట సూచనలు చేయడం ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చని అన్నారు. తాజాగా అనకాపల్లి పట్టణంలో 1000 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది అన్నారు. విశాఖ జైలులో మాదకద్రవ్యాల నిందితులతో జైలు సామర్థ్యాన్ని మించి నిండిపోయిందని స్వయంగా జైలు సూపరిండెంట్ ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. టన్నుల కొద్ది గంజాయి నిల్వలు దొరుకుపోతున్నాయి అంటే రాష్ట్రంలో నేరస్తుల ప్రభావం ఎలా ఉందో అర్థమవుతుందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నేతలు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# చిన్న తాండ్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తాళం

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 18(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని చిన్న తాండ్రపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కొత్తగా నిర్మించిన భవనంలోని విద్యార్థులను కాంట్రాక్టర్, బయటకు పంపించి తాళం వేశారు ఈ విషయమై కాంట్రాక్టర్ రమేష్ ను ఫోన్ ద్వారా సంప్రదించగా నా పరిస్థితి చాలా దారుణంగా ఉంది,ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు చిన్న తాండ్రపాడు గ్రామంలో కొత్తగా స్కూల్ భవనం నిర్మించి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు బిల్లులు మంజూరు చేయకుండా అధికారులు చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు దానికి సంబంధించిన బిల్లు ఏఈ అజాం బిల్లును ఆపడం జరిగిందని ఆవేదన చెందారు.



భవనం కోసం తెచ్చిన అమౌంట్ కు వడ్డీలు కట్టలేక నరకయాతన అనుభవిస్తున్నాను ఏ ఈ డి ఇ లు మాత్రం అప్పుడు వస్తాను ఇప్పుడు వస్తాను అంటూ కాలయాపన చేస్తున్నారు దానికి సంబంధించిన బిల్లులు ఇస్తేనే తాళం తీస్తానంటూ పేర్కొన్నారు.

# దాడి వాళ్లది..కేసులు మాపైన బాల్క సుమన్

**మంచిర్యాల:**చెన్నూరులో 18 వార్డులకు మీకు 11 వార్డులు వస్తే మేము దాంట్లో వేలు పెట్టలేదు.. అదే క్యాతనపల్లిలో 22 వార్డులకు మాకు 14 వస్తే, మీరెందుకు ప్రజా తీర్పును హత్య చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. స్వయంగా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మార్వో లు మా అభ్యర్థులకు ఫోన్ చేసి మీ ఇండ్లు కూల్చేస్తానని బెదిరిస్తున్నారని అన్నారు.రాళ్ళు కాంగ్రెస్ వాళ్ళు విసిరితే, పోలీసులు మా మీద లాఠీచార్జ్ చేసి.. మళ్లీ కేసులు కూడా మా మీదే పెట్టారు. మా కార్లు ధ్వంసం అయితే టీవీలో ఏమో వివేక్ కార్లు ధ్వంసం చేశారని చూపిస్తున్నారు. దాడి వాళ్ళు చేస్తే కేసులు మా మీద పెడతారా? నిజంగా పోలీస్ వాళ్లకు దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే వీడియో ఫుటేజ్ చూడాలి కదా అని అన్నారు.వివేక్ వెంకటస్వామికి ఊడిగం చేస్తూ.. సిగ్గులేని, దద్దమ్మల లాగా పోలీసులు మా మీద కేసులు పెట్టారని ఆరోపించారు.

# వంటనూనెల్లో స్వావలంబన దిశగా తెలంగాణ

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వంట నూనెల దిగుమతి భారం ఒక తీరని లోటుగా మారుతోంది. ఏటా సుమారు రూ. 1.5 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని మనం కేవలం పామ్ ఆయిల్ దిగుమతుల కోసమే వెచ్చిస్తున్నాం.ఈ నేపథ్యంలో, దేశాన్ని వంట నూనెల రంగంలో 'ఆత్మనిర్భర్' గా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకమైన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్‌ను ప్రవేశపెట్టాయి.. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఒక నిశ్శబ్ద విప్లవానికి నాంది పలికింది. తెలంగాణ ప్రభుత్వం వంట నూనెల దిగుమతి భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తోంది. కేవలం సాగుకే పరిమితం కాకుండా, దానిని పారిశ్రామికాభివృద్ధితో అనుసంధానించటం ద్వారా రాష్ట్ర గ్రాణ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మారుస్తోంది. ఆయిల్ పామ్ సాగు కేవలం పొలాల్లోనే కాకుండా, పరిశ్రమల స్థాపనలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. పండించిన గెలలను (ఈఈః) తక్షణమే ప్రాసెస్ చేయాల్సి ఉండటంతో, ప్రతి సాగు జోన్‌లో ప్రాసెసింగ్ మిల్లుల నిర్మాణం యుద్ధ ప్రతిపాదికన జరుగుతోంది. ఉపాధి విషయానికి వస్తే ఒక్కో ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా వందలాది మందికి నేరుగా, వేలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఒకప్పుడు ఆయిల్ పామ్ అంటే కేవలం కోస్తా తీర ప్రాంత పంట అనే అపోహ ఉండేది. కానీ నేడు తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్, జనగామ, సిద్దిపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, సూర్యాపేట వంటి జిల్లాల్లో ఈ పంట ఆశాజనకమైన ఫలితాలను ఇస్తోంది. క్షేత్రస్థాయిలో మేము గమనించిన ప్రధాన మార్పు 'ప్రభుత్వ భరోసా'. గతంలో కొన్ని ప్రైవేటు కంపెనీల వైఫల్యాల వల్ల రైతుల్లో నెలకొన్న అపనమ్మకాన్ని తొలగించి, ఆయిల్ ఫెడ్ నేరుగా రంగంలోకి దిగడం సాగు విస్తరణకు బలమైన ఊతాన్నిచ్చింది. ఈ విప్లవం విజయవంతం కావడం వెనుక వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, టీజీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డిల సమన్వయం కీలకమైంది. ప్రతి జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్లు ఉండాలన్నది మంత్రి ఆశయం. ప్రైవేటు కంపెనీలు జాప్యం చేస్తే, ఆ జోన్లను రద్దు చేసి ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు అప్పగిస్తామని ఆయన కఠినంగా వ్యవహరిస్తూ, పనులను వేగవంతం చేస్తున్నారు.. ఆయిల్ ఫెడ్ చైర్మన్ హోదాలో క్షేత్రస్థాయిలో ఉమ్మడి 10 జిల్లాల్లో పది లక్షల ఎకరాల సాగు లక్ష్యంతో రైతుల్లో నమ్మకాన్ని నింపుతున్నారు. ఉమ్మడి పది జిల్లాలలో 10 లక్షల ఎకరాల సాగు లక్ష్యంతో విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, రైతులకు సాంకేతిక ఆర్థిక భరోసాను అందిస్తున్నారు. ఆయిల్




పామ్ రైతుకు ఒక రకంగా 'పెన్షన్' వంటి పంట. సంప్రదాయ పంటలతో పోలిస్తే ఇది అత్యధిక ఆదాయాన్నిస్తుంది. ఒక ఎకరా తోట ద్వారా ఏడాదికి సగటున (ప్రారంభంలో 6 నుంచి ఆ పైన) 10 నుండి 12 టన్నుల గెలల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం టన్ను ధర సుమారు ?20,456-(జనవరి 2026 నాటికి) ఉంది. అంటే, ఎకరాకు అన్ని ఖర్చులు పోను ఏడాదికి ? 1.5 లక్షల నుండి? 2 లక్షల నికర ఆదాయం రైతుకు లభిస్తుంది. సూక్ష్మ నీటి పారుదల ద్వారా ఇతర పంటల కంటే 40% నీటిని ఆదా చేయవచ్చు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట వద్ద ఆయిల్ ఫెడ్ నిర్మించిన ప్రాసెసింగ్ మిల్లు తెలంగాణ గర్వించదగ్గ సాంకేతిక అద్భుతం. సుమారు ?300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ మిల్లు ఆరంభ దశలో గంటకు 30 మెట్రిక్ టన్నుల గెలలను క్రష్ చేసే సామర్థ్యం కలిగి ఉంది, దీనిని భవిష్యత్తులో 60 ్ఖఊ కి విస్తరించే అవకాశం ఉంది. ఇది 'జీరో వేస్ట్' టెక్నాలజీతో పని చేస్తుంది. ఇక్కడ వెలువడే వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాలు కూడా అనుసంధానించబడి ఉన్నాయి. ఇది రైతులకు స్థానికంగానే మార్కెటింగ్ భరోసాను కల్పిస్తోంది. ఇందులో 4 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, అత్యాధునిక రిఫైనరీ మరియు నీటి పునర్వినియోగం వంటి సౌకర్యాలు ఉన్నాయి. ఇది సిద్దిపేటతో పాటు యాదాద్రి భువనగిరి, జనగామ, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట జిల్లాల రైతులకు కూడా ప్రయోజనం చేకూ ర్చనుంది. గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు ప్రభుత్వం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ ధృవీకరించిన మేలురకం మొక్కలను మాత్రమే సరఫరా చేస్తోంది. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100%, ఇతరులకు 90% డ్రిప్ రాయితీనిస్తోంది. అలాగే, మొక్కలు నాటిన మొదటి నాలుగేళ్లలో నిర్వహణ కోసం ఎకరానికి సుమారు ?52,000 వరకు రాయితీ నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయబడుతోంది. తెలంగాణను 'ఆయిల్ పామ్ హబ్'గా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ జిల్లాల రైతులు అద్భుతంగా స్పందిస్తున్నారు. ప్రైవేటు సంస్థ ల వైఫల్యం తర్వాత పగ్గాలు చేపట్టిన ఆయిల్ ఫెడ్, నర్మెట్ట, బీచుపల్లి ఫ్యాక్టరీల ఏర్పాటు ద్వారా పారిశ్రామిక తోడ్పా టును అందిస్తోంది. జర్నలిజం సమాచారాన్ని విశ్లేషిస్తే, లైజనింగ్ వ్యవస్థ దాన్ని అమలులోకి తెస్తుంది. ఈ రెండింటి సమన్వయంతో తెలంగాణ రైతు పాలిట ఆయిల్ పామ్ సాగు నిజమైన 'అక్షయ పాత్ర'గా నిలవబోతోంది.

# మైనర్ బాలికపై అత్యాచారం

**ఆపై హత్య! కట్ చేస్తే.. తెల్లారి చెరువులో డెడ్‌బాడీగా..**



**తిరుపతి, ఫిబ్రవరి 18:**తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన అన్నమయ్య జిల్లా మదనపల్లె బాలిక హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ మృతి చెందాడు. కరంబలకోట మండలం కనసానివారిపల్లె చెరువులో అతని మృతదేహం కనిపించింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు డెడ్‌బాడీని మదనపల్లెకు తరలిస్తున్నారురాష్ట్రాల్లో సంచలనం రేపిన అన్నమయ్య జిల్లా మదనపల్లె బాలిక హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ మృతి చెందాడు. కరంబలకోట మండలం కనసానివారిపల్లె చెరువులో అతని మృతదేహం కనిపించింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు డెడ్‌బాడీని మదనపల్లెకు తరలిస్తున్నారు. నిన్న హత్యాచారం అనంతరం నిందితుడు పరారైనట్టు పోలీసులు చెప్పారు. ఈ క్రమంలోనే కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. అటు నీరుగట్టువారిపల్లిలోని కులవర్ధన్ ఇంటి దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అటు మరికాసేపట్లో హత్యకు గురైన చిన్నారి డెడ్ బాడీకి అంత్యక్రియలు జరగనున్నారు. స్వగ్రామం వీరబల్లి మండలంలో అంత్యక్రియలు చేయనున్నారు.అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చోటుచేసుకున్న అమానుష ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారి మృతదేహానికి డాక్టర్లు మంగళవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. ఆ తర్వాత చిన్నారి భౌతికకాయాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. వైద్య పరీక్షలు, పోలీసు దర్యాప్తులో అత్యంత దారుణమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోస్టుమార్టం నివేదిక ప్రకారం బాలికపై అత్యాచారం జరిగినట్లు డాక్టర్లు ధృవీకరించారు. నిందితుడు అత్యంత కిరాతకంగా చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, ఆపై పాపను నీళ్ల డ్రమ్ములో ముంచి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడని నిర్ధారణ అయ్యింది.మదనపల్లెకి చెందిన 7 ఏళ్ల బాలిక రెండో తరగతి చదువుతోంది. సోమవారం స్కూల్‌కు సెలవు ఇవ్వడంతో ఇంటి వద్ద ఉన్నది. మరోవైపు తల్లి పనికి వెళ్లింది. బాలిక ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం 4.30 గంటలకు తల్లి ఇంటికి ఫోన్ అడగగా చిన్నారి ఇంట్లో లేదని, ఆడుకోవడానికి ఫ్రెండ్స్ వద్దకు వెళ్లి ఉంటుందని భావించారు. ఎంతకు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికి చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ టీం రంగంలోకి గాలింపు చేపట్టింది. స్థానికంగా ఎవరూ తెలియదని చెప్పడంతో చివరికి బాలిక ఎదురింట్లో ఉంటున్న కులవర్ధన్ ఇల్లు రాత్రి 1.30 గంటలకు గాలించడానికి వెళ్లారు. ఎంత తలుపుకొట్టినా కులవర్ధన్ తలుపు తీయలేదు. కిటికీలోంచి చూస్తే నిద్రపోతున్నట్లు కనిపించాడు. బాలిక తాత మాత్రం చివరగా కులవర్ధన్‌తోనే బాలిక కనిపించిందని చెప్పడంతో మంగళవారం ఉదయం మళ్లీ అతడి ఇంటికి వెళ్లి చూడగా దారుణం వెలుగు చూసింది. డ్రమ్ములో బాలిక మృతదేహమై ఉండటాన్ని గుర్తించి అంతా షాకయ్యారు. ఇదిలా ఉంటే.. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నిన్న అదృశ్యమైన ఏడేళ్ల బాలిక శవంగా కనిపించిన సంగతి తెలిసిందే. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా.. ఇంటికి సమీపంలోనే బాలిక ఓ డ్రమ్ములో శవమై కనిపించింది. కులవర్ధన్ అనే వ్యక్తిని అనుమానించారు పోలీసులు. ఈ కులవర్ధన్ బాలిక ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్నాడు. అత్యాచారం చేసి.. ఆపై హత్య చేసి డ్రమ్ములో కుక్కి చంపినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ క్రమంలోనే పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. అతడి డెడ్ బాడీ ఈ ఉదయం చెరువులో దొరికింది.


# సర్వదేవతావ్రతాల పూజలకు ఉద్దిష్టం ఫాల్గుణం

శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన మాసాల్లో ఫాల్గుణం ఒకటి. పూర్ణిమ తిథిలో చంద్రుడు పూర్వ ఫల్గుణి లేదా ఉత్తర ఫల్గుణి నక్షత్ర సపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని 'ఫాల్గుణి'గా పరిగణిస్తారు. ప్రధానంగా విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణం. ఇంతకు ముందు పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ చివరి మాసంలో మరో సారి ఆచరించడం విశేషం. అందుకే సర్వ దేవతా వ్రత సమాహారంగా, సర్వవ్రత సింహావ లోకనంగా కనిపిస్తుంది ఫాల్గుణ మాసం. ఫాల్గుణ మాసంలో ప్రతి తిథికీ ఒక ప్రత్యేకత ఉంది. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి మహా విష్ణువుకు క్షీరాన్నం నివేదిస్తే అభీష్ట సిద్ధి కలుగుతోందని భాగవత పురాణం వివరిస్తోంది. ఆదితి పయోవ్రతం ఆచరించి వామనుడిని పుత్రుడిగా పొందింది. విష్ణుపూజకు 'పయోవ్రతం' విశిష్టమైంది. దీన్ని శుద్ధ పాడ్యమి నాడు ప్రారంభించి పన్నెండు రోజుల పాటు కొనసాగిస్తారు. సపంలోని నదుల్లో స్నానమాచరించి, సూర్యుడికి అర్ఘ్యమిచ్చి, విష్ణువును షోడశోపచారాలతో పూజించి, పాలను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. పయస్సు అంటే పాలు. అదితి ఈ వ్రతం ఫలితం వల్లే వామనుడు జన్మించాడట. హరిహరసుతుడు అయ్యప్ప స్వామి, పాలకడలి నుంచి లక్ష్మీదేవి ఇదే మాసంలో జన్మించారు. ఇక మహాత్ములైన శ్రీకృష్ణ చైతన్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతిలు జననం కూడా ఈ మాసంలోనే జరిగింది. అర్జునుడి జన్మ నక్షత్రం కూడా ఇదే కాబట్టి 'ఫల్గుణ' అనే పేరుంది. కురు పాండవుల్లో కొందరు ఫాల్గుణ మాసంలో జన్మించినట్లు చెబుతారు. ఫాల్గుణ బహుళ అష్టమినాడు ధర్మరాజు, ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రోజున భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనులు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరుల్ని శుద్ధ తదియనాడు పూజించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ మాసంలో రెండు రోజులు వినాయకుణ్ని ఆరాధిస్తారు. శుక్ల పాడ్యమి, చతుర్థినాడు అవిఘ్న, పుత్ర గణపతి వ్రతాల్ని ఆచరిస్తారు. శుద్ధ ద్వాదశి పయోవ్రతానికి చివరిరోజు. ఈ రోజున నరసింహస్వామిని పూజిస్తారు. దివ్యౌషధంగా భావించే ఉసిరిని శుద్ధ ఏకాదశినాడు పూజించి, ఆ చెట్టు వద్దనే 'అమలక ఏకాదశి' వ్రతం నిర్వర్తిస్తారు. దీన్ని 'అమృత ఏకాదశి' గా పరిగణిస్తారు. మదురైలోని నాక్షీ సుందరేశ్వరుల కల్యాణం రోజు ఇది. అందుకే శివపూజ చేస్తారు. వసంత పంచమి నుంచి ఫాల్గుణ పూర్ణిమ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. కనువిందు చేస్తుంది. చలి పూర్తిగా తగ్గదు. నులివెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గుణ మాసంలో అతి ముఖ్యమైంది వసంతోత్సవం. ఇది కాముని పండుగ, హోలికా పూర్ణిమ, కామ దహనం పేరుతో ప్రఖ్యాతి చెందింది. ఈ పర్వదినాన శివుడు, మన్మథుడు, కృష్ణుడు, లక్ష్మీదేవి పూజలందు కుంటారు. ఫాల్గుణ మాసంలో పూర్ణిమ రోజున హోలీ పండుగను నిర్వహిస్తుంటారు. ఈ పూర్ణిమ శక్తితో కూడినది. ఏ సంవత్సరమైనా పూర్ణిమ, ఉత్తర ఫల్గుణి కలిసి వస్తే ఆ రోజున మహాలక్ష్మిని షోడశోపచారాలతో ఆరాధించి లక్ష్మీ అష్టోత్తర శతనామాలు కనకధారా స్తోత్రాలను పారాయణం చేయడం మంచిది. హోళి రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తే సమస్త శుభములు కలుగుతాయని పెద్దలవాక్కు. కొన్ని దక్షిణాది ఆలయాలలో ఫాల్గుణ పూర్ణిమను చాలా గొప్పగా చేస్తారు.ఫాల్గుణ బహుళ పాడ్యమినాడే రావణుడితో యుద్ధానికి వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని శ్రీరాముడు లంకకు వెళ్లాడు. చవితినాడు 'సంకట గణేశ' వ్రతం ఆచరిస్తారు. బహుళ అష్టమి నాడు సీతాదేవి భూమి నుంచి ఆవిర్భవించింది. ఫాల్గుణంలో గోదానం, ధనదానం, వస్త్రదానం, గోవిందుడికి ప్రీతి కలిగిస్తాయని శాస్త్రవచనం. అందుకే ఆ రోజున రామాయణాన్ని చదివి, సీతారాముల్ని కొలుస్తారు. ఫాల్గుణ బహుళ ఏకాదశినాడు రావణ కుమారుడు ఇంద్రజిత్తు, లక్ష్మణుడు మధ్య ప్రారంభమైన సమరం త్రయోదశి దాకా కొనసాగింది. రావణ బ్రహ్మను శ్రీరాముడు అమావాస్య రోజు వధించాడు. బహుళ అమావాస్య నాడు పితృదేవతలకు పిండప్రదానం చేసి, అన్నదానం చేస్తారు.

# ట్రంప్ తీరు వల్ల దేశంలోని వ్యవసాయ, చేనేత రంగం నాశనం

**కాకినాడ:**ఆమెరికా విధానాలకు, ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు వల్ల దేశంలోని వ్యవసాయ, చేనేత రంగం నాశనం అయిపోతుందని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.కాకినాడలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు సందర్భంగా ఆయన విలేకరులతో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేసింది వాళ్లకు కోట్లాది రూపాయలను రుణాలు మాఫీ చేస్తుందన్నారు బ్యాంకులకు దారులలో 29 మంది ఉండగా వార్డుల 20 మంది గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారిని సుమారుగా వారికి 27 లక్షల కోట్ల రూపాయల రుణాలను ఎగ్గొట్టారన్నారు. వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆ రుణాలను మాఫీ చేస్తుందన్నారు. ప్రపంచానిని కుదిపి వేసిన ఎప్స్టీన్ ఫైల్స్లో మోడీ పేరు రావడంతోనే ఆయన అమెరికాకు సాగిల పడి దేశ పరువు తీసారన్నారు. కార్పొరేట్ల మేలు కోసం అటవీ చట్టాలను మార్పు చేసి అడవి సంపదను వారికి దోచిపెడుతున్నారన్నారు. ఆదివాసికి చెందిన రాష్ట్రపతితో అటవీ చట్టాన్ని మార్పు చేసి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టి నక్సల్ పేరుతో గిరిజనులను చంపేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు బీజేపీతోనే ఉన్నాయని వీరి పోరాటం రాష్ట్రంలో కూటమి, వైసీపీలుగా ఉన్నా ఢిల్లీలో మాత్రం కలిసి ఉంటున్నారని చెప్పారు. బిల్ గేట్స్ను తీసుకువచ్చి అమరావతిలో అరటి తోటలను చూపించిన సీఎం చంద్రబాబు కేంద్రంలో వ్యవసాయ రంగానికి మోసం చేస్తున్న మోడీని మాత్రం నిలువరించడంలో భయపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ భూములను కారు చౌకగా కార్పోరేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారని ఇలా కార్పోరేట్లకు ఊడిగం చేయడంలో మోడీ, బాబు పోటీ పడుతున్నారని నారాయణ ఎద్దేవా చేశారు.

# అందరి సంక్షేమం కోసమే 'ఏఐ'



గ్లోబల్ సౌత్, న్యూఢిల్లీ వేదికగా తొలిసారి జరుగుతున్న "ఇండియా - ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026" ఫిబ్రవరి 16 - 20 వరకు ఐదు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నది. "పీపుల్, ప్లానెట్, పోగ్రేస్ (ప్రజులు, భూగ్రహం, ప్రగతి" అనే మూడు సూత్రాల ఆధారంగా నిర్వహిస్తున్న ఈ ఏఐ సమ్మిట్-2026లో 30 దేశాలకు పైగా ప్రతినిధులు 700లకు పైగా ప్రతిపాదనలతో పాల్గొంటున్నారు. కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ) సాంకేతికతను పునాదిగా చేసుకొని అభివృద్ధి, పాలన, ప్రజా సేవల అమలులో మెరుగైన విధానాలు అవలంబించడానికి మార్గం సుగమం అయ్యింది. వికసిత్ భారత్-2047 లక్ష్యాలను చేరడానికి ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి పరిశోధనలు జరుగుతున్నాయి. న్యూఢిల్లీ భారత్ మండపం వేదికగా జరుగుతున్న "ఇండియా - ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026"ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, ఇండియా ఏఐ మిషన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా అనబడే సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. భారత ఆర్థిక ప్రగతి వేగాన్ని పెంచడం, మెరుగైన ఫలితాలను పాలనలో సంస్కరణలు చేయడం, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడం లాంటి లక్ష్యాల సాధనలో ఏఐ పక్రియను మరింత లాభదాయకంగా వినియోగించడానికి ఈ వేదిక మార్గాలను సూచిస్తుంది. సమ్మిట్ త్రిసూత్రాల్లో "ప్రజలు, భూగ్రహం, ప్రగతి (పీపుల్, ప్లానెట్, పోగ్రేస్)"లను నిర్ణయించుకొని చర్చలు జరుపుతున్నది. ప్రజారోగ్యం(టెలీమెడిసిన్, రోగ నిర్ధారణ, ఔషధ ఆవిష్కరణ), వ్యవసాయం -గ్రాణాభివృద్ధి, (వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ ఉత్పత్తులు పెంచడం, రైతుల ఆదాయం పెంచడం), విద్య(అనువాదాలు, 24/7 బోధనలు, అన్ని స్థాయిల విద్యార్థులకు బోధనలు), ఆర్థికం - వాణిజ్యం (ఆర్థిక భద్రత, సమ్మిళిత అభివృద్ధి, సేవల్లో దక్షత పెంచడం, బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట), పాలన - ప్రజా సేవలు(తీర్పుల అనువాదం, సేవలను అర్హులకు అందించడం, పారదర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పాలన) లాంటి రంగాల్లో ఏఐని వినియోగించి సమూల సానుకూల మార్పులు చేయడానికి అత్యాధునిక ఏఐ టెక్నాలజీ వాడనున్నారు. ప్రజల శ్రేయస్సుతో పాటు భూగ్రహంపై వెలసిన కాలుష్య మబ్బులను తొలగించడం, సమగ్ర ప్రగతికి బాటలు వెయడానికి ఏఐ సాంకేతికతను వినియోగించడం క్రమంగా పెరుగుతోంది. ఇండియా - ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదికగా మూడు సూత్రాలు (పీపుల్, ప్లానెట్, పోగ్రేస్), ఏడు చక్రాలను నిర్ణయించుకొని ముందుకు సాగుతున్నది. ఏఐ సమ్మట్‌లో చర్చించే ప్రధానమైన ఏడు చక్రాల్లో యువ భారత మానవ వనరుల అభివృద్ధి, సామాజిక సాధికారతకా సమ్మిళిత అభివృద్ధి, సురక్షిత - నమ్మకమైన ఏఐ టెక్నాలజీ, స్థితిస్థాపకత-ఇన్నోవేషన్-ఎఫిషియెన్సీ, ఏఐ సమ్మిళిత సైన్స్ వినియోగం, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తేవడం, ఆర్థిక ప్రగతి - సామాజిక శ్రేయస్సుకు ఏఐ అనే అంశాలను గుర్తించారు. ఇండియా - ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026లో ప్రధాన "గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజెస్" అంశాలుగా ఏఐ ఫర్ ఆల్(అందరికీ ఏఐ), ఏఐ ఫర్ హర్ (మహిళలకు ఏఐ), ఏఐ ఫర్ యూత్ (యువతకు ఏఐ), ఏఐ పరిశోధనలు, భారత ఏఐ పరిశోధకులు(థింక్ ట్రూనర్స్) అనబడే రంగాలను ఎన్నుకున్నారు. భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడం, మౌళిక వనరుల వృద్ధి, డాటాబేస్, సామర్థ్య అభివృద్ధి, వినూత్న ఆవిష్కరణలకు ఏఐ సాంకేతికత ఊతం ఇవ్వనున్నది. ప్రభుత్వ పారదర్శక పాలన, ప్రజా సంక్షేమ సేవల సమర్థవంతమైన అమలు, పరిశోధనలకు ప్రాధాన్యం పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకోవడానికి ఏఐ టెక్నాలజీ ఉపకరించనుందని ఆశిద్దాం.

# బెల్టుషాపులను అరికట్టాలి, ప్రజారోగ్యాలను కాపాడాలి

**ప్రతి వైన్ దుకాణాలలో అన్ని రకాల బ్రాండ్లను అందుబాటులో ఉంచాలి**


**స్థానికులు వ్యతిరేకరించిన చోట బెల్ట్ షాపులు పెట్టొద్దు**

**సిండికేట్ దోపిడీని అరికట్టి, ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరపాలి**

ఎక్సైజ్ సూపరిండెంట్ కు వినతి పత్రం అందజేసిన సామాజిక సేవకులు కర్నె బాబురావు

**భద్రాద్రి కొత్తగూడెం అశ్వాపురం:** మండలంలో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్టుషాపులు అరికట్టాలని, సిండికేట్ దోపిడీని నివారించాలని, ఎమ్మార్పీ ధరలకే మధ్య విక్రయాలను జరపాలని, సామాజిక సేవకులు కర్నె బాబురావు అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషనరీ సూపరిండెంట్ జానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ, అశ్వాపురం మండల కేంద్రంలో వైన్ షాప్ నిర్వాహకులు ప్రత్యక్షంగా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఈ షాపులు జనావాసాల మధ్య స్కూళ్లు దేవాలయాలకు దగ్గర్లో జన సమర్థం ఉన్న ప్రాంతాల్లో పెడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో మహిళలు, స్థానిక ప్రజలు వీటిని ప్రతిఘటిస్తున్నారన్నారు. కొత్తగా షాపులు పొందిన వైన్ షాప్ నిర్వాహకులు అడ్డగోలు లాభార్జన కోసం ఇప్పటికే ఇబ్బడి ముబ్బ డిగా అనధికారికంగా బెల్టుషా పులతో ఒప్పందాలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బెల్టుషాపుల వల్ల మద్యం వినియోగం పెరగడమే కాకుండా నియం త్రణలేని మద్యం అమ్మకాలు సాగుతాయని తెలిపారు. జనం అప్పుల పాలవుతున్నారని, మహిళలు వేధింపులకు గురవుతారని, అల్లరి మూకలు పెట్రేగిపోతాయని, అందువల్ల బెల్టుషాపులను ఎక్కడి కక్కడ కట్టడి చేయాలన్నారు. మండల కేంద్రంలోని వైన్ షాపుల రూటే సపరేటు అన్న చందంగా తయారైందనీ, సమయ పాలన పాటించకుండా షాపులను నిర్వహిస్తున్నారని, నౌకరినామ నిబంధనలు కూడా పాటించడం లేదన్నారు. మూడు వైన్ షాపుల నిర్వాహకులు సిండికేట్ గా మారి. మండలంలో ఉన్న గ్రామాలను షాపునకు ఏడు గ్రామాల చొప్పున లక్కీ డ్రా రూపంలో పంచుకోవడం మండల చర్చనీయాంశంగా మారిందన్నారు.

# అరటిపండ్లు లేదా ఖర్జూరా.. మార్నింగ్ తినేందుకు ఏది బెస్ట్!

మార్నింగ్ మనం తినే ఆహారం అనేది మన దే మొత్తంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. కాబట్టి మనం మార్నింగ్ తినే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఈ మధ్య కాలంలో చాలా మంది మార్నింగ్ లేచిన వెంటనే టీ, కాఫీ వంటివి తీసుకోవడం మనం గమనించవచ్చు. కానీ నిపుణులు మాత్రం ఆరోగ్యానికి అనుకూలంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో అరటి పండు, ఖర్జూరం రెండూ ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తాయని చెబుతున్నారు. సరైన ఆహారంతో మన దేను ప్రారంభించడం వల్ల మన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఇది మన మొత్తం ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. ముఖ్యం మార్నింగ్ పండ్లను తినడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రతి పండు ప్రత్యేకమైనదే.. వీటిని ఖాళీ కడుపుతో తిన్నప్పుడు ఒక్కోటి ఒక్కోరకమైన ప్రయోజనాలను అందిస్తాయి. సాధారణంగా జనాలు ఎక్కవుగా తీసుకునే అరటి పండు, లేదా ఖర్జూరా పండ్ల విషయానికి వస్తే ఈ రెండు కూడా వేర్వేరు పోషక ప్రొఫైల్‌లను అందిస్తాయి. కాబట్టి ఏ పండు వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి, మార్నింగ్ తినేందుకు రెండింటిలో ఏద ఉత్తమమైనదో చూద్దాం.

అరటిపండ్లలో పొటాషియం, మెగ్నీషియం, సహజ చక్కెరలు పుష్కలంగా ఉంటాయి. ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. అయితే, ఖాళీ కడుపుతో అరటిపండ్లు తినడం ప్రయోజనకరంగా ఉండకపోవచ్చు. దీనిలో పొటాషియం పుష్కలంగా ఉండటం వల్ల అవి గుండె, కండరాల పనితీరుకు ప్రయోజనకరంగా ఉంటాయి, ఇది చాలా మందికి సులభంగా జీర్ణం అవుతుంది. అయితే దీన్ని తినడం వల్ల కూడా కొన్ని దుష్ప్రభావాలు ఉంటాయి. ఇది శరీంలోని మెగ్నీషియం సమతుల్యతను దెబ్బతీయ వచ్చు.అలాగే సహజ చక్కెరలు శక్తిలో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతాయి, ఆ తర్వాత అకస్మాత్తుగా తగ్గుతాయి. సున్నితమైన వ్యక్తులలో, ఇది ఆమ్లత్వం లేదా ఉబ్బరాన్ని కలిగిస్తుంది. కాబట్టి ఇది అందరికి ఒకే రకమైన ప్రయోజనాలను అందించలేదు.

ఖర్జూరాలు ఖాళీ కడుపుతో తినడానికి అత్యంత ప్రయోజనకరమైన పండ్లలో ఒకటిగా పరిగణించబడతాయి, ముఖ్యంగా సాంప్రదాయ, ఆయుర్వేద పద్ధతులలో వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వీటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది, అలాగే మలబద్ధకాన్ని నివారిస్తుంది. అలాగే ఆమ్లత ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఖర్జూరాలు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, జీవక్రియను పెంచుతాయి. వాటిలో ఇనుము, యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి, ఇవి ఉదయం అలసట లేదా శక్తి లేకపోవడం అనుభవించే వారికి ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2-3 ఖర్జూర పండ్లను రాత్రిపూట నీటిలో నానబెట్టి ఉదయం తినడం వల్ల జీర్ణక్రియ బాగా జరిగి పోషకాలు గ్రహించబడతాయి. చాలా మందికి, ఖాళీ కడుపుతో ఖర్జూరాలు తినడం ఆరోగ్యకరమైన ఎంపిక కావచ్చు. ఎందుకంటే అవి జీర్ణక్రియకు సహాయపడతాయి అలాగే దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు పోషకమైనవి, కానీ జీర్ణ సమస్యలను నివారించడానికి వాటిని తరువాత లేదా ఇతర ఆహారాలతో కలిపి తినడం మంచిది. అయితే, మధుమేహ వ్యాధిగ్రస్తులు తాము తీసుకునే పండ్లు, కూరగాయల పరిమాణాన్ని పర్యవేక్షించాలి. ఆమ్లత్వం లేదా ఉబ్బరం ఉన్నవారు అరటిపండ్ల కంటే ఖర్జూరం జీర్ణం కావడానికి సులభం అని భావిస్తారు. అరటిపండ్లు, ఖర్జూరాలు రెండూ ఆరోగ్యకరమైన పండ్లు, కానీ వాటిని తీసుకునే సమయం వేటితో కలిపి తింటున్నామనేది ముఖ్యం. ఖర్జూరాలు సాధారణంగా ఖాళీ కడుపుతో తింటే పోషకమైనవి, కానీ ఉదయం అరటిపండ్లను ఇతర ఆహారలో పార్టు తీసుకోవడం ఉత్తమం.

# ఈ గింజలు వదలకుండా తినేయండి..!



జాక్ ఫ్రూట్ గింజలు ఫైబర్ తో సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగి ఉంటారు. అతిగా తినకుండా ఉండటానికి సహాయపడుతుంది. పనస గింజల్లో ఇనుము పుష్కలంగా ఉంటుంది. ఇది మన శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఏర్పాటుకు కూడా సహాయపడుతుంది. దీన్ని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తహీనతను నివారించవచ్చు. పనస గింజలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది కాబట్టి, తరచుగా మలబద్ధకంతో బాధపడేవారు వీటిని తినాలి. అలాగే, జీర్ణ సమస్యలు ఉన్న వారికి కూడా పనస గింజలు ఎంతో మంచిదని చెబుతున్నారు. పనస గింజలను పొడి చేసుకుని తీసుకుంటే జీర్ణ సమస్యలు ముఖ్యంగా గ్యాస్, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయని సూచిస్తున్నారు. అలాగే, విటమిన్ ఎ పనస గింజల్లో పుష్కలంగా లభ్యమవుతుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ముఖ్యమైన పోషకాలలో ఒకటన్న సంగతి తెలిసిందే. కాబట్టి, పనస గింజలను ఉడకబెట్టి లేదా వేరే విధంగా కూడా తీసుకోవచ్చు. దాంతో కంటి ఆరోగ్యం పెరుగుపడుతుంది. అదేవిధంగా పనస గింజల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకులను, దంతాలను దృఢంగా మారుస్తాయి. గుండె పోటు, ఇతర గుండె జబ్బులు రాకుండా రక్షిస్తాయి. జాక్‌ఫ్రూట్ గింజలు తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మీరు పనస గింజలను వేయించి తినవచ్చు. వాటిని ఒక పాన్ మీద 15-20 నిమిషాలు వేయించాలి. అవి కొద్దిగా గోధుమ రంగులోకి మారిన తర్వాత, వాటిపై కొంచెం నల్ల ఉప్పు, చాట్ మసాలా చల్లి తినండి. పనస గింజలను ఎండలో ఎండబెట్టి పొడి చేసి, సలాడ్లు లేదా పండ్లపై చల్లి తినవచ్చు. మీకు ఇష్టమైన పండ్లతో పాటు పనస గింజల సహాయంతో మీరు స్మూతీలను కూడా తయారు చేసుకోవచ్చు.

# రోజంతా గోరువెచ్చని నీరు తాగితే ఏమవుతుంది?



మన శరీరంలో 70 శాతం నీరే ఉంటుంది. అయితే ఆధునిక జీవనశైలిలో మనం రకరకాల డ్రింక్స్‌కు అలవాటు పడి, ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన నీటిని ఎలా తాగాలో మర్చిపోతున్నాం. ముఖ్యంగా ఉదయాన్నే నిద్రలేవగానే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి ప్రయోజనాలు ఉన్నాయా..?ఇది అందరికీ మంచిదేనా? నీరు శరీర దాహాన్ని తీర్చడమే కాకుండా రక్తంలో కలిసిపోయి ప్రతి కణానికి ఆక్సిజన్‌ను సరఫరా చేసే జీవనాధారం. మానవ శరీరం 70 శాతం నీటితోనే నిర్మితమై ఉంటుంది. అయితే ఏ రకమైన నీరు ఎప్పుడు తాగాలి అనే విషయంలో చాలామందికి స్పష్టత ఉండదు. మన పూర్వీకుల నుండి వస్తున్న ఉదయం గోరువెచ్చని నీరు తాగే అలవాటు కేవలం సంప్రదాయం మాత్రమే కాదు అదొక అద్భుతమైన ఆరోగ్య ప్రక్రియ అని ఆయుర్వేదం చెబుతోంది.ఆయుర్వేద శాస్త్రం ప్రకారం.. ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణ అగ్ని యాక్టివేట్ అవుతుంది. ఇది శరీరంలోని కఫ దోషాన్ని సమతుల్యం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.జీర్ణక్రియ మెరుగు: తిన్న ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం సమస్యను వదిలించడానికి ఇది చక్కటి పరిష్కారం.టాక్సిన్స్ తొలగింపు: శరీరం లోపల పేరుకుపోయిన హానికరమైన విష పదార్థాలను బయటకు పంపి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.బరువు తగ్గడం: క్రమం తప్పకుండా వేడి నీటిని తాగడం వల్ల శరీరంలో మెటబాలిజం రేటు పెరిగి, కొవ్వు కరగడానికి సహాయపడుతుంది.శ్వాసకోశ సమస్యలకు చెక్: గొంతులో పేరుకుపోయిన కఫాన్ని వదులు చేసి, దగ్గు, జలుబు నుండి ఉపశమనాన్ని ఇస్తుంది.ఉదయం ఖాళీ కడుపుతో: బాడీని రీఛార్జ్ చేయడానికి, జీర్ణక్రియను వేగవంతం చేయడానికి ఇది బెస్ట్ టైమ్.భోజనానికి 30 నిమిషాల ముందు: ఇది ఆకలిని నియంత్రించి, బరువు తగ్గాలనుకునే వారికి ఉపయోగపడుతుంది.భోజనం చేసిన గంట తర్వాత: తిన్న ఆహారం మెత్తగా మారి, పోషకాలు ఒంటికి పట్టడానికి ఇది సహాయపడుతుంది.గోరువెచ్చని నీరు ఆరోగ్యానికి మంచిదే అయినా, ఈ కింది సందర్భాల్లో తాగడం ప్రమాదకరమని ఆయుర్వేదం హెచ్చరిస్తోంది..తీవ్రమైన వేసవిలో: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరిగి అసౌకర్యం కలుగుతుంది.పిత్త సమస్యలు ఉన్నప్పుడు: కడుపులో మంట లేదా అసిడిటీతో బాధపడేవారు వేడి నీటికి దూరంగా ఉండాలి. అధిక దాహం: విపరీతమైన డీహైడ్రేషన్ ఉన్నప్పుడు గోరువెచ్చని నీరు తాగితే శరీరంలోని తేమ మరింత తగ్గే అవకాశం ఉంది.

# రోగాలను నయం చేసే శక్తి దీనికి ఉంది!



అతిబల మొక్క, భారతీయ సంప్రదాయ వైద్యంలో శతాబ్దాలుగా ఉపయోగించబడుతోంది. ఇది యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలతో జ్వరం, దగ్గు, కీళ్లనొప్పులు, కిడ్నీలో రాళ్లు, మూత్రనాళ వ్యాధులు, నడుము నొప్పి వంటి 100కు పైగా రోగాలను నయం చేయగలదని ఆయుర్వేదం చెబుతుంది. మన చుట్టూ ఉండే ఎన్నో మొక్కలు అలివికాని మొండి రోగాలను సైతం నయం చేయగలవని చాలామందికి తెలియదు. అలాంటి అద్భుత ఔషధ గుణాలు కలిగిన మొక్కల్లో అతిబల ఒకటి. దీనిని దువ్వెన బెండ, ముద్ర బెండ, తుత్తురు బెండ అని కూడా పిలుస్తారు. ఈ మొక్క మాల్వేసి కుటుంబానికి చెందినది. రోడ్ల పక్కన, పొలాల కంచెల వెంట విస్తారంగా కనిపించే ఈ మొక్కలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలు చాలామందికి తెలియదు. అతిబల మొక్క యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ ధర్మాలను కలిగి ఉంటుంది. భారతీయ సంప్రదాయ వైద్యంలో, ముఖ్యంగా తమిళ సిద్ధ వైద్యంలో, భారతీయ ఆయుర్వేదంలో దీనిలోని ప్రతి భాగాన్ని వివిధ వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తారు. ఈ మొక్క జ్వరం, దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రనాళ వ్యాధులు, కిడ్నీలో రాళ్లు కరిగించడానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కీళ్లనొప్పి లేదా కీళ్లవాతం ఉన్నప్పుడు అతిబల ఆకుల పేస్ట్‌కు ఆవాల నూనె కలిపి రాయడం వల్ల ఉపశమనం లభిస్తుంది. రక్త మొలలు ఉన్నవారు ఆకులను ఉడికించి తింటే తగ్గుతాయని చెబుతారు. ఆడవారిలో యోని ఇన్ఫెక్షన్లు ఉంటే, దీని ఆకుల డికాక్షన్‌తో శుభ్రం చేసుకోవచ్చు. చర్మంపై వాపులు, గాయాలు, పుండ్లు ఉన్నప్పుడు అతిబల ఆకులను పసుపుతో కలిపి పేస్ట్‌గా చేసి రాయడం వల్ల త్వరగా నయం అవుతాయి, ఎందుకంటే ఆకులకు యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉన్నాయి. మూత్రంలో మంట, మూత్రాశయంలో రాళ్లు ఉన్నవారు అతిబల ఆకులను నీటిలో మరిగించి తేనె కలిపి త్రాగడం వల్ల రాళ్లు కరిగి, మంట తగ్గుతుంది. అతిసారం ఉన్నవారికి దీని విత్తనాల పొడితో చేసిన టీ ఔషధంలా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుపరచడానికి అతిబల ఆకుల డికాక్షన్‌తో కళ్ళు కడుక్కుంటే మంచిది. ఊపిరితిత్తుల వ్యాధులు, క్షయ, శ్వాసనాళ వాపులకు దీని మొత్తం మొక్క భాగాన్ని (పూలు, కాండం, ఆకులు, కాయలు, వేర్లు) ఉపయోగించి కషాయం కాచి తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. జ్వరం తగ్గడానికి అతిబల ఆకులను నానబెట్టి, ఆ నీటికి పటికబెల్లం కలిపి త్రాగుతారు. దంతాల ఆరోగ్యం కోసం దీని ఆకుల రసాన్ని నోటిలో ఉంచుకొని ఊసేయడం, డికాక్షన్‌తో పుక్కిలించడం వల్ల దంతాలు గట్టిపడి పంటినొప్పి తగ్గుతుంది. నడుము నొప్పి తగ్గడానికి అతిబల ఆకుల కషాయం త్రాగాలి. గౌట్, క్షయ, నోటిపూత, పేగుపూత, రక్తస్రావాలకు కూడా దీని డికాక్షన్ ఉపయోగిస్తారు. శరీరానికి బలం రావాలంటే, అతిబల మొక్క వేరును ఆవుపాలతో మరిగించి పటికబెల్లం కలిపి తీసుకోవాలని ఆయుర్వేద గ్రంథాలు సూచిస్తున్నాయి. మూత్రంలో రక్తం పడటం, మూత్రనాళంలో మంట తగ్గడానికి దీని ఆకుల రసాన్ని తేనెతో కలిపి తీసుకుంటారు. అతిబల ఆకుల రసాన్ని చక్కెరతో కలిపి త్రాగితే గుండె ఆరోగ్యానికి మంచిది. మగవారిలో శీఘ్రస్కలనం సమస్యకు, యూరినరీ ఇన్ఫెక్షన్లకు దీని వేరు కషాయం ఔషధంగా పనిచేస్తుంది. అతిబల మొక్క రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గించి షుగర్ వ్యాధిగ్రస్తులకు మేలు చేస్తుంది. ఈ మొక్క ఆకులు రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

# బిజినెస్

## ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయి



పూర్తిస్థాయిలో ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. మనదేశంలో గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగానికి కొన్ని గంటల ముందు శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. భారత్‌కు ఉన్నటెక్నాలజీ ప్రతిభ, జాతీయ వ్యూహం, టెక్నాలజీ సామర్థ్యంపై నమ్మకం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారత్ స్వదేశీ నైపుణ్యం ద్వారా ఏఐలో సరైన స్థాయిలో అమలు చేసేందుకు విధానపరమైన ప్రోత్సాహం కలిగి ఉంది. ముఖ్యంగా భారత ప్రభుత్వం ఇండియాఏఐ మిషన్ లక్షలాది మందికి అవసరమైన సాధనంగా మారుతోంది. కంప్యూటర్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు, స్టార్టప్‌లకు మద్దతిచ్చేందుకు, హెల్త్‌కేర్, వ్యవసాయం, పబ్లిక్ సర్వీసెస్‌లో యాప్‌లను రూపొందించడంలో విజయవంతమైందని శామ్ ఆల్ట్‌మన్ వివరించారు. ఏఐ టూల్స్‌ను వేగంగా ఉపయోగించడంలో 10 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లతో అమెరికా తర్వాత రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో భారత్ పూర్తిస్థాయి ఏఐ లీడర్‌గా ఉండటానికి అన్ని అర్హతలను కలిగి ఉంది. ఏఐ ప్రయోజనాలను విస్తరించేందుకు యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీపై పురోగతి అవసరమని శామ్ ఆల్ట్‌మన్ వెల్లడించారు.

## ఈ ఏడాది పీఎస్‌బీల లాభాలు రూ. 2 లక్షల కోట్లకు పైనే




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు(పీఎస్‌బీ) రూ. 2 లక్షల కోట్లకు పైగా రికార్డు లాభాలను సాధిస్తాయని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు విశ్వాసం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగ ఆర్థికంగా బలపడుతోందని, స్థిరమైన లాభాలను చూస్తున్నాయని ఆయన తెలిపారు. పీటీఐతో జరిగిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తున్నాయి, డిపాజిట్లు అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యం బలంగా ఉండటాన్ని సూచిస్తుంది. ఈ ఏడాది పీఎస్‌బీలో క్రెడిట్ వృద్ధి దాదాపు 12 శాతం వద్ద ఉంది. ఇదే సమయంలో డిపాజిట్ల వృద్ధి దాదాపు 10 శాతం ఉందని నాగరాజు వివరించారు. ఈ నేపథ్యంలో పీఎస్‌బీలు చారిత్రాత్మక లాభాలను చూడనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలోనే దాదాపు రూ. లక్ష కోట్లను చేరుకున్నాయి. మిగిలిన సగంలో రూ. 2 లక్షల కోట్లను దాటడం సులభమేనని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లలో బ్యాంకింగ్ రంగం ఆదాయం భారీగా పెరిగింది. 2022-23లో పీఎస్‌బీలు రూ. లక్షల కోట్లకు పైగా లాభాలను చూశాయి. 2023-24లో రూ. 1.41 లక్షల కోట్లను, 2024-25లో రూ. 1.78 లక్షల కోట్ల లాభాలను నమోదు చేశాయని ఎం నాగరాజు పేర్కొన్నారు.

# అందరూ వాట్సాప్ స్పామ్ బాధితులే




వాట్సాప్‌లో స్పామ్ మెసేజ్‌లు, కాల్స్ బెడద ఎక్కువైపోయాయి. దీనిపై చాలామంది నుంచి ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. ముఖ్యంగా అంతర్జాతీయ నెంబర్లతో వచ్చే కాల్స్ మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇలాంటి స్పామ్ మేసేజ్‌లు, కాల్స్‌ను ఆసరాగా తీసుకుని సైబర్ మోసగాళ్లు కూడా రకరకాల స్కామ్‌లతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. పెరుగుతున్న డిజిటల్ వినియోగానికి తగినట్టుగా ఈ స్పామ్ కాల్స్, మేసేజ్‌లు పట్టణాలకే పరిమితం కాలేదు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి వాట్సాప్ యూజర్ ప్రతిరోజూ ఏదొక స్పామ్, ప్రమోషనల్ వాట్సాప్ మెసేజ్‌లను ఎదుర్కొంటున్నారు. ప్రముఖ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన తాజా సర్వేలో మరిన్ని వివరాలు బహిర్గతం అయ్యాయి. దాదాపు 96 శాతం వాట్సాప్ యూజర్లు ప్రతిరోజూ ఈ స్పామ్ మెసేజ్, కాల్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల కస్టమర్ల ప్రైవసీ, డేటా దుర్వినియోగం, స్పామ్‌ల తనిఖీలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాట్సాప్‌లో ప్రతిరోజూ రకరకాల ప్రమోషనల్, స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని యూజర్లు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా 324 జిల్లాల్లోని వాట్సాప్ యూజర్ల నుంచి లోకల్ సర్కిల్స్ వివరాలను సేకరించగా, కేవలం 4 శాతం మంది మాత్రమే తమకు అటువంటి మెసేజ్‌లు రావట్లేదన్నారు. సగం మందికి(54 శాతం) పైగా యూజర్లు రోజుకు మూడు సార్లు స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని, 30 శాతం మంది 4-7 స్పామ్ మెసేజ్‌లను, 11 శాతం మంది 8, అంతకంటే ఎక్కువ మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పారు. ఈ మెసేజ్‌లలో ఎక్కువగా బిజినెస్ అకౌంట్ల నుంచి వస్తున్నాయని, స్పామ్ మెసేజ్‌లు పంపేవారు వాట్సాప్ ప్లాట్‌ఫామ్‌కు డబ్బు చెల్లిస్తున్నారని యూజర్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న స్పామ్‌లు మూడేళ్ల నాటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయని లోకల్ సర్కిల్స్ నివేదిక అభిప్రాయపడింది. గత 36 నెలల్లో స్పామ్‌ల సమస్య మరింత తీవ్రమైందని డేటా చెబుతోంది. రోజుకు ఒకటి నుంచి మూడు స్పామ్ మెసేజ్‌లను ఎదుర్కొనే యూజర్ల సంఖ్య తగ్గినప్పటికీ, 4-7 మెసేజ్‌లు, 8 లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లను చూసే యూజర్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రతిరోజూ 8 లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లు చూసే వారు 2023లో 11 శాతం ఉండగా, ఇప్పుడు 19 శాతానికి పెరిగారు.

## రూపాయికి ముడి చమురు సెగ!



అమెరికా ఒత్తిడితో రష్యాయేతర చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ద్వారా రూపాయి మరింత బలహీనపడనుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఖరీదైన రష్యాయేతర ముడి చమురు కొనుగోలు కారణంగా 2026 నాటికి డాలర్‌తో రూపాయి విలువ 93కి పడిపోవచ్చని విశ్లేషించింది. గతేడాది కాలంలో డాలర్‌తో రూపాయి 5 శాతం పతనమై 92 మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే. "గతేడాది డాలర్‌తో పోలిస్తే 5 శాతం క్షీణించిన రూపాయి ఇటీవల యుఎస్- ఇండియా వాణిజ్య ఒప్పందం వల్ల ప్రస్తుతం రూ.90.4 వద్ద నమోదవుతోంది. మేము గతంలో డాలర్‌తో రూపాయి విలువ 95కి చేరుతుందని అంచనా వేయగా.. ఇప్పుడు 2026 చివరి నాటికి రూపాయి మరింత నెమ్మదిగా క్షీణించి సుమారు 93 వద్ద ట్రేడ్ కావొచ్చని భావిస్తు న్నాము. మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడం, వాణిజ్య ఒప్పందం ప్రకారం ఖరీదైన రష్యాయేతర ముడి చమురు వైపు మళ్లడం ఈ క్షీణతకు కారణ మవుతాయి." అని ఫిచ్ తన నివేదికలో పేర్కొంది. అమెరికా వడ్డీ రేట్ల తగ్గింపు ఆసియా కరెన్సీలకు మద్దతునిస్తుందని.. అయితే దేశీయ స్థిరత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఫిచ్ తెలిపింది. 'బలహీనమైన యుఎస్ డాలర్ నేపథ్యం ఎంపిక చేసిన కరెన్సీలకు మద్దతు ఇస్తుంది.. కానీ లాభాలు అసమానంగా ఉంటాయి. బలమైన కరెంట్ ఖాతాలు, ఆర్థిక లోటు, వాణిజ్య క్షీణత లేదా జోక్యం ఎక్కువగా ఉండే దేశాల కరెన్సీలు తమ విలువను నిలబెట్టుకోవడంలో ఇబ్బంది పడతాయి." అని ఫిచ్ తెలిపింది.

## దేశీయంగా మొట్టమొదటి స్టోర్ ప్రారంభించిన నథింగ్ ఇండియా




ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, టెక్ గ్యాడ్జెట్‌లకు భారత మార్కెట్ అత్యంత అనువైన కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే భారత్ మార్కెట్లో రిటైల్ స్టోర్ల ఏర్పాటుతో ఎంట్రీ ఇచ్చిన యాపిల్ రికార్డు స్థాయిలో అమ్మకాలను సాధిస్తోంది. ఈ క్రమంలో మరో గ్లోబల్ కంపెనీ, బ్రిటీష్ బ్రాండ్ నథింగ్ దేశీయంగా తన మొట్టమొదటి ఫ్లాగ్‌షిప్ రిటైల్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బెంగళూరులో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ ప్రారంభానికి నథింగ్ సీఈఓ కార్ల్ పీ, కో-ఫౌండర్, నథింగ్ ఇండియా ప్రెసిడెంట్ అకిల్ ఎవాంజెలిడిస్ హాజరయ్యారు. ఈ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ద్వారా కంపెనీ భారత మార్కెట్లో తన బ్రాండ్ కింద ఉన్న స్మార్ట్‌ఫోన్, దుస్తులు సహా ఇతర ఉత్పత్తులను విక్రయించనుంది. దేశీయంగా కంపెనీ విస్తరణకు ఈ స్టోర్ కీలక మైలురాయిగా నిలుస్తుందని కంపెనీ అభిప్రాయపడింది. ఇప్పటికే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తమ బ్రాండ్‌కు స్థానిక కమ్యూనిటీ సంబంధాలు మరింత బలపడేందుకు ఈ స్టోర్ సహకారం అందిస్తుందని అభిప్రాయపడింది. బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉన్న ఈ స్టోర్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు అందుబాటులో ఉంటుందని నథింగ్ ఇండియా స్పష్టం చేసింది. ఇప్పటివరకు నథింగ్ కంపెనీ లండన్‌లో మాత్రమే స్టోర్‌ను నిర్వహిస్తోంది. దీని తర్వాత భారత్‌లో మాత్రమే రెండో స్టోర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ స్టోర్‌లో నథింగ్ స్మార్ట్‌ఫోన్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, ట్రూ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, ఇతర స్మార్ట్ పరికరాలను కస్టమర్లు స్వయంగా సందర్శించి కొనుగోలు చేయవచ్చని కంపెనీ వెల్లడించింది.

# న్యూజిలాండ్‌కు కొత్త కెప్టెన్




న్యూజిలాండ్ మహిళల క్రికెట్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. స్టార్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్ ఆ జట్టు నూతన ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా నియమించబడింది. సోఫీ డివైన్ గతేడాది వన్డే ప్రపంచకప్ తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పుకున్న నేపథ్యంలో కెర్ న్యూజిలాండ్ సారథిగా బాధ్యతలు చేపట్టింది. 25 ఏళ్ల కెర్ 2016లో 16 ఏళ్ల వయసులో అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. కుడి చేతి వాటం బ్యాటర్, లెగ్ స్పిన్నర్ అయిన కెర్.. ఇప్పటివరకు 84 వన్డేలు, 88 టీ20లు ఆడింది. వన్డేల్లో 4 సెంచరీలు, 10 హాఫ్ సెంచరీల సాయంతో 2304 పరుగులు చేసింది. ఇందులో ఓ డబుల్ సెంచరీ కూడా (232బి) ఉంది. అలాగే బౌలింగ్‌లో ఓ ఐదు వికెట్ల ప్రదర్శన సహా 106 వికెట్లు తీసింది. టీ20ల్లో 100కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో, 5 హాఫ్ సెంచరీల సాయంతో 1453 పరుగులు చేసిన కెర్.. బౌలింగ్‌లో 2 నాలుగు వికెట్ల ప్రదర్శనల సాయంతో 95 వికెట్లు తీసింది. కెర్ 2024 టీ20 ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ అవార్డు గెలుచుకుంది. అదే ఏడాది ఐసీసీ మహిళల ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కూడా గెలుచుకొని, ఈ ఘనత సాధించిన తొలి న్యూజిలాండ్ ప్లేయర్ అయ్యింది. కెర్ న్యూజిలాండ్ ఆల్ ఫార్మాట్ కెప్టెన్‌గా ఎంపికైన తర్వాత భావోద్వేగానికి లోనైంది. న్యూజిలాండ్ తరఫున ఆడటం నా చిన్ననాటి కల. ఇప్పుడు కెప్టెన్‌గా అవకాశం రావడం గొప్ప గౌరవమని పేర్కొంది. ఈ జట్టులో ఉన్న ప్రతిభ, కృషి, అంకితభావం నన్ను ఉత్సాహపరుస్తున్నాయి. మనం కలిసి గొప్ప విజయాలు సాధించగలమని నమ్ముతున్నాను అంటూ కెర్ సోషల్‌మీడియాలో ఓ సందేశాన్ని పోస్ట్ చేసింది. కెర్ ఎంపికపై ఆ జట్టు హెడ్ కోచ్ బెన్ సాయర్ హర్షం వ్యక్తం చేశారు. కెర్ జట్టులో గౌరవం పొందిన నాయకురాలు. ఆమె నాయకత్వం న్యూజిలాండ్ మహిళల క్రికెట్ భవిష్యత్తుకు స్థిరత్వం, నిరంతరతను ఇస్తుందని అన్నారు. కెర్ తన కెప్టెన్సీ కెరీర్‌ను జింబాబ్వేతో జరిగే హోమ్ సిరీస్‌తో ప్రారంభించనుంది. ఫిబ్రవరి 25న సెడ్డన్ పార్క్‌లో జరిగే మొదటి టీ20 ఈ సిరీస్ మొదలవుతుంది.

కెర్ ముందున్న సవాళ్లు

- 2026లో ఇంగ్లండ్‌లో ౨20 ప్రపంచకప్ నిలబెట్టుకోవడం.
- 2027లో శ్రీలంకలో ×జజ ౨20 ఛాంపియన్స్ ట్రోఫీ.
- 2028లో లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్, ౨20 ప్రపంచకప్.

# స్పోర్ట్స్

## సూపర్ 8లోకి ఇంగ్లండ్.. ఇటలీపై 24 రన్స్ తేడాతో గెలుపు




**కోల్‌కతా:** టీ20 వరల్డ్‌కప్‌లో ఇవాళ ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 24 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో ఆ జట్టు గ్రూపు సీ నుంచి సూపర్ 8లోకి వెళ్లింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 202 రన్స్ స్కోరు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇటలీ 178 రన్స్ చేసి ఆలౌటైంది. ఇటలీ ప్లేయర్ బెన్ మానెంటి 25 బంతుల్లో 60 రన్స్ చేసి కాసేపు దడపుట్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. జస్టిస్ మోస్కా 34 బంతుల్లో 43 రన్స్, గ్రాంట్ స్టీవార్ట్ 23 బంతుల్లో 45 రన్స్ చేశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ శరవేగంగా హాఫ్ సెంచరీ కొట్టాడు. కేవలం 22 బంతుల్లో అతను 53 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 4 సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. ఇంగ్లండ్ బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ 28, జాకబ్ బేతల్ 23, టామ్ బాంటన్ 30 రన్స్ స్కోరు చేశారు.

## భారత్ చేతిలో ఓడినా.. చరిత్ర సృష్టించిన పాక్




టీమిండియా చేతిలో ఓడినా పాకిస్తాన్ సరికొత్త చరిత్ర సృష్టించింది. టీ20 ప్రపంచకప్ టోర్నీలో రెండుసార్లు 18 ఓవర్లపాటు స్పిన్ బౌలింగ్‌నే ప్రయోగించిన తొలి జట్టుగా నిలిచింది. టీ20 వరల్డ్‌కప్-2026 టోర్నీలో భాగంగా కొలంబో వేదికగా పాకిస్తాన్ ఆదివారం టీమిండియాతో తలపడిన విషయం తెలిసిందే. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న పాక్.. తమ స్పిన్ దళంపైనే ఎక్కువగా ఆధారపడింది. స్పెషలిస్టు స్పిన్నర్లలో ఉస్మాన్ తారిఖ్ నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసి 24 రన్స్ ఇచ్చి ఒక వికెట్ తీయగా.. అబ్రార్ అహ్మద్ మూడు ఓవర్లు వేసి 38 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక బ్యాటింగ్ ఆల్‌రౌండర్లు సల్మాన్ అఘా రెండు ఓవర్లు వేసి 10 పరుగులిచ్చి ఒక వికెట్ తీయగా.. నాలుగు ఓవర్ల కోటాలో సయీమ్ అయుబ్ మూడు వికెట్లతో సత్తా చాటాడు. మరోవైపు షాదాబ్ ఖాన్ ఒక ఓవర్ వేసి 17 రన్స్, మొహమ్మద్ నవాజ్ 4 ఓవర్లలో 28 రన్స్ ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. ఇలా నిర్ణీత 20 ఓవర్లలో 18 ఓవర్లు పాక్ స్పిన్నర్లే వేయగా.. ఏకైక పేసర్ షాహిన్ అఫ్రిది రెండు ఓవర్లు వేసి ఏకంగా 31 పరుగులు సమర్పించుకుని ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. కాగా పాక్ ఇలా స్పిన్ దళాన్నే నమ్ముకోవడం ఇదే తొలిసారి కాదు. 2012 టీ20 వరల్డ్‌కప్ టోర్నీలో ఆస్ట్రేలియా మీద కూడా ఇదే తరహాలో ఇదే వేదికపై స్పిన్ అస్త్రాన్ని ప్రయోగించింది పాక్.

తద్వారా పొట్టి వరల్డ్‌కప్ ఈవెంట్లో అత్యధికంగా రెండుసార్లు 18 ఓవర్లు స్పిన్ వేయించిన తొలి జట్టు పాకిస్తాన్ నిలిచింది. కాగా కొలంబో పిచ్ స్పిన్‌కు అనుకూలం అన్న సంగతి తెలిసిందే. ఇక భారత్‌తో మ్యాచ్‌లో పాక్ 61 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పాక్ ప్రధానంగా స్పిన్‌ను నమ్ముకుంటే.. టీమిండియా పేసర్లకు కూడా ప్రాధాన్యం ఇచ్చింది. భారత పేసర్లలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మూడు ఓవర్లు వేసి కేవలం 16 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా రెండు ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. ఇక స్పిన్నర్లలో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ నాలుగు ఓవర్లు వేసి రెండు వికెట్లు తీయగా.. వరుణ్ చక్రవర్తి మూడు ఓవర్లలోనే రెండు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ మూడు ఓవర్లు వేసి ఒక వికెట్ పడగొట్టగా.. పార్ట్‌టైమ్ స్పిన్నర్లు తిలక్ వర్మ రెండు ఓవర్లు వేసి ఒక వికెట్ తీయగా.. రింకూ సింగ్ ఒక ఓవర్లో 9 పరుగులు సమర్పించుకున్నాడు.



# 24 గంటలు కనిపించడం ఇష్టం లేదు

కొంతమంది సెలబ్రిటీలు ఎప్పుడూ వార్తల్లో ఉండాలనుకుంటారు. ఏదో ఒకరకంగా తమ గురించే మాట్లాడుకోవాలని, అందరి నోళ్లలో నానుతూ ఉండాలని తహతహలాడతారు.అలా పబ్లిసిటీ కోసం పీఆర్ టీమ్‌లను పెట్టుకుంటారు. కానీ తనకు అలాంటివేవీ ఇష్టం లేదని, పీఆర్ టీమ్ అసలే లేదని చెప్తోంది హీరోయిన్ శోభిత ధూళిపాళ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శోభిత మాట్లాడుతూ.. గతంలో నేను పీఆర్ ఏజెన్సీలతో పని చేశాను. కానీ, నా వ్యక్తిత్వానికి ఆ పద్ధతులు సెట్ అవవు అని అర్థమైంది. 24 గంటలు అందరికీ కనిపించాలి, అందరూ నాకోసం మాట్లాడుకోవాలి అని నేను అనుకోవడం లేదు. అది నాకు ఏమాత్రం ఉపయోగపడదు, దానిపై నాకు ఆసక్తి అసలే లేదు. నాకు పీఆర్ లేదు, కానీ కొందరికి అది బానే పని చేస్తుంది. నేను సినీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి రాలేదు, నాది ముంబై కూడా కాదు. వైజాగ్ నుంచి వచ్చి ఇండస్ట్రీలో అడుగుపెట్టిన నేను ఒక్కొక్కటిగా నేర్చుకుంటూ ముందుకు సాగాను. నాకు ఏం కావాలి? ఏం వద్దనే విషయాలపై క్లారిటీ ఉంది. రూల్స్‌తో సంబంధం లేకుండా నా దారిలో వెళ్లడమే నాకిష్టం. జనాలకు ఏదిష్టం, వాళ్లేం కోరుకుంటున్నారు? అనేది నాకు తెలియదు. కానీ నా గురించి నాకు బాగా తెలుసు అని చెప్పుకొచ్చింది. శోభిత ధూళిపాళ తెలుగమ్మాయే అయినప్పటికీ బాలీవుడ్‌లో ఎక్కువ పాపులర్ అయింది. గూఢచారి, మేజర్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు సైతం దగ్గరైంది. ఇటీవలే చీకటిలో సినిమాతో మరోసారి అలరించింది



## ఆ వీడియో నా జీవితాన్నే మార్చేసింది

సినిమా ఇండస్ట్రీలోకి కొంతమంది కుటుంబ అంగీకారంతో వస్తే, మరి కొంతమంది మాత్రం సినిమాపై ప్యాషన్ ఉండి, కుటుంబం దానిని వ్యతిరేకించిన వారి నుండి దూరమై పరిశ్రమలోకి వస్తుంటారు.కుటుంబానికి ఇష్టం లేకపోయినా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి ప్రస్తుతం తనకంటూ ఒక గుర్తింపు ఏర్పరచుకున్న ముద్దుగుమ్మలలో ఇనయా సుల్తానా ఒకరు. ఈ బ్యూటీ తెలుగు బిగ్ బాస్ కార్యక్రమంలో పార్టిసిపేట్ చేసింది. దీని ద్వారా ఈ నటి బుల్లితెర ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. ఆ తర్వాత ఈమె పలు టీవీ షోలలో కూడా పార్టిసిపేట్ చేసింది. అలాగే కొన్ని సినిమాల్లో కూడా నటించింది. తాజాగా ఇనయా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈ నటి తనకు ఒక వీడియో ద్వారా అనేక కష్టాలు ఎదురయ్యాయని, ఆఖరికి దానివల్ల కుటుంబం మొత్తానికే దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేసింది. తాజాగా ఇనయా సుల్తానా మాట్లాడుతూ... “నేను పుట్టినరోజు వేడుకల్లో రామ్ గోపాల్ వర్మ గారితో కలిసి డాన్స్ చేశాను. ఆ వీడియో అంతలా వైరల్ అవుతుందని నేను అనుకోలేదు. తీరా చూస్తే ఆ తర్వాత ఆ వీడియో చాలా వైరల్ గా మారింది. దాని ప్రభావం నాపై చాలా గట్టిగా పడింది. వీడియో వైరల్ అయిన తర్వాత నా కుటుంబం నన్ను దూరం పెట్టింది. ఆ తర్వాత నా కుటుంబం మాత్రమే కాకుండా నా బంధువులు కూడా నన్ను దూరం పెట్టడం మొదలుపెట్టారు” అని ఆమె చెప్పింది.

## ఇప్పటికి 2000 ఫోక్ సాంగ్స్ చేశాను

ఫోక్ సాంగ్స్ తో మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో జాను లిరి ఒకరు. ఈమె చాలా సంవత్సరాల నుండి ఫోక్ సాంగ్స్ లో నటిస్తూ వస్తుంది. ప్రైవేట్ సాంగ్స్ తో మంచి క్రేజ్ను సంపాదించుకున్న ఈమె ప్రస్తుతం వరుస పెట్టి ఫోక్ సాంగ్స్ చేయడమే కాకుండా టీవీ షోలలో కూడా పాల్గొంటుంది. టీవీ షోల ద్వారా ఈమె తన పాపులారిటీని మరింతగా పెంచుకుంది. అలాగే టెలివిజన్ షోల ద్వారా ఈమె బుల్లితెర అభిమానులను కూడా సంపాదించుకుంది.తాజాగా జాను ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఆమె తనకు సంబంధించిన కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను తెలియజేసింది. తాజాగా జాను మాట్లాడుతూ... నేను చాలా కాలం నుండి ప్రైవేట్ సాంగ్స్ చేస్తున్నాను. ఇప్పటివరకు నేను దాదాపు 2000 వరకు ఫోక్ సాంగ్స్ చేశాను. కొత్తగా కెరియర్ ప్రారంభించిన సమయంలో ఈవెంట్ కు వెళ్ళినట్లయితే ఒక్కో ఈవెంట్ కు 1000 లేదా 1500 రూపాయలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో సాంగ్ కి 20,000 నుండి 50 వేల వరకు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించింది. ఈ మధ్యకాలంలో అనేకమంది ఫోక్ డాన్సర్స్ సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకుంటున్నారు. చాలామందితో పోలిస్తే జాను ఫోక్ డాన్సర్ల విషయంలో చాలా ముందు వరుసలో ఉంది. ఈమె సోషల్ మీడియాలో కూడా చాలా యాక్టివ్గా ఉంటూ వస్తుంది. సోషల్ మీడియాలో కూడా జానుకి చాలామంది ఫాలోవర్స్ ఉన్నారు.





# కోట్లు ఖర్చుపెట్టినా నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు

టాలీవుడ్ ‘సీతమ్మ’గా ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మృణాల్ ఠాకూర్ పేరు ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. తనపై వస్తున్న పెళ్లి పుకార్లకు మృణాల్ ఇచ్చిన అదిరిపోయే కౌంటర్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. సాధారణంగా సెలబ్రిటీలపై పుకార్లు వస్తే వారు అసహనం వ్యక్తం చేస్తారు, కానీ మృణాల్ ఠాకూర్ మాత్రం చాలా వెరైటీగా స్పందించి అందరినీ ఆశ్చర్యపరిచింది. గత కొన్ని రోజులుగా కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్‌తో మృణాల్ ప్రేమలో ఉందని, త్వరలోనే వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని సోషల్ మీడియాలో వార్తలు జోరుగా ప్రచారమవుతున్నాయి. ఈ పుకార్లపై మృణాల్ ఇప్పటికే స్పందించినప్పటికీ పుకార్లకు చెక్ పడటం లేదు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై పుకార్లు సృష్టిస్తూ ట్రోల్ చేస్తున్న వారికి అదిరిపోయే కౌంటర్ ఇచ్చింది. తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ప్రచారాల గురించి మృణాల్ మాట్లాడుతూ.. ‘నా గురించి జరుగుతున్న ఈ ప్రచారం చూసి నేను అస్సలు విసుగు పడటం లేదు. నిజానికి నేను కోట్లు ఖర్చు పెట్టి ఒక పీఆర్ టీమ్‌ను పెట్టుకున్నా నాకు ఇంత పబ్లిసిటీ వచ్చేది కాదు. అందుకే నా గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తున్న వారందరికీ పెద్ద థ్యాంక్స్ చెబుతున్నాను” అని సెటైరికల్‌గా సమాధానమిచ్చింది. పుకార్లు సృష్టించే వారికే రిటర్న్ గిఫ్ట్ ఇచ్చినట్లుగా ఆమె చేసిన వ్యాఖ్యలు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. పెళ్లి గురించి ఇంట్లో ఒత్తిడి ఉందా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. “మా కుటుంబ సభ్యులు కూడా నన్ను నిత్యం పెళ్లి చేసుకోమని, లైఫ్‌లో సెటిల్ అవ్వమని అడుగుతుంటారు. కానీ ఒక నటిగా కెరీర్‌ను బ్యాలెన్స్ చేయడం ఎంత కష్టమో వారికి తెలుసు. ముఖ్యంగా సౌత్ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో నటించడం మామూలు విషయం కాదు.




## విశ్వక్ సేన్‌కి దెబ్బ మీద దెబ్బ.. అసలేమైంది?

గత కొన్నేళ్లుగా చూసుకుంటే తెలుగు మిడ్ రేంజ్ హీరోలకు ఎప్పటికప్పుడు డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ప్రేక్షకుల పల్స్ వీళ్లు అర్థం చేసుకోలేకపోతున్నారా? సరైన స్టోరీలని ఎంపిక చేసుకోలేకపోతున్నారా? తెలియట్లేదు గానీ చేసిన సినిమాలు చేసినట్లు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలవుతున్నాయి. ఒకవేళ సక్సెస్ అయినా సరే కలెక్షన్స్ పెద్దగా రావడం లేదు. దీనికి లేటెస్ట్ ఉదాహరణ విశ్వక్ సేన్. వరసపెట్టి మూడు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. ఇంతకీ తప్పు ఎక్కడ జరుగుతోంది? ‘ఈ నగరానికి ఏమైంది?‘, ‘ఫలక్‌నుమా దాస్‘, ‘హిట్‘ లాంటి సినిమాలతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న విశ్వక్ సేన్.. తర్వాత చేసిన ‘అశోకవనంలో అర్జున కల్యాణం‘తో నటుడిగా ఆకట్టుకున్నాడు. కానీ గత రెండు మూడేళ్లుగా చూసుకుంటే కెరీర్ ఏ మాత్రం ఆశజనకంగా లేదు. 2024లో ఏకంగా మూడు చిత్రాలతో వస్తే.. వాటిలో ‘గామి‘ ప్రయోగాత్మక చిత్రం కావడంతో జనాలకు సరిగా రీచ్ కాలేదు. ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి‘ ఓ మాదిరి రెస్పాన్స్ అందుకుంటే.. ‘మెకానిక్ రాకీ‘ ఘోరంగా దెబ్బతింది. గతేడాది ఇదే టైంకి వచ్చిన ‘లైలా‘ అయితే అల్ట్రా డిజాస్టర్. దీంతో ఏడాది గ్యాప్ తీసుకుని ‘జాతిరత్నాలు‘ దర్శకుడు అనుదీప్‌తో కలిసి ‘ఫంకీ‘ చేశాడు. ఇదీ ఇప్పుడు బాక్సాఫీస్ దగ్గర ఫెయిలైంది. ఒకప్పటితో పోలిస్తే విశ్వక్ సేన్ యాటిట్యూడ్ ఎలా తగ్గిపోయిందో.. బాక్సాఫీస్ దగ్గర అతడి సినిమాలకు ఓపెనింగ్ కలెక్షన్స్ కూడా అలానే తగ్గిపోతూ వస్తున్నాయి. ఓ రకంగా చూస్తే ఇది డేంజర్ బెల్స్ అని చెప్పొచ్చు. ప్రస్తుతం ఇతడి చేతిలో ‘ఈ నగరానికి ఏమైంది‘ సీక్వెల్, దర్శకుడిగా చేస్తున్న ‘కల్ట్‘ ఉన్నాయి. ఈ రెండింటితోనైనా విశ్వక్.. బలమైన కంబ్యాక్ ఇవ్వాల్సి ఉంటుంది. లేదంటే మాత్రం రేసులో వెనకబడిపోవడం గ్యారంటీ. విశ్వక్ సేన్ మాత్రమే కాదు టాలీవుడ్‌లో చాలామంది మిడ్ రేంజ్ హీరోల కెరీర్ దాదాపు ఇలానే ఉంది. గోపీచంద్, రవితేజ లాంటి హీరోల మార్కెట్ ఇప్పటికే చాలా పడిపోయింది. వీళ్లు సినిమాలైతే చేస్తున్నారు గానీ అటు కంటెంట్ పరంగా ఇటు మార్కెట్ పరంగా రెండూ వర్కౌట్ కావట్లేదు. వసూళ్లు కూడా పెద్దగా రావట్లేదు. సాయిధరమ్ తేజ్, సుధీర్ బాబు, శర్వానంద్, అల్లరి నరేశ్, నితిన్, వరుణ్ తేజ్, రామ్ పోతినేని లాంటి హీరోల పరిస్థితీ దాదాపు ఇంతే. పైన చెప్పిన హీరోలు.. తాము అసలు ఎలాంటి సినిమాలు చేస్తే ప్రేక్షకులు చూస్తారో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. అప్పుడో ఇప్పుడో అన్నట్లు వస్తున్నారు. కానీ సక్సెస్ అందుకోలేకపోతున్నారు. వీళ్లు కాకుండా ఉన్న మిగతా మిడ్, చిన్న రేంజ్ హీరోల పరిస్థితి అయితే అంతకంటే దారుణంగా ఉంది. ఇవన్నీ చూస్తుంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉండబోతుందో ఏంటో అనిపిస్తోంది.

# వికసిత్ భారత్ 2047 లక్ష్యం ఇదే!

: ప్రపంచంలోని టాప్-3 ఏఐ సూపర్ పవర్స్?లో భారత్? ఒకటిగా ఉండాలని,వికసిత్ భారత్ 2047 లక్ష్యం? ఇదేనని ప్రధాని మోదీ అన్నారు. ఓ ప్రముఖ వార్తా సంస్థ ఎఎన్?ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక కీలక ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఏఐ, నాగరికత పరంగా ఒక కీలక మలుపులో నిలిచి ఉంది. ఇది మానవ సామర్థ్యాన్ని ఊహించని విధంగా విస్తరించగలదు. కానీ సరైన మార్గనిర్దేశం లేకపోతే ప్రస్తుతం ఉన్న సామాజిక పునాదులను దెబ్బతీయగలదు. అందుకే మేము ఈ సమ్మిట్‌ను కేవలం ఆవిష్కరణల చుట్టూ కాకుండా, అర్థవంతమైన, సమానమైన ఫలితాలను అందించే 'ప్రభావం' చుట్టూ ఉద్దేశపూర్వకంగా రూపొందించాం. దీని మార్గదర్శక స్ఫూర్తి, "సర్వజన్ హితాయ్, సర్వజన్ సుఖాయ్", దేశ నాగరికత తత్వాన్ని ప్రతిబింబిస్తుంది. సాంకేతికత అంతిమ లక్ష్యం 'అందరి సంక్షేమం, అందరి ఆనందం' అయి ఉండాలి. సాంకేతికత మానవాళికి సేవ చేయడానికి ఉనికిలో ఉంది, వారిని భర్తీ చేయడానికి కాదు. ఈ సమ్మిట్ ప్రజలు, ప్లానెట్, పురోగతి అనే అంశాల చుట్టూ రూపొందించారు. ఏఐ వ్యవస్థలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాజాల నుంచి ఉత్పత్తి అయిన జ్ఞానం, డేటాపై ఆధారపడతాయి. కాబట్టి, ఏఐ ప్రయోజనాలు అందరికీ అందాలి. ముందుగా స్వీకరించిన వారి వద్దే నిలిచిపోకూడదు. గ్లోబల్ సౌత్‌లో జరుగుతున్న మొట్టమొదటి గ్లోబల్ ఏఐ సమ్మిట్‌గా, అణగారిన వర్గాల గొంతుకలను, అభివృద్ధి ప్రాధాన్యతలను వినిపించే వేదికను భారత్ సృష్టిస్తోంది. ఏఐ గవర్నెన్స్, సమ్మిళిత డేటాసెట్లు, వాతావరణ అనువర్తనాలు, వ్యవసాయ ఉత్పాదకత, ప్రజారోగ్యం, బహుభాషా ప్రాప్యత వంటివి మాకు అప్రధానమైన అంశాలు కావు. అవి మాకు కేంద్ర బిందువులు. మా విజన్ స్పష్టంగా ఉంది. ఏఐ ప్రపంచ అభివృద్ధిని వేగవంతం చేయాలి, అదే సమయంలో అది పూర్తిగా మానవ-కేంద్రీకృతంగా ఉండాలి.

వికసిత్ భారత్ 2047 దిశగా సాగుతున్న భారత ప్రయాణంలో ఏఐ ఒక విప్లవాత్మక అవకాశాన్ని సూచిస్తుంది. ఏఐని వ్యూహాత్మకంగా, జాగ్రత్తగా వినియోగించుకోవడం ద్వారా లోతైన అభివృద్ధి సవాళ్లను పరిష్కరించవచ్చు. అదే సమయంలో పూర్తిగా కొత్త ఆర్థిక అవకాశాలను సృష్టించవచ్చు, సమ్మిళిత వృద్ధిని సాధించవచ్చు. పట్టణ-గ్రామీణ అంతరాన్ని తగ్గించవచ్చు. అవకాశాలను విస్తృతం చేయవచ్చు. ఆరోగ్య సంరక్షణలో ఏఐ ఇప్పటికే ప్రభావాన్ని చూపుతోంది. ప్రాథమిక, జిల్లా ఆరోగ్య కేంద్రాల్లో క్షయ, డయాబెటిక్ రెటినోపతి, మూర్ఛ సహా అనేక ఇతర వ్యాధులను ముందుగా గుర్తించడంలో ఏఐ ఆధారిత పరిష్కారాలు పనిచేస్తున్నాయి. విద్యా రంగంలో, భారతీయ భాషల్లో ఏఐ ఆధారిత పర్సనలైజ్డ్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, గ్రామీణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారికి తగిన విద్యా సహకారాన్ని అందిస్తున్నాయి. వేలాది గ్రామాల్లోని 36 లక్షల మంది మహిళా పాడి రైతులను చేరుకోవడానికి అమూల్ ఏఐని ఉపయోగిస్తోంది. పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతపై గుజరాతీలో నిజ-సమయ మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, క్షేత్రస్థాయి మహిళా ఉత్పత్తిదారులకు సాధికారత కల్పిస్తోంది. వ్యవసాయంలో, పంటల సలహాలు, నేల విశ్లేషణ, వాతావరణ సమాచారంలో ఏఐని ఏకీకృతం చేయడానికి 'భారత్ విస్తార్'



చొరవ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది రైతులు మెరుగైన, స్థానిక పరిస్థితులకు తగిన నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. వారసత్వ పరిరక్షణలో కూడా పురాతన రాతప్రతులను డిజిటలైజ్ చేయడానికి, అర్థం చేసుకోవడానికి ఏఐ సహాయపడుతోంది. తద్వారా భారతదేశ నాగరికత జ్ఞాన వ్యవస్థలను వెలికితీస్తోంది. ఏఐ అగాధాలను పెంచుతుందని ప్రపంచం ఆందోళన చెందుతున్న వేళ, ఆ అగాధాలను తొలగించడానికి భారత్ దీనిని ఉపయోగిస్తోంది. ప్రతి గ్రామానికి, ప్రతి జిల్లాకు, ప్రతి పౌరుడికి ఆరోగ్యం, విద్య, ఆర్థిక అవకాశాలను అందించడానికి మేము దీనిని సమర్థ సాధనంగా మారుస్తున్నాం.

ఏఐలోని పక్షపాతం, పరిమితులకు సంబంధించిన ఆందోళనలు ఇప్పటికీ లోతుగా ఉన్నాయి. ఏఐ వాడకం పెరిగేకొద్దీ ప్రమాదాలు కూడా పెరుగుతాయి. ఏఐ వ్యవస్థలు లింగం, భాష, సామాజిక-ఆర్థిక నేపథ్యానికి సంబంధించిన పక్షపాతాలను అనుకోకుండానే కొనసాగించవచ్చు. 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వివిధ భాగస్వాములను ఒకచోట చేర్చుతోంది. ఏఐ పక్షపాతాలు, పరిమితులు వంటి విషయాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తోంది. దీనికి ప్రపంచ సహకారం అవసరం. భారతదేశం విషయానికి వస్తే, మేము ప్రత్యేకమైన సవాళ్లను, అవకాశాలను ఎదుర్కొంటున్నాము. మన వైవిధ్యం - భాషా, సాంస్కృతిక, ప్రాంతీయ పరంగా, పాశ్చాత్య సందర్భాల్లో స్పష్టంగా కనిపించని విధంగా ఇక్కడ ఏఐ పక్షపాతం బయటపడవచ్చు. ప్రధానంగా ఇంగ్లీష్ డేటా లేదా పట్టణ సందర్భాలపై శిక్షణ పొందిన ఏఐ వ్యవస్థ, గ్రామీణ వినియోగదారులు లేదా ప్రాంతీయ భాషలు మాట్లాడే వారికి సరిగ్గా పనిచేయకపోవచ్చు. సానుకూల పరిణామం ఏమిటంటే, భారత్ దీనిని మరింత క్రమబద్ధంగా పరిష్కరించడం ప్రారంభించింది.దేశ బహుళత్వాన్ని సూచించే విభిన్న డేటాసెట్‌లను సృష్టించడం, ప్రాంతీయ భాషల్లో ఏఐ అభివృద్ధిపై ఎక్కువ దృష్టి పెట్టడం, భారతీయ విద్యా సంస్థలు, టెక్ కంపెనీలలో నిష్పక్షపాతం, బయాస్‌పై పరిశోధనలు పెరగడం మనం చూస్తున్నాము.

భారతదేశ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రయాణం గ్లోబల్ సౌత్‌కు కీలకమైన,ఆచరణాత్మక పాఠాలను అందిస్తుంది. డీపీఐ, ఏఐ కలయిక సమ్మిళిత అభివృద్ధిలో తదుపరి దశ. ఆధార్, యూపీఐ, ఇతర డిజిటల్ ప్రజా వస్తువులతో మా విజయం యాదృచ్ఛికం కాదు. ఇది పునరావృతం చేయగల కొన్ని సూత్రాల నుంచి వచ్చింది. మొదట మేము డిజిటల్ మౌలిక సదుపాయాలను 'ప్రజాక్షేమం ఆధారంగా నిర్మించాము, ప్రైవేట్ ప్లాట్‌ఫాంగా కాదు. ఒకదానితో ఒకటి పనిచేయగల ఆర్కిటెక్చర్, ఒక సాధారణ బేస్ లేయర్‌పై ఆవిష్కరణలు వర్ధిల్లడానికి అనుమతించింది. రెండోది మేము మొదటి రోజు నుంచే భారీ స్థాయిలో అందరినీ కలుపుకుపోయేలా దీనిని రూపొందించాము. మన వ్యవస్థలు 140 కోట్ల మంది ప్రజలకు, వారి సామాజిక-ఆర్థిక స్థితి, అక్షరాస్యత స్థాయి, ప్రాంతం లేదా భాషతో సంబంధం లేకుండా పని చేస్తాయి. ఈ పునాదిపై ఏఐని జోడించినప్పుడు, పరిపాలన మరింత వేగంగా, సమర్థంగా మారుతుంది. ఏఐ సంక్షేమ పథకాల లక్ష్యాలను మెరుగుపరచగలదు. మోసాలను గుర్తించడాన్ని బలపరచగలదు. మౌలిక సదుపాయాల నిర్వహణను ముందుగానే పసిగట్టగలదు. పట్టణ ప్రణాళికకు మద్దతు ఇస్తుంది. ప్రభుత్వ వ్యవస్థలలో పారదర్శకతను పెంచుతుంది. అదే సమయంలో పటిష్ఠమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, బలమైన డేటా గోప్యతా రక్షణలు, ఆలోచనాత్మకమైన నియంత్రణ చట్రాలు, సమాజంలో ఏఐ అక్షరాస్యత ప్రాముఖ్యాన్ని మేము అర్థం చేసుకున్నాము. మానవ-కేంద్రీకృత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించిన అనుభవంతో, ఏఐ ప్రయోజనాలు చివరి మైలు వరకు - గ్రామాల్లోని రైతులకు, చిన్న పట్టణాల్లోని విద్యార్థులకు, ఎంఎస్‌ఎంఈలకు, మహిళా పారిశ్రామికవేత్తలకు, అసంఘటిత కార్మికులకు, గ్రామీణ, పట్టణ భారతంలోని యువతకు చేరేలా చూడటంలో భారత్ అత్యుత్తమ స్థానంలో ఉంది. ఇది కేవలం పట్టణ ఎలైట్ వర్గానికి మాత్రమే పరిమితం కాకూడదు. సాంకేతికత భౌగోళికం, లింగం లేదా ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సేవ చేయాలి. మా లక్ష్యం కేవలం ఏఐని స్వీకరించడం కాదు. పౌరులకు నిజంగా సాధికారత కల్పించే, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారే భారతదేశ ప్రయాణాన్ని వేగవంతం చేసే ఏఐ కావాలి. అలాగే గ్లోబల్ సౌత్‌కు స్కేల్ చేయగల నమూనాను అందించాలి.

ఏఐ వినియోగదారుడిగానే కాకుండా, సృష్టికర్తగా కూడా ఏఐ పవర్‌హౌస్‌గా మారడానికి భారతదేశానికి కావలసిన ప్రతిభ, వ్యవస్థాపక శక్తి ఉంది. మన స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, టెక్ ఎకోసిస్టమ్ తయారీ రంగాన్ని మెరుగుపరిచే, పాలనను మెరుగుపరిచే, కొత్త ఉద్యోగాలను సృష్టించే ఏఐ పరిష్కారాలను రూపొందించగలవు. మన యువత భారతీయ వాస్తవాలకు అనుగుణంగా, రైతులు, ఎంఎస్‌ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, క్షేత్రస్థాయి ఆవిష్కర్తల కోసం రూపొందించిన ఏఐ పరిష్కారాలను నిర్మించగలరని నాకు నమ్మకం ఉంది. ఏఐని ఆవిష్కరణ, సమ్మిళితత్వానికి గుణకంగా మార్చడానికి మన ప్రతిభావంతులైన యువత చేస్తున్న ప్రతి ప్రయత్నాన్ని బలోపేతం చేయడానికి మేము కట్టుబడి ఉన్నాము. కేంద్ర బడ్జెట్ 2026-27 ఈ విజన్‌ను బలపరుస్తుంది. ఇది డేటా సెంటర్లు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు మద్దతును విస్తరిస్తుంది, దేశీయ కంప్యూట్ సామర్థ్యాన్ని బలపరుస్తుంది. ఇండియా ఏఐ ఫ్రేమ్‌వర్క్ కింద, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలకు హై-పర్ఫార్మెన్స్ ఏఐ కంప్యూట్ వనరులను అందుబాటులోకి తెస్తున్నాము. సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్స్ పిఎల్ఐ, ఏఐ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, డిజిటల్ స్కిల్లింగ్‌పై నిరంతర ఒత్తిడి హార్డ్‌వేర్, మానవ వనరుల పునాదులను బలపరుస్తుంది.

## ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తాం

భారత్-ఫ్రాన్స్ మధ్య ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరినట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. భౌగోళిక రాజకీయ తిరుగుబాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో రక్షణ, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారం గణనీయంగా పెంచుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. కర్ణాటకలోని వేమగల్‌లో ఎయిర్‌బస్ ఎ-125 హెలికాప్టర్ల తయారీ యూనిట్‌ను ఇరువురు వర్చువల్‌గా ప్రారంభించారు. 3 రోజుల భారత పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ ముంబయి లోక్‌భవన్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్న ఇరుదేశాధినేతలు ద్వైపాక్షిక భేటీలో తీసుకున్న నిర్ణయాలను ప్రకటించారు.

అరుదైన ఖనిజాలు, బయోటెక్నాలజీ, అడ్వాన్స్ మెటీరియల్ వంటి రంగాల్లో సహకారం బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఆరోగ్యానికి సంబంధించి ఏఐ ఆధారిత ఇండో-ఫ్రెంచ్ సెంటర్, ఇండో-ఫ్రెంచ్ సెంటర్ ఫర్ డిజిటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ సెంటర్ ఆఫ్ అలయన్స్ ఫర్ స్కిల్లింగ్ ఇన్ ఏరోనాటిక్స్ సంస్థలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇవి కేవలం సంస్థలు కాదని భవిష్యత్ నిర్మాణ వేదికలను ప్రధాని మోదీ ప్రకటించారు. "భారత్‌కు పురాతన వ్యూహాత్మక భాగస్వామిగా ఫ్రాన్స్ కొనసాగుతోంది. రఫేల్ జెట్‌ల నుంచి సబ్‌మెరైన్ వరకు రక్షణ రంగంలో సహకారం అందించుకుంటున్నాయి. ఎవరెస్టంత ఎత్తు వెళ్లగలిగే హెలికాప్టర్లను ఫ్రాన్స్ సహకారంతో భారత్‌లోనే తయారు చేయనున్నాం. యావత్ ప్రపంచానికి ఇక్కడ నుంచే ఎగుమతి అవుతాయి. భారత్, ఐరోపా సంబంధాల్లో ఈ ఏడాది ఎంతో కీలకం. కొన్ని రోజుల క్రితమే ఐరోపా కూటమితో చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాం. ప్రపంచం ఇప్పుడు అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి సమయంలో భారత్-ఫ్రాన్స్ భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి బలానిస్తుంది. ఫ్రాన్స్



నైపుణ్యంతో భారత సామర్థ్యాన్ని జోడిస్తున్నాం. మేం నమ్మకమైన సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నాం. అంతర్జాతీయ సౌరకూటమి, భారత్-మధ్యప్రాచ్యం-ఐరోపా ఆర్థిక కారిడార్ వంటి ఉమ్మడి ప్రాజెక్టుల ద్వారా మానవ అభివృద్ధిని ఖాయం చేయనున్నాం. బహుపాక్షికత, సంప్రదింపులు, దౌత్యం ద్వారా స్థిరత్వం, శ్రేయస్సు కోసం ప్రయత్నాలను బలంగా కొనసాగిస్తాం." భారత్- ఫ్రాన్స్ సంబంధాలు ప్రత్యేకమైనవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారత్-ఫ్రాన్స్ దేశాల మధ్యే కాకుండా, ప్రజల మధ్య కూడా సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమలే కాదు ఆవిష్కరణల్లోనూ ఫ్రాన్స్, భారత్ సహకరించుకుంటాయన్నారు. ఫ్రాన్స్ దశాబ్దాల తరబడి వ్యూహాత్మక భాగస్వామిగా ఉందని గుర్తు చేశారు. ఫ్రాన్స్ సహాయంతో ఎవరెస్టుపైకి వెళ్లగలిగే హెలికాప్టర్ తయారు చేస్తామని, భారత్‌లో తయారయ్యే హెలికాప్టర్లు ప్రపంచమంతా ఎగుమతి అవుతాయన్నారు. క్లీన్ ఎనర్జీ, స్పేస్ వంటి రంగాల్లో భారత్, ఫ్రాన్స్ కలిసి పనిచేస్తాయని వెల్లడించారు.

**ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సహకరిస్తాం : మెక్రాన్**

మరోవైపు భారత్ తమకు ఎంతో విశ్వసనీయ భాగస్వామి అన్నారు ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్. ఇరు దేశాలు చట్టబద్ధ పాలనను బలంగా నమ్ముతాయని, కొన్నేళ్లుగా దీన్ని రెండు దేశాలు నిరూపించాయని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు సహకరిస్తామని చెప్పారు. "రఫేల్, జలాంతర్గాములు అయినా, ఐదో తరం యుద్ధ విమానాల ఇంజిన్లు అయినా మేము భారత్?తో కలిసి పనిచేస్తున్న అనేక రంగాలు ఉన్నాయి. మేము టెక్నాలజీ బదిలీని నమ్ముతాము. మీరు కోరుకున్న విధంగానే మేము అదే చేయడానికి ప్రయత్నించాము. మేమిద్దరం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నమ్ముతాము. మీరు రక్షణ రంగాన్ని ప్రస్తావించారు. నేను కూడా దాని గురించి మాట్లాడాను. కానీ అంతరిక్ష రంగంలో కూడా మా ఆలోచనలను పంచుకునే అనేక ఇతర రంగాలు ఉన్నాయి. ఈ రంగాల్లో మా సంబంధం చాలా సంవత్సరాలుగా అద్భుతంగా ఉంది. అవి గణనీయంగా బలంగా పెరిగాయి. అందుకే జూలైలో ఫ్రాన్స్‌లో నిర్వహించే శిఖరాగ్ర సమావేశానికి భారత్?ను ఆహ్వానించాము." అని మెక్రాన్ అన్నారు.

**తాజ్ హోటల్ వద్ద 26/11 ముంబయి పేలుళ్ల మృతులకు నివాళులు**

అంతకుముందు తాజ్ హోటల్ వద్ద 26/11 ముంబయి పేలుళ్ల మృతులకు మెక్రాన్, ఆయన సతీమణి బ్రిగిట్టి నివాళులు అర్పించారు. అయితే, రఫేల్ ఫైటర్ జెట్ ఒప్పందం, కృత్రిమ మేధలో సహకారం ప్రధాన ఎజెండాలుగా ఫ్రాన్స్? అధ్యక్షుడి పర్యటన సాగుతోంది. దిల్లీలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమిట్‌కు 19న మెక్రాన్ హాజరవుతారు. ఈ క్రమంలోనే భారత్‌కు 114 రఫేల్ యుద్ధవిమానాల సరఫరాకు మెక్రాన్ పర్యటన సమయంలోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. ఈ కాంట్రాక్టు విలువ రూ.3.25 లక్షల కోట్లు కాగా, ఇది ఖరారైతే దేశ చరిత్రలో అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలవనుంది.

## భారత్‌లో డ్రోన్ల విప్లవం.. 38 వేలు దాటిన రిజిస్ట్రేషన్లు

భారతదేశంలో డ్రోన్ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. దేశవ్యాప్తంగా రిజిస్టర్ అయిన డ్రోన్ల సంఖ్య 38,500 మార్కును దాటింది. అదే సమయంలో, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ధృవీకరణ పొందిన రిమోట్ పైలట్ల సంఖ్య 39,890కి చేరినట్లు మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. దేశంలో డ్రోన్ల వినియోగం పెరగడానికి తయారీదారులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, శిక్షణా సంస్థలతో కూడిన ఒక సమగ్ర వ్యవస్థ అభివృద్ధి చెందడమే కారణమని ప్రభుత్వ ప్రకటన పేర్కొంది. డ్రోన్ల ఆపరేటింగ్, నిర్వహణ కోసం నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు 240కి పైగా శిక్షణా సంస్థలు కూడా ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, ఆర్థిక ప్రోత్సాహకాలతో ఈ రంగం కేవలం పైలట్ ప్రాజెక్టుల నుంచి ప్రధాన స్రవంతిలోకి మారింది. వ్యవసాయం, భూమి సర్వేలు, మౌలిక సదుపాయాల పర్యవేక్షణ,



విపత్తుల అంచనా, ప్రభుత్వ సేవల వంటి కీలక రంగాల్లో ఇప్పుడు డ్రోన్లు అంతర్భాగంగా మారాయి. ముఖ్యంగా, 'స్వామిత్వ' పథకం కింద దేశంలోని 3.28 లక్షల గ్రామాల్లో డ్రోన్ల ద్వారా సర్వే పూర్తి చేశారు. దీని ద్వారా 31 రాష్ట్రాల్లోని 1.82 లక్షల గ్రామాలకు సంబంధించి 2.76 కోట్ల ఆస్తి కార్డులను సిద్ధం చేశారు. మహిళా సాధికారతకు కూడా డ్రోన్ టెక్నాలజీ ఊతమిస్తోంది. 'నమో డ్రోన్ దీదీ' కార్యక్రమం కింద 500కు పైగా డ్రోన్లతో సహా, మొత్తం 1,094 డ్రోన్లను మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) పంపిణీ చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో ముస్లిం ఉద్యోగులకు శుభవార్త

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటు కల్పించింది. విధులకు గంట ముందుగా హాజరయ్యేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇదే తరహా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం ఒక మెమో జారీ చేశారు. దీని ప్రకారం, ఫిబ్రవరి 19 నుంచి మార్చి 20 వరకు ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, బోర్డులు/కార్పొరేషన్ల ఉద్యోగులు సాయంత్రం 4 గంటలకు కార్యాలయాల నుంచి వెళ్ళిపోవచ్చు. అత్యవసర సేవలు అవసరమైనప్పుడు మినహా ఈ వెసులుబాటు వర్తిస్తుంది. మరోవైపు, తెలంగాణలో ఉర్దూ మీడియం పాఠశాలల సమయాల్లో కూడా మార్పులు చేశారు. ఉర్దూ మీడియం పాఠశాలలు, డైట్ కాలేజీలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పనిచేస్తాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఇప్పటికే ఈ వెసులుబాటు కల్పించింది. ఫిబ్రవరి 18 నుంచి మార్చి 19 వరకు ముస్లిం ఉద్యోగులు గంట ముందుగా వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. ప్రభుత్వ విభాగాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ఇది వర్తిస్తుందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ గతంలోనే తెలిపారు. రంజాన్ మాసంలో ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పష్టం చేశాయి.

## ఏప్రిల్‌లో తమిళనాడు, బంగాల్, కేరళ అసెంబ్లీ ఎన్నికలు!




తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్‌లో వివిధ తేదీల్లో జరగనున్నట్లు తెలిసింది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం మార్చి రెండు లేదా మూడో వారంలో నోటిఫికేషన్ ఇవ్వనుందని అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, తమిళనాడు, అసోం, కేరళ, బంగాల్ అసెంబ్లీ గడువు మే నెలలో ముగియనుంది. అదేవిధంగా, పుదుచ్చేరి అసెంబ్లీ గడువు కూడా జూన్ 15 నాటికి ముగియనుంది. ఈ నేపథ్యంలో ఈసీ అధికారులు ఇప్పటికే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా, 2021లో బంగాల్‌లో ఎనిమిది విడతల్లో పోలింగ్ నిర్వహించారు. అసోంలో రెండు, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిలో ఒకే విడతలో ఈసీ ఎన్నికలు నిర్వహించింది. మరోవైపు, ఆయా రాష్ట్రాల్లో ఈసీ నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ ముగింపు దశకు చేరుకుంది. పుదుచ్చేరిలో ఓటర్ల తుది జాబితాను ఇప్పటికే ప్రచురించారు.

## మోదీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం



దేశ రాజధాని దిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో ఏర్పడిన గందరగోళం, నిర్వహణ వైఫల్యాలు మోదీ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీని వల్ల అంతర్జాతీయ స్థాయిలో మన దేశ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆరోపించారు. "భారతదేశ డిజిటల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్? (ఏఐ) సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ సమ్మిట్?ను ఒక గొప్ప వేదికగా ఉపయోగించుకోవాల్సి ఉంది. కానీ మోదీ సర్కార్ పీఆర్ ఆకలి వల్ల తీవ్ర గందరగోళానికి, అస్తవ్యస్త నిర్వహణకు వేదికగా మారింది."

'భారత్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ఐదు రోజులపాటు జరగాల్సి ఉంది. అయితే మొదటి రోజైన సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ కేవలం ఫోటోలు ఇవ్వడం కోసం అకస్మాత్తుగా అక్కడకు రావడంతో, వ్యవస్థాపకులు, ప్రదర్శకులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మోదీ రాకతో ఏర్పడిన ఈ గందరగోళం వల్ల డిజీ యాత్ర దారుణంగా విఫలమైంది. ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులు దొంగతనానికి గురయ్యాయి. ఎగ్జిబిటర్స్?కు కనీసం ఆహారం, నీరు అందించలేదు. చివరకు ల్యాప్?టాప్?లు, వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలను, బ్యాగ్?లను కూడా నిషేధించారు. డిజిటల్, యూపీఐ చెల్లింపులకు బదులుగా కేవలం నగదు రూపంలో మాత్రమే పేమెంట్స్ స్వీకరించారు. స్టార్టప్ ఫౌండర్ల నుంచి భారీ మొత్తంలో వసూలు చేసి కూడా, వారికి కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారు. మోదీ సర్కార్? అసమర్థత కారణంగా మన దేశ అంతర్జాతీయ స్థాయిలో పరాభవాన్ని ఎదుర్కోవాల్సి రావడం అత్యంత దురదృష్టకరం"అని మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ఇలాంటి భారీ స్థాయి డిజిటల్, టెక్ సమ్మిట్‌లను ఎలా నిర్వహించాలో ఏటా నిర్వహించే బెంగళూరు టెక్ సమ్మిట్ (బీటీఎస్)ను చూసి మోదీ సర్కార్ నేర్చుకోవాలని ఆయన సూచించారు.

**సమ్మిట్ మోదీ ఫోటో షూట్‌లా మారిపోయింది!**

కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ హ్యాండిల్‌లో మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. "ఏఐ సమ్మిట్ పేరుతో జరిగిన ఈ కార్యక్రమం ప్రధాని మోదీ ఫోటో షూట్?లా మారిపోయింది. ఇందుకోసం ప్రధాన హాల్?ను ఖాళీ చేయించారు. భద్రతా సిబ్బంది సమ్మిట్?కు వచ్చిన వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఫౌండర్లు తమ వస్తువులు పోయాయని ఫిర్యాదు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో డబ్బులు కట్టి స్టాల్స్ ఏర్పాటు చేసుకున్న వారిని అక్కడి నుంచి గెంటేశారు" అని ఆరోపించింది. టెక్నాలజీ ఈవెంట్ అయ్యుండి కూడా ఇంటర్నెట్ సరిగ్గా లేకపోవడంలో చాలా డెమోలు విఫలమయ్యాయని కాంగ్రెస్ విమర్శించింది. మరీ దారుణంగా ఒక డిజిటల్, టెక్ ఈవెంట్‌కు ల్యాప్‌టాప్‌లను, కెమెరాలను నిషేధించడం విడ్డూరంగా ఉందని పేర్కొంది. చివరికి ఫుడ్ స్టాల్స్‌లో కూడా డిజిటల్ పేమెంట్లు చేయడానికి ఒప్పుకోలేదని, కేవలం నగదు రూపంలో డబ్బులు చెల్లించాలని కోరం సిగ్గు చేటని కాంగ్రెస్ విమర్శల వర్షం కురిపించింది. కాగా, భారత్ వేదికగా ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్? సమ్మిట్, ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026 జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రపంచం నలుమూలల నుంచి టెక్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు, వ్యవస్థాపకులు, విధాన నిర్ణేతలు (పాలసీ మేకర్లు) తరలివచ్చారు. ఈ సమ్మిట్ చివరి రెండు రోజుల్లో (ఫిబ్రవరి 19, 20) ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా సహా 20 మందికి పైగా దేశాధినేతలు హాజరుకానున్నారు. ప్రధాని మోదీతో వారు ఏఐ భవిష్యత్ గురించి చర్చించనున్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137